ప్రజల కోసం.. ప్రకృతి కోసం.. సామాన్యుని గొంతుగా.. సామాజిక సమరంగా..

# ధర్మఘంటి

TELTEL/2012/47103

జాతీయ తెలుగు దిన పత్రిక

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 307 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | సోమవారం 2 ఫిబ్రవరి 2026 | పేజీలు : 12 | వెల : 3

**Circulated by:** Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar

### మధ్యప్రాచ్యానికి మారిన భారత చమురు కొనుగోళ్లు

భారత్ ముడి చమురు కొనుగోలు విధానాల్లో మార్పులు చేస్తోంది. అమెరికా ఆంక్షల కారణంగా రష్యా చమురు కొనుగోలు క్లిష్టంగా మారిన నేపథ్యంలో భారత్ ఇప్పుడు సురక్షితమైన వనరులను ఎంచుకుంటోంది. రియల్ టైమ్ అనలిటిక్స్ కంపెనీ కెప్లర్ డేటా ప్రకారం, రష్యన్ ముడి చమురు దిగుమతి జనవరి మొదటి మూడు వారాల్లో రోజుకు 1.1 మిలియన్ బ్యారెళ్లకు పడిపోయింది, ఇది గత నెలలో సగటున 1.21 మిలియన్ బ్యారెళ్లుగా ఉంది.

### త్వరలో యాపిల్ డిజిటల్ చెల్లింపుల సేవలు ప్రారంభం

డిజిటల్ చెల్లింపులకు సంబంధించి భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా ఉంది. ప్రధానంగా యూపీఐ లాంటి డిజిటల్ చెల్లింపుల ప్లాట్‌ఫామ్ కారణంగా లావాదేవీలు అత్యంత సులభంగా, త్వరగా జరుగుతున్నాయి. అయితే, ఈ విభాగంలో దేశీయంగా ఇప్పటికీ గూగుల్, మెటా, అమెజాన్ లాంటి గ్లోబల్ కంపెనీలు, ఫోన్‌పే, పేటీఎమ్, భారత్‌పే లాంటి దేశీయ చెల్లింపుల యాప్‌ల హవా జోరుగా సాగుతోంది.

# యువశక్తి బడ్జెట్



"పవిత్ర మాఘపౌర్ణమి రోజు బడ్జెట్ ప్రవేశపెడుతున్నాం. ప్రపంచ మార్కెట్లతో భారత్‌ను అనుసంధానిస్తున్నాం. భారత దేశ ఆర్థిక ప్రయాణం స్థిరంగా సాగుతోంది. యువశక్తి కేంద్రంగా బడ్జెట్ ప్రవేశపెడుతున్నాం. ప్రజల ఆకాంక్షలను ఆచరణలోకి తీసుకొస్తున్నాం. రైతులు, దళిత, గిరిజన సమూహాలకు అభివృద్ధి ఫలాలు చేరాలి. కర్తవ్యభవన్‌లో రూపొందించిన మూడో బడ్జెట్ ఇది. నైపుణ్యం, పోటీతత్వం, ఉత్పాదకతతో భారత్‌ను ప్రపంచస్థాయికి తీసుకెళ్తాం. సబ్ కా సాత్, సబ్ కా వికాస్ ఆధారిత బడ్జెట్ ఇది. అభివృద్ధిలో అందరి భాగస్వామ్యం ఉండేలా చూస్తాం. 2025 ఆగస్టు తర్వాత 350 సంస్కరణలు తీసుకువచ్చాం. ఆర్థిక ప్రణాళికలపై అంతర్జాతీయ పరిణామాల ప్రభావం ఉంది. ఉద్యోగ కల్పన, ఆర్థిక సుస్థిరత సాధనకు సంస్కరణలే మార్గం."

## రూ.53.47లక్షల కోట్లతో కేంద్ర బడ్జెట్

- పద్దులో 43శాతం పథకాలకే కేటాయింపు
- రెవెన్యూ రాబడులను రూ.35,33,150 కోట్లుగా అంచనా
- మూలధన రాబడులను రూ.18,14,165 కోట్లు
- మూలధన రాబడుల్లో రూ.16,95,768 కోట్లు అప్పులు
- కేటాయింపుల్లో రక్షణ, రవాణా రంగాలకు అగ్ర తాంబూలం
- గ్రామీణ భారతానికి నిధులు విదిల్చారు
- వ్యవహాయానికి టెక్నాలజీ సొబగులు అద్దేలా కేటాయింపులు

2

### దేశ ఆర్థికానికి 3 కర్తవ్యాలు

- రైతులు, దళిత, గిరిజన సమూహాలకు అభివృద్ధి ఫలాలు చేరాలి
- కర్తవ్యభవన్‌లో రూపొందించిన మూడో బడ్జెట్ ఇది
- నైపుణ్యం, పోటీతత్వం, ఉత్పాదకతతో భారత్‌ను ప్రపంచస్థాయికి తీసుకెళ్తాం
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

2

### క్యాన్సర్ బాధితులకు భరోసా

- 'బయో ఫార్మా శక్తి' పథకాన్ని ప్రకటించిన నిర్మలమ్మ
- రూ.10వేల కోట్లతో వచ్చే ఐదేళ్లకు బయో ఫార్మా శక్తి పథకం
- బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించిన నిర్మలమ్మ

### వికసిత్ భారత్‌కు రోడ్‌మ్యాప్‌గా కేంద్ర బడ్జెట్



- బడ్జెట్‌లో ఆత్మనిర్భర్ భారత్‌కు కేటాయింపులు
- త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతుంది
- 2047 మిషన్ లక్ష్యాల మేరకు కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టాం
- వికసిత్ భారత్ ప్రయాణం వేగవంతానికి బడ్జెట్ తోడ్పాటును అందిస్తుంది.

2

### సాగుకు 'ఏఐ' సాయం




- రైతుల కోసం 'భారత్ విస్తార్'
- వ్యవసాయ సూచనలిచ్చే బహుభాషా టూల్
- అన్నదాతల అరచేతికి 'భారత్ విస్తార్'
- ప్రాంతీయ భాషల్లో వ్యవసాయ సూచనలిచ్చే ఏఐ టూల్
- వ్యవసాయ రంగానికి రూ.1,27,290 కోట్ల బడ్జెట్
- పశుపోషణ, డైరీ, పౌల్ట్రీ పరిశ్రమలకు 'క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ పథకం'

3



### దేశవ్యాప్తంగా జిల్లాకొక బాలికల హాస్టల్

- ఐదు యూనివర్సిటీ టౌన్‌షిప్‌లు ఏర్పాటు: బడ్జెట్‌లో నిర్మల
- దేశవ్యాప్తంగా 15,000 కంటే ఎక్కువ పాఠశాలల్లో కంటెంట్ ల్యాబ్‌లు ఏర్పాటుకు మద్దతు
- భారతీయ క్లినికల్ ట్రయల్ సైట్‌ల నెట్‌వర్క్ ఏర్పాటు

2

## బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం



- ఎంపీలంతా కేంద్రంపై ఒత్తిడి పెంచాలి: భట్టి
- ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క
- ఈసారి బడ్జెట్‌లో ఆశించిన మేరకు కేటాయింపులు ఉంటాయని భావించినా.. ఈ ఏడాది కూడా అదే జరిగింది
- సీఎం రేవంత్ రెడ్డితో సహా మంత్రులంతా.. ఎంపీల బృందంతో ప్రధానిని, కేంద్ర మంత్రులను అనేక సార్లు కలిశామని అయినా ప్రయోజనం లేదు

హైదరాబాద్

కేంద్ర బడ్జెట్ తెలంగాణను నిరాశకు గురి చేసిందని ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఈసారి బడ్జెట్‌లో ఆశించిన మేరకు కేటాయింపులు ఉంటాయని భావించినా.. ఈ ఏడాది కూడా అదే జరిగిందని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డితో సహా మంత్రులంతా.. ఎంపీల బృందంతో ప్రధానిని, కేంద్ర మంత్రులను అనేక సార్లు కలిశామని అయినా ప్రయోజనం లేదని విమర్శించారు. మూసీ, రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణలకు బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయని ఆశించామన్నారు. బయోఫార్మాపై ఫోకస్ - మిగతా3లో



### దేశ సంక్షోభంపై మోదీ సర్కార్ గుడ్డిగా వ్యవహరిస్తోంది

- కేంద్ర బడ్జెట్‌పై రాహుల్ గాంధీ విమర్శలు
- కేంద్ర బడ్జెట్-2026పై కాంగ్రెస్ అగ్రనేతల విమర్శలు
- వాస్తవ సంక్షోభాలను విస్మరించారని రాహుల్ మండిపాటు
- యువతకు ఉద్యోగాలు లేవు, పొదుపు ఆవిరైపోతోంది
- అసమానతలు బ్రిటిష్ కాలం నాటికంటే దారుణం

## నిందితుల వాంగ్మూలాల ఆధారంగా సాగిన దర్యాప్తు

- ఫోన్ ట్యాపింగ్ కేసు - ముగిసిన మాజీ సీఎం కేసీఆర్ విచారణ
- నందినగర్‌లోని కేసీఆర్ నివాసంలో ముగిసిన సిట్ విచారణ
- కేసీఆర్ కీలక వాంగ్మూలాన్ని నమోదు చేసిన సిట్
- కేసీఆర్‌ను 4 గంటల 50 నిమిషాల పాటు ప్రశ్నించిన సిట్ అధికారులు
- కేసీఆర్ వాంగ్మూలాన్ని ఆడియో, వీడియో రికార్డ్ చేసిన అధికారులు



హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విచారణ ముగిసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను నందినగర్‌లోని ఆయన నివాసంలో సిట్(స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్) అధికారులు సుమారు 5 గంటలుగా విచారణ చేశారు. విచారణ ప్రక్రియను ఆడియో, వీడియో రూపంలో ఐదుగురు ఉన్నతాధికారుల సిట్ బృందం రికార్డింగ్ చేసింది. విచారణ అనంతరం ఆయన వాంగ్మూలాన్ని అధికారులు నమోదు చేసుకున్నారు. ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన నిందితులు ఇచ్చిన సమాచారం, వాంగ్మూలాల ఆధారంగా సిట్ అధికారులు కేసీఆర్‌పై ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది. మొత్తం విచారణ ప్రక్రియను సిట్ - మిగతా3లో



### మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా సునేత్ర ప్రమాణం

- ఆ పదవిని చేపట్టిన తొలి మహిళగా ఆమె ఖ్యాతి గడించారు.
- సునేత్రకు ఎక్సైజ్ శాఖ కేటాయింపు
- సునేత్ర ప్రమాణంతో ఎన్సీపీ చీలిక వర్గాల విలీనానికి విఘాతం కలిగినట్టు కనిపిస్తోంది.

## అంతర్జాతీయ వేదికపై తెలంగాణ ఏఐ విజన్

**హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ నిర్వహించనున్న తొలి ఏఐ పాలసీ సింపోజియానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆహ్వానం**



- విదేశీ పర్యటన ముగించుకున్న రేవంత్ రెడ్డి.. హైదరాబాద్‌కు ముఖ్యమంత్రి
- తెలంగాణ రైజింగ్- 2047 విజన్ లక్ష్యాలను ప్రపంచానికి వివరించడానికి రేవంత్‌రెడ్డి బృందం పర్యటన
- హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి సర్టిఫికెట్ కోర్సు చేసిన మొదటి సీఎంగా ఘనత
- అమరవీరుల స్మారక ట్రస్టు కార్యక్రమానికి సీఎం
- రాత్రి హైదరాబాద్ రానున్న సీఎం రేవంత్‌రెడ్డి రేపు మంత్రులు, పీసీసీ ముఖ్యనేతలతో సమావేశమై తాజా రాజకీయ పరిస్థితులు, పరిణామాలపై చర్చ
- మున్సిపల్ ఎన్నికలు, ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్, ముఖ్య నేతల విచారణ, బొగ్గు గనుల వివాదం తదితర అంశాలపై సమాలోచనలు జరిపే అవకాశం

హైదరాబాద్

విదేశీ పర్యటన ముగించుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నేడు హైదరాబాద్‌కు రానున్నారు. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సులో పాల్గొని అమెరికాలో లీడర్‌షిప్ కోర్సు పూర్తి చేసిన సీఎం, ఈ రాత్రికి నగరానికి చేరుకోనున్నారు. రేపు మంత్రులు, పీసీసీ ముఖ్యనేతలతో సమావేశమై తాజా రాజకీయ పరిస్థితులు, పరిణామాలపై చర్చించనున్నారు. ఈ నెల 4 నుంచి సీఎం మున్సిపల్ ఎన్నికల ప్రచారం కోసం జిల్లాల్లో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన ముగిసింది. - మిగతా3లో



### ఇది దిశానిర్దేశం లేని అబద్ధాల బడ్జెట్

- పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ
- ఈ బడ్జెట్ ద్వారా కేంద్రం దేశ ఆర్థికవ్యవస్థను సర్వనాశనం చేస్తోంది
- ఈ బడ్జెట్‌కు ఎలాంటి లక్ష్యం లేదు
- ఇది పూర్తిగా పేదలు, మహిళలు, రైతులు, యువత, సామాన్యులతో పాటు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు వ్యతిరేకమైనది

ధర్మఘంట

## సంపాదకీయం

# చిరకాల ఆకాంక్ష

ఆలోచనకూ, అది సాకారం కావటానికీ మధ్య ఇరవై రెండేళ్ల సుదీర్ఘకాలం పట్టిందంటే కొంత ఆశ్చర్యం కలుగుతుంది. భారత్, యూరోపియన్ యూనియన్(ఈయూ)ల మధ్య మంగళవారం సంతకాలైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్టీఏ) వెనక ఇలాంటి ఆశ్చర్య పోయే సంగతులు చాలానే ఉన్నాయి. బహుశా 'నియమాల ఆధారిత' అంతర్జాతీయ క్రమాన్ని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ధ్వంసించటం మొదలెట్టకపోతే ఈ ఎఫ్టీఏకు మరికొంత సమయం పట్టేదేమో! ఈయూతో ఒప్పందమంటే ఆర్థిక స్థోమత పుష్కలంగా ఉన్న 27 యూరోప్ దేశాలతో బహువిధ రంగాల్లో ప్రగాఢమైన అనుబంధం ఏర్పడటమే! అందుకే ఈ ఒప్పందాన్ని 'సకల ఒప్పందాలకూ తల్లిలాంటిద'ని చెప్పటంతో పాటు, దీన్ని కేవలం వాణిజ్య ఒప్పందంగా కాక, ఉమ్మడి శ్రేయస్సు కోసం రూపొందించిన 'బ్లూ ప్రింట్'గా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. భారత్, ఈయూలు రెండూ ప్రపంచ జీడీపీలో 25 శాతం, వాణిజ్యంలో మూడోవంతు వాటా కలిగివున్న రెండు ప్రధాన ఆర్థికవ్యవస్థలు. విడిగా చూస్తే మన దేశం ప్రపంచంలో నాలుగో అతి పెద్ద ఆర్థికవ్యవస్థ. కూటమిగా ఈయూ రెండో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ. ఉక్రెయిన్ యుద్ధం వంటి ఆటుపోట్లు... అమెరికా, చైనాల నుంచి తీవ్రమైన పోటీ ఉన్నా ఈయూ ఆర్థిక వ్యవస్థ నిలబడగలుగుతోంది. మన డెయిరీ రంగానికి ఎఫ్టీఏలో మినహాయింపు ఇచ్చేందుకు ఈయూ అంగీకరించింది. అయితే చిన్న, మధ్యతరహా సంస్థల ప్రవేశానికీ, సర్వీసుల రంగానికీ మన దేశం వెసులుబాటు నిచ్చింది. కార్ల దిగుమతిపై ఉన్న 110 శాతం సుంకాలు పది శాతానికి పడిపోతాయి. ఎన్నడో 2004లో ఒక ఆలోచనగా బయల్దేరిన ఎఫ్టీఏ జాప్యం కావటంలో ఈయూ మొండి వైఖరే ప్రధాన కారణం. అసలు దానిపై చర్చల ప్రారంభానికే మూడేళ్లు పట్టింది. అప్పట్లో ఈయూకు చైనాయే ఇష్టసఖి. అందుకే భారత్‌ను పెద్దగా పట్టించుకున్న పాపాన పోలేదు. కానీ అమెరికాతో మనకు కుదిరిన పౌర అణు ఒప్పందం '123' దాని కళ్లు తెరిపించింది. 2013లో ఎఫ్టీఏ కోసం ఈయూ విధించిన షరతులు లీకైనప్పుడు నిరస నలు వెల్లువెత్తాయి. మేధాసంపత్తి హక్కుల పేరిట తన ఫార్మా రంగాన్ని రక్షించుకోవ టానికి ఎఫ్టీఏలో ఈయూ పెట్టిన నిబంధన మన ప్రజారోగ్య రంగానికి చేటు తెస్తుందని, జెనెరిక్ మందుల ఉత్పత్తి నిలిచిపోతుందని ఆక్స్‌ఫామ్ వంటి సంస్థలు హెచ్చరించాయి. సాగు రంగంపై అది చూపగల ప్రభావంపైనా భయాందోళనలు వ్యక్తమ య్యాయి. ఇవి గాక అనంతర కాలంలో కశ్మీర్‌కు స్వయంప్రతిపత్తినిచ్చే 370వ అధికరణం రద్దు, పౌరసత్వ సవరణ చట్టం వగైరాలు ఈయూకు అభ్యంతరకరం అనిపించాయి. ఈమధ్య పలు దేశాలతో మనకు ఎఫ్టీఏలు కుదిరాయి. ఆస్ట్రేలియా, బ్రిటన్, న్యూజిలాండ్, ఒమన్, మారిషస్, యూఏఈలతోపాటు ఐస్‌ల్యాండ్, లిచెన్‌స్టీన్, నార్వే, స్విట్జర్లాండ్‌లతో కూడిన యూరోపియన్ స్వేచ్ఛా వాణిజ్య సంఘం(ఈఎఫ్టీఏ)తో సైతం ఎఫ్టీఏలపై సంతకాలు చేసింది. ఈయూతో సంబంధంలేని కూటమి ఈఎఫ్టీఏ. ఉభయపక్షాల ద్వైపాక్షిక వాణిజ్యం విలువ నిరుడు మార్చి ఆఖరునాటికి 13,600 కోట్ల డాలర్లు. ఈయూ సరుకుల ఎగుమతుల జాబితాలో భారత్‌ది అగ్రస్థానం. అయితే తాజా ఎఫ్టీఏ అమల్లోకి రావటానికి కొన్ని అవరోధాలున్నాయి. ఈ నెల 1 నుంచి కార్బన్ బోర్డర్ అడ్జెస్ట్‌మెంట్ మెకానిజం(సీబీఏఎం) పేరిట ఈయూ అమల్లోకి తెచ్చిన 'పర్యా వరణ పన్ను' ప్రధాన అవరోధం. ఉక్కు, సిమెంట్, అల్యూమినియం, ఎరువుల వంటివి చవగ్గా ఉత్పత్తి చేయటానికి కర్బన ఉద్గారాల ముప్పును భారత్ పట్టించుకోవటం లేదని, అందుకే ఇది అవసరమని ఈయూ వాదన. దీన్ని మన దేశం ఖండిస్తోంది. కేవలం తమ ఉత్పత్తుల్ని రక్షించుకోవటానికి ఇదొక సాకు మాత్రమేనన్నది మన వాదన. సీబీఏఎం నుంచి భారత్‌కు మినహాయింపు ఇస్తుందా, అసలు దాని అమలునే ఈయూ వాయిదా వేస్తుందా అన్నది చూడాలి. ఇవిగాక ఆరోగ్యం, భద్రత ప్రమాణాలు... కార్మిక హక్కులు, పర్యావరణ పరిరక్షణ, లింగ సమానత్వం వంటివి కూడా ఉన్నాయి. కానీ ట్రంప్ దూకుడు నుంచి కాపాడుకోవాలంటే ఇలాంటి సాకులు వదులుకోక తప్పదు. మొత్తానికి 27 యూరోప్ దేశాల చట్టసభలతోపాటు ఈయూ పార్లమెంటు, మన

# సర్వేలో ఆశావహ స్వరం

ప్రపంచవ్యాప్తంగా అలముకున్న అనిశ్చితికి తోడు, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధిస్తున్న అదనపు సుంకాలు, పడిపోతున్న రూపాయి విలువ, ఉపాధి లేమి తదితరాలు హడలెత్తిస్తున్నాయి. ఇలాంటి స్థితిలో దేన్నయినా అంచనా వేయటమంటే కత్తి మీద సాము. ఈ నేపథ్యంలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంటుకు ఆర్థిక సర్వే సమర్పించారు. ముగియబోతున్న ఆర్థిక సంవత్సరంలో మన స్థితిగతులెలా ఉన్నాయో వివరించి, ఇకముందు రాగల సవాళ్లేమిటో... వాటిని అధిగమించటానికి ప్రభుత్వానికున్న ఆలోచనేమిటో స్థూలంగా వివరించటం ఆర్థిక సర్వేల లక్ష్యం. నిజానికి ఆర్థిక సర్వేకు ముందురోజు పార్లమెంటు ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేసిన ప్రసంగంలో సంస్కరణలు మరింత వేగవంతం కాబోతున్నాయని సూచనప్రాయంగా చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మన జీడీపీ 6.87.2 శాతం మధ్య ఉండొచ్చని ఆర్థిక సర్వే అంచనా వేసింది. ప్రపంచ దేశాలన్నిటా ఆర్థికంగా మందగమనం కొనసాగుతున్నా మన దేశం 'వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ'గా కొనసాగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేసింది. ఇలా ఆశించటానికి కారణం ఉంది. వృద్ధి రేటు బలంగా ఉండటం, మునుపెన్నడూ లేనంతగా ద్రవ్యోల్బణం అదుపులో ఉండటం సామాన్యమైన విషయం కాదు. ఇటువంటి ఆర్థిక వ్యవస్థను ఆర్థిక నిపుణులు 'గోల్డీలాక్స్ ఎకానమీ' అంటారు. దేశం ఏదైనా, పాలకులు ఎంతగానో కోరుకునే సమతౌల్య స్థితి ఇది. స్వేచ్ఛగా ప్రాథమ్యాలను ఎంచుకోవటానికీ, దూకుడుగా ముందుకు పోయేందుకూ అనువైన బడ్జెట్‌ను రూపొందించుకొనేందుకు ఇది వీలు కల్పిస్తుంది. కానీ ఒడుదొడుకులు ఉన్నా యని ఆర్థిక సర్వే గమనిస్తే అర్థమవుతుంది. 202526 సంవత్సరానికి గణాంకాల మంత్రిత్వ శాఖ లోగడ అంచనా వేసిన వాస్తవ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 7.4 శాతంకాగా, అది అంతకన్నా తక్కువే ఉంటుందని సర్వే చెబుతోంది. పన్ను వసూళ్లలో 11 శాతం వృద్ధి ఉండొచ్చని నిరుడు అంచనా వేస్తే అది 8 శాతం మించలేదు. నిరుడంతా విదేశీ మదుపుదారులు 1,900 కోట్ల డాలర్లమేర వెనక్కి తీసుకోగా, ఈ జనవరిలోనే 400 కోట్ల డాలర్ల ఈక్విటీలు విక్రయించారు. సంస్కరణలు




మొదలయ్యాక ఇలా జరగటం ఇదే ప్రథమం. అయితే విదేశీ మారక నిల్వల్లో మనం ప్రపంచ దేశాల్లో అగ్రస్థానంలో ఉన్నామని సర్వే వివరిస్తోంది. ఈ నిల్వలు 701.4 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని చెబుతోంది. అలాగే ప్రవాస భారతీయుల ద్వారా వచ్చే విదేశీ మారక ద్రవ్యం కూడా భారీగా పెరిగింది. ముగుస్తున్న సంవత్సరంలో ఇది 135.4 బిలియన్ డాలర్లు. దేశ ఆర్థిక వ్యవస్థను పీడిస్తున్న సమస్యలకు మూలం ప్రపంచ స్థితిగతుల్లో ఉంది తప్ప అది అంతర్గతమైంది కాదని సర్వే ప్రకటించింది. అయితే తయారీ రంగ పరిశ్రమలు విస్తరించి, ప్రజల కొనుగోలు శక్తి పెరిగేలా చూడటం మన బాధ్యతే. కృత్రిమ మేధ(ఏఐ)తో ఉద్యోగాలు పోతాయన్న భయాలు అవాస్తవమనీ, పైపెచ్చు తగిన మార్పులు చేస్తే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయనీ సర్వే అంటున్నది. డిజిటల్ ప్లాట్‌ఫాంల ద్వారా, యాప్‌ల ద్వారా దేశంలో శరవేగంతో విస్తరిస్తున్న 'గిగ్ ఎకానమీ'పై ఈ సర్వే దృష్టి సారించటం ప్రశంసనీయం. 2021లో ఈ రంగంలో 77 లక్షల మంది ఉండగా, వారి సంఖ్య ప్రస్తుతం కోటీ 20 లక్షలు. కానీ దాదాపు 40 శాతం మంది నెలకు రూ. 15,000 కన్నా తక్కువే సంపాదిస్తున్నారని చెబుతూ... గంటకు నిర్ణీత మొత్తం ఇచ్చేలా, లేక నిర్దేశించిన లక్ష్యానికి ఫలానా మొత్తం అనే విధంగా ఉంటే మెరుగైన ఆర్జన సాధ్యమవుతుందని సర్వే భావించింది. వారి పని పరిస్థితులు మెరుగయ్యేలా చూస్తామని వాగ్దానం చేస్తోంది. అయితే సామాజిక రంగంలో ప్రభుత్వ వ్యయాన్ని మరింత పెంచితే తప్ప, ఉగ్రరూపం దాలుస్తున్న ఉపాధి లేమిని సరిచేస్తే తప్ప వాస్తవ అభివృద్ధి సాధ్యపడదు. ముఖ్యంగా విద్య, వైద్య రంగాల్లో ప్రభుత్వ వ్యయం చాలా తక్కువుంది. ఆ రంగాలపై శ్రద్ధ పెట్టనంతకాలం నాసిరకం చదువులు, అనారోగ్యం, పౌష్టికాహార లోపం వంటి సమస్యలు పీడిస్తూనే ఉంటాయి. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచిస్తున్నదేమిటో రెండు రోజుల్లో రాబోయే బడ్జెట్ తేటతెల్లం చేస్తుంది.

# అనంత మహిమాన్వితం మహామాఘి

నక్షత్ర మండల మార్గాన్ని అనుసరించి చంద్రుడు భూమి చుట్టూ తిరుగుతూ ఉంటాడు. ఆ మార్గంలో లెక్కలేనన్ని నక్షత్రాలు ఉన్నాయి. సదరు మార్గాన్ని మన పూర్వీకులు ఇరవై ఏడు భాగాలుగా విభజించారు. అవి దాదాపు సమా నంగా ఉంటాయి. ఒక్కొక్క భాగానికి ఒక్కొక్క పేరు పెట్టారు. ఆ భాగంలో ఎక్కువ కాంతి వంతంగా ఉండే నక్షత్రాన్ని బట్టి ఆ భాగానికి పేరు పెట్టారు. ఇరవై ఏడు నక్షత్రాలలో మఘ ఒకటి. అందులో ఐదు ప్రముఖ నక్షత్రాలు పల్లకి ఆకా రంలో చెదరి ఉంటాయి. మాసానికి ఒక సారి చంద్రుడు ఆ నక్షత్రంలో ప్రవేశిస్తాడు. కాని ఏడాదిలో ఒకేసారి చంద్రుడు పదహారు కళలతో ఒప్పుతూ మఘ నక్షత్రంలో ప్రవేశిస్తాడు. అదే మాఘ పూర్ణిమ. దానినే "మహామాఘి" అంటారు. చంద్రుడు కాంతి నిస్తంద్రుడై ప్రకాశించే దినాలు ఏడాదికి పన్నెండు ఉంటాయి. అవే పద హారు కళలతో ఒప్పుతూ చంద్రుడుండే రోజులు. పన్నెండు పౌర్ణమిలలో ఒక్కొక్క నక్షత్రంతో చంద్రుడు కూడి ఉంటాడు. ఆయా నక్షత్రాలను బట్టి ఆపౌర్ణమిని పిలుస్తారు. మాఘ నక్షత్ర యుక్త పూర్ణిమను మాఘీయని, అలాగే ఫాల్గుణీ, చైత్రీ, వైశాఖీ, జ్యేష్ఠీ, ఆషాడీ, శ్రావణీ, భాద్రపదీ, ఆశ్వ యుజీ, కార్తీకీ, మార్గశీర్షీ అనే పేర్లతో పిలువబడేవి హిందువులకు పన్నెండు పర్వాలు. భోగ్య అర్హమైన శుక్లపక్షం వెన్నెల ఊరికే పోకుండా మన పెద్దలు శు క్ల పక్షంలోనే పండువలు అధికంగా ఏర్పరిచారు. దశావతారాల్లో ఒకటైన కూర్మావతారం, మహా భక్తుడైన హన్మంతుడు, మానవ ప్రపంచంలో మహనీయుడైన గౌతమ బుద్ధుడు పౌర్ణమిల యందే జన్మించారు. ఇక మాఘ పూర్ణమి విషయానికి వస్తే...మఘ నక్షత్రంలో చంద్రుడు పదహారు కళలతో ప్రకాశించే దినమే మాఘ పౌర్ణమి. దీనిని మహా మాఘి అని పంచాంగ కర్తలు అంటారు. పార్వతీ దేవి ఈదిన మునసే ప్రాదుర్భవించినదని పురాణాధారం. దక్షప్రజాపతికి దక్షిణావర్తపు శంభాకారపు పద్మ ఆకారాన్ని ధరించిన సతీదేవి హస్తస్పర్శతో కన్యగా మారిన రోజే మాఘ పౌర్ణమి. కావేరీ ఉత్తరాన స్వామిమలపై వెలసిన సుబ్రహ్మణ్య స్వామి, తెలియని విషయాన్ని విద్యా వేత్తయైన తన తండ్రికి చెప్పిన దినమైనందున అక్కడ ఈరోజు ఉత్సవం జరుగుతుంది. మాహామాఘి.నాడే జగద్గురువు ఆదిశంకరులు పంచాయతన పూజావిధిని ప్రారంభించారంటారు. మహా మాఘి అనబడే ఈ పర్వం పేరిటనే కుంభకోణంలో దాదాపు ఇరవై ఎకరాల



వైశాల్యం కలిగిన ఒక కోనేరు ఉంది. తంజావూరు తెలుగు నాయక రాజులు ఆ కోనేటి చుట్టూ రాతి పావంచాలు, గట్టు చుట్టూ నలువైపులా పదహారు దేవళాలు కట్టించారు. అందు లో విశ్వనాథ దేవాలయం ఒకటి. అది కోనేరు ఉత్తరాన ఉం ది. ఆ ఆలయంలో శిలలపై గల శిల్పచిత్రాకృతులు ఉండగా, మాఘ పూర్ణిమ నాడు నవ నదులకు గొప్ప అర్చన జరు గుతుంది. మాఘపూర్ణిమ నాడు... కుంభకోణం లోని కోనే రులో గంగ, యమున, గోదావరి, సరస్వతి, నర్మద, కావేరి, కృష్ణ కుమారి, పయోషిణి అనే నవ నదులు ప్రవేశిస్తాయని, అందుకే పౌర్ణిమ నాడు సదరు కోనేట్లో తైర్థికులు స్నానాలాచరించడం పరిపాటి. మఘ నక్షత్రాధిపతియైన బృహ స్పతిని ఈనాడు పూజించాలని చెపుతారు. మాఘ పౌర్ణమి ద్వాపర యుగాది యని కొన్ని గ్రంథాలు చెపుతున్నాయి. ఈ పర్వదినం నాడు అరుణోదయ స్నానం, తిలపాత్ర కంచుక కంబళాది దానాలు చేయాలని, తిలహోమం, తిలదానం, తిలభక్షణం చేయాలని శాస్త్ర వచనం. అన్ని పౌర్ణమిల్లో కల్లా మహా మాఘి చాలా విశిష్టమైనది. మాఘ మాసంలో దేవతలు తమ సర్వ శక్తులు, తేజస్సులను జలాల్లో ఉంచుతారు. అందువల్ల మాఘ స్నానం చాలా గొప్పది. నది దగ్గరలో లేని వారు కనీసం చెరువులో గానీ, కొలనులోగానీ, లేక బావి దగ్గర గానీ స్నానం ఆచరించాలి. మాఘ స్నానం ప్రవాహ జలంలో చేస్తే అధిక ఫలితం. స్నానానంతరం సమస్త జీవరాశికి ఆధారమైన సూర్య భగవానుడికి ఆర్ఘ్యం సమర్పించాలి. వైష్ణవ, శివాలయానికి గానీ వెళ్లి దర్శనం చేసుకోవాలి. అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించడమే కాకుండా శక్తిమేరకు దాన ధర్మాలు చేయాలి. ఈ రోజున గొడుగు, నువ్వులు దానం చేస్తే విశేష ఫలం లభిస్తుంది. దీని వల్ల జన్మజన్మలుగా వెంటాడుతోన్న పాపాలు, దోషాలు నశించి, అశ్వమేథ యాగం చేసినంత ఫలితం దక్కుతుందని సాక్షాత్తు శ్రీ కృష్ణుడే ధర్మరాజులు వివరించినట్లు పురాణ కథనం. మాఘ పౌర్ణమి రోజున చేసే స్నానం, పూజలు, దానాలు వల్ల వ్యాధులు, చికాకుల నుంచి విముక్తి కలుగుతుంది. ఆ పుణ్య ఫలాల విశేషం కారణంగా ఉన్నత జీవితం లభిస్తుంది. మరణం అనంతరం కోరుకునే శాశ్వత స్వర్గలోక ప్రాప్తి కలుగుతుంది. "గంగేచ యమునేచైవ గోదావరి సరస్వతి, నర్మదే సింధు కావేరీ జలేస్మిన్ సన్నిధింకురు" అనే శ్లోకం పఠిస్తూ స్నానం ఆచరించాలి.

## సాహితీ వటవృక్షం జువ్వాడి గౌతమరావు

ఆయన ఒక సాహితీ వటవృక్షం. స్వయంగా కవి మాత్రమే కాకుండా, ఎందరో సాహితీ వేత్తలకు ఆశ్రయ దాత. దివంగత ప్రధాని పీ.వి. నరసింహా రావు, కాళోజీ నారాయణరావు, కోవెల సుప్రసన్న, సంపత్ కుమార ఆచార్య, సామల సదాశివ లాంటి సాహితీ దురంధరులతో సాన్నిహిత్యం కలిగి ఉన్నవారు. ప్రధానంగా కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణతో ఆయనకు గల అనుబంధం, విశ్వనాథను కరీంనగర్ రప్పించి, అక్కడి డిగ్రీ కళాశాల ప్రాచార్యునిగా విధులు నిర్వహించేలా చేసింది. తద్వారా ఉత్తర తెలంగాణకు చెందిన సాహితీవేత్తల సంగమానికి వేదికను ఏర్పరచి, సాహిత్య సుసంపన్నానికి కార్య క్షేత్రాన్ని సిద్ధం చేసింది. ఇలా కరీంనగర్‌లో సాహితీ సౌరభాలు గుబాలించ డానికి అహరహం శ్రమించిన సాహితీ ప్రియుడు జువ్వాడి గౌతమరావు. గౌతమ రావు సాహితీవేత్తనే కాకుండా, స్వాతంత్ర్య పోరాటంలో యోధుడు. సోషలిస్టు భావాలను జీర్ణించుకున్న వ్యక్తి. ఔరంగాబాద్ జైలు గోడలను ఛేదించుకొని వచ్చిన ధైర్యశాలి. పార్టీ పక్షాన 1977లో పోటీ చేసి ఓటమి చెందాడు. జువ్వాడి గౌతమరావు (ఫిబ్రవరి 1, 1929 – 2012) కరీంనగర్ మండలం ఇరుకుళ్ళ గ్రామంలో 1929, ఫిబ్రవరి 1 న జువ్వాడి గౌతమరావు జన్మించాడు. కరీంనగర్‌లో విద్యాభ్యాసం సాగించాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బీఏ ఎల్‌ఎల్‌బీ పట్టా పుచ్చుకున్నాడు. పీవీ నరసింహారావు, కోవెల సుప్రసన్నాచార్య, కోవెల సంపత్కుమారాచార్య వంటి సాహితీ మిత్రులతో ఆయనకు చాలా సాన్నిహిత్యం ఉన్నది. కరీంనగర్ సాహిత్య చైతన్య కేంద్రంగా భాసిల్లడంలో గౌతంరావు పాత్ర అసామాన్యం, అద్వితీయం. కరీంనగర్‌లో తెనుగు ఉనికిని కాపాడుతూ, అనేక కవితా గోష్ఠులలో పాల్గొంటూ నిరంతర సాహిత్య సేవ చేసిన భాషాభిమాని జువ్వాడి. ఆధునిక కాలంలో అడుగంటి పోతున్న సంప్రదాయ కవితా పరిరక్షణ కోసం పాటు పడ్డాడు. వరంగల్‌లో కాళోజీ, ఆదిలాబాదులో సామల సదాశివ మాదిరిగా కరీంనగర్‌లో జువ్వాడి గౌతంరావు సాహితీ వటవృక్షంగా వేలాది మంది సాహితీ కారులకు ఆశ్రయ మిచ్చాడు. ప్రగతి గామిగా ఉంటూనే విశ్వనాథ రామాయణ కల్పవృక్షానికి, విశ్వనాథకు భక్తుడిగా మారాడు. ప్రేమతో విశ్వనాథుని తన హృదయంలో దాచుకొన్నాడు. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణకు జువ్వాడి అత్యంత ఆత్మీయుడు. విశ్వనాథ రచించిన రామాయణ కల్పవృక్షాన్ని శ్రావ్యమైన కంఠంతో తమదైన శైలిలో అంతరార్థాలను విశదీకరిస్తూ రసికులకు వినిపించ గలిగి, అయన మూర్తి తత్వాన్ని ఆవిష్కరించాడు. తానే రచించాడా అన్నంతగా ప్రజల్లోకి రామాయణ కల్పవృక్షాన్ని తీసుకెళ్లాడు. జువ్వాడి ప్రోద్బలంతోనే విశ్వనాథ సత్య నారాయణ కరీంనగర్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పని చేశారు. విశ్వనాథ 'భక్తియోగ' అనే పద్యకావ్య సంపుటిని జువ్వాడి కోసం రాసి అంకితం ఇచ్చారు. 'కల్పవృక్షంలో కైకేయి', 'వేయి పడగలలో విశ్వనాథ జీవితం' వంటి జువ్వాడి సాహిత్య వ్యాసాలు సాహిత్యలోకంలో సంచలనాలు సృష్టించాయి. నవ్య సాహిత్యోద్యమ కాలంలో కవిసామ్రాట్ విశ్వనాథ సత్య నారాయణ కొంతకాలం పాటు "జయంతి" అనే సాహిత్య పత్రిక నడిపాడు. తర్వాత దానికి జువ్వాడి సారథ్యం వహించాడు.

ధర్మఘంట

# యువశక్తి బడ్జెట్



స్వాతంత్ర భారత చరిత్రలో తొలిసారి ఆదివారం కేంద్ర వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ వికసిత్ భారత్ లక్ష్య సాధన దిశగా సంస్కరణల పథాన్ని కొనసాగింపునకే మొగ్గుచూపారు. ఈ మేరకు 2026-27 వార్షిక బడ్జెట్‌ను లోక్‌సభకు సమర్పించిన ఆమె మొత్తం రూ.53,47,315 కోట్లతో ప్రతిపాదించారు. ఇందులో రెవెన్యూ రాబడులను రూ.35,33,150 కోట్లుగా అంచనా వేసిన ఆర్థిక మంత్రి అందులో పన్నుల ద్వారా రూ.28,66,922 కోట్లు, పన్నేతర ఆదాయం ద్వారా రూ.6,66,228 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. మూలధన రాబడులను రూ.18,14,165 కోట్లుగా ప్రతిపాదించారు. మూలధన రాబడుల్లో రూ.16,95,768 కోట్లు అప్పులు ద్వారా సమీకరించనున్నట్లు వివరించారు. కేటాయింపుల్లో రక్షణ, రవాణా రంగాలకు అగ్ర తాంబూలం ఇచ్చిన నిర్మలమ్మ, గ్రామీణ భారతానికి నిధులు విదిల్చారు. అలాగే, వ్యవహాయానికి టెక్నాలజీ సొబగులు అద్దేలా కేటాయింపులు చేశారు. వ్యయానికి సంబంధించి, రెవెన్యూ వ్యయం రూ.41,25,494 కోట్లుగా పేర్కొన్నారు. ఇందులో వడ్డీ చెల్లింపులకే రూ.14,03,972 కోట్లు వెళ్లనున్నట్లు వివరించారు. మూల ధన వ్యయం రూ.12,21,821 కోట్లుగా ప్రతిపాదించారు. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు 4.4 శాతంగా అంచనా వేసిన ఆర్థికమంత్రి వచ్చే ఏడాది 0.1 శాతం తగ్గించాలని లక్ష్యం నిర్దేశించుకున్నారు. ఇక రాబడులకు సంబంధించి ప్రతి రూపాయిలో రుణాలు ద్వారానే అత్యధికంగా 24 పైసలు సేకరించనున్నట్లు తెలిపారు. ఆదాయ పన్ను ద్వారా 21 పైసలు, కార్పొరేట్ పన్నుల ద్వారా 18 పైసలు, జీఎస్టీ, ఇతర పన్నుల ద్వారా 15 పైసలు, పన్నేతర ఆదాయం 10 పైసలు, కేంద్ర ఎక్సైజ్ సుంకాల ద్వారా 6 పైసలు, కస్టమ్స్ సుంకాల ద్వారా 4 పైసలు, రుణేతర మూల ధన రాబడుల ద్వారా 2 పైసలు వస్తాయని అంచనా వేశారు.

**రంగాలవారీగా కేటాయింపులు**

రవాణా రంగం - రూ.5,98,520 కోట్లు
రక్షణ రంగం - రూ.5,94,585 కోట్లు
గ్రామీణాభివృద్ధి రంగం - రూ.2,73,108 కోట్లు
హోంశాఖ కార్యకలాపాలు రూ.2,55,234 కోట్లు
వ్యవసాయ అనుబంధ రంగాలు - రూ.1,62,671 కోట్లు
విద్యారంగం - రూ.1,39,289 కోట్లు
ఇంధన రంగం - రూ.1,09,029 కోట్లు
వైద్య, ఆరోగ్యం - రూ.1,04,599 కోట్లు
పట్టణాభివృద్ధి - రూ.85,522 కోట్లు
ఐటీ, టెలికాం - రూ.74,560 కోట్లు
వాణిజ్యం, పరిశ్రమలు - రూ.70,296 కోట్లు
సాంఘిక సంక్షేమం - రూ.62,362 కోట్లు
శాస్త్ర సాంకేతిక రంగాలకు - రూ.55,756 కోట్లు
పన్ను నిర్వహణ - రూ.45,500 కోట్లు
ఎక్స్‌టర్నల్ ఎఫైర్స్ - రూ.22,119
ఆర్థిక నిర్వహణ - రూ.20,649 కోట్లు
ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి - రూ.6,812 కోట్లు

**బడ్జెట్లో రూపాయి రాక**

అప్పులు - 24 శాతం
ఆదాయ పన్ను - 21 శాతం
కార్పొరేషన్ పన్ను - 18 శాతం
జీఎస్టీ, ఇతర పన్నులు - 15 శాతం
పన్నేతర ఆదాయం - 10 శాతం
ఎక్సైజ్ డ్యూటీ - 6 శాతం
కస్టమ్స్ ఆదాయం - 4 శాతం
రుణం లేని మూలధనం - 2 శాతం

**రూపాయి పోక**

రాష్ట్రాలకు పన్ను చెల్లింపులు - 22 శాతం
రుణాలకు వడ్డీ చెల్లింపులు - 20 శాతం
కేంద్ర ప్రభుత్వ పథకాలు - 17 శాతం
రక్షణ రంగం - 11 శాతం
కేంద్ర ప్రాయోజిత పథకాలు - 8 శాతం
ఆర్థిక సంఘం, ఇతర బదిలీలు - 7 శాతం
ఇతర ఖర్చులు - 7 శాతం
ప్రధాన సబ్సిడీలు - 6 శాతం
పౌర పింఛన్లు - 2 శాతం

**బడ్జెట్‌లో 43శాతం పథకాలకే**

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం ప్రవేశపెట్టిన జంబో బడ్జెట్‌ను రూ.53.47కోట్లతో పద్దు ప్రతిపాదించారు. అయితే ఈసారి బడ్జెట్‌లో పథకాలకు అగ్రతాంబూలం ఇచ్చారు. మొత్తం బడ్జెట్‌లో 43శాతం నిధులను కేవలం స్కీమ్స్ కోసమే కేటాయించడం గమార్హం. కేంద్రం 2026-27 ఆర్థిక సంతవ్సరంలో రూ.23.21లక్షల కోట్లను వివిధ రకాల పథకాల కోసం కేటాయింపులు చేసింది. ఇది మొత్తం బడ్జెట్‌లో 43శాతం. స్కీమ్స్‌కు మోదీ సర్కారు ఎంత ప్రాధాన్యం ఇస్తుందో ఈ కేటాయింపులే స్పష్టం చేస్తున్నాయి. అయితే ఈ పథకాలను రెండు వర్గాలుగా కేంద్రం విభజించింది. అందులో ఒకటి సెంట్రల్ సెక్టార్ స్కీమ్స్, రెండోది కేంద్ర ప్రాయోజిత పథకాలు ( సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీమ్స్). ఈ రెండింటిలో కూడా సెంట్రల్ సెక్టార్ స్కీమ్స్‌కు ఏకంగా 17.22 లక్షల కోట్లు కేటాయించింది.
సెంట్రల్ సెక్టార్ స్కీమ్స్‌ను సైతం కేంద్రం ఐదు రకాలుగా విభజించింది. 1. జనరల్ సర్వీస్, 2. ఎకానమిక్ సర్వీస్, 3. సోషల్ సర్వీస్, 4. సబ్సిడీ, 5. ఇతర స్కీమ్స్ ఉన్నాయి. వీటిలో సబ్సీడీల కోసం ఏకంగా రూ.4.55లక్షల కోట్లను కేంద్రం ప్రతిపాదించింది. ఇందులో ఫుడ్ సబ్సిడీ కోసం రూ.2.28 లక్షల కోట్లు కాగా, ఫెర్టిలైజర్ సబ్సిడీ కోసం రూ. 1.71లక్షల కోట్లను కేటాయించింది. అలాగే, పెట్రోలియం సబ్సిడీ కోసం రూ. 0.12లక్షల కోట్లను ప్రతిపాదించింది.

**రాష్ట్రాలకు రూ.4.41లక్షల కోట్లు**

ఈ బడ్జెట్‌లో కేంద్రం రాష్ట్రాలకు ఇచ్చే నిధుల విషయాన్ని కూడా ప్రస్తావించింది. రూ.4.41లక్షల కోట్లను 2026-27 ఆర్థిక సంవత్సరంలో పన్నులు, ఇతర రూపాల్లో ఇవ్వనున్నట్లు పేర్కొంది. ఇందులో 16వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.29 లక్షల కోట్లు ఉంటాయని ఆర్థిక మంత్రి బడ్జెట్‌లో ప్రతిపాదించారు.

**వడ్డీలకు రూ.14.04లక్షల కోట్లు**

2026-2027 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం వడ్డీ చెల్లింపులకు భారీగా కేటాయింపులు చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.14.04లక్షల కోట్లు వడ్డీ చెల్లింపులకే కేటాయించినట్లు కేంద్రం వెల్లడించింది. అలాగే, జీతాల కోసం రూ.1.66లక్షల కోట్లు, పెన్షన్స్ కోసం రూ.2.96లక్షల కోట్లను కేంద్రం ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించింది.

## దేశ ఆర్థికానికి 3 కర్తవ్యాలు

యువశక్తి కేంద్రంగా బడ్జెట్ ప్రవేశపెడుతున్నామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ప్రజల ఆకాంక్షలను ఆచరణలోకి తీసుకొస్తున్నామని, రైతులు, దళిత, గిరిజన సమూహాలకు అభివృద్ధి ఫలాలు చేరాలని ఆకాంక్షించారు. దేశ ఆర్థికానికి మూడు కర్తవ్యాలను నిర్దేశించుకున్నట్లు చెప్పారు. నైపుణ్యం, పోటీతత్వం, ఉత్పాదకతతో భారత్‌ను ప్రపంచస్థాయికి తీసుకెళ్తామని చెప్పారు. లోక్‌సభలో కేంద్ర ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రవేశపెడుతున్న క్రమంలో ఈ వ్యాఖ్యలు చేశారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనకు సమ్మిళిత వృద్ధి అవస్యమన్న ఆమె, అభివృద్ధి ఫలాలు ప్రతీ రైతు, నాజ, ాాలు, యువతకు చేరాలని పేర్కొన్నారు. ఇందు కోసం మూడు కర్తవ్యాలను నిర్దేశించుకున్నారు. "పేదలు, సమాజంలో బాగా వెనుకబడినవారు, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న వారిపై దృష్టిపెట్టాలని మా ప్రభుత్వం సంకల్పించింది. ఈ సంకల్పానికి కార్యరూపం ఇచ్చేందుకు తొలిసారి ఈ బడ్జెట్ కర్తవ్య భవన్‌లో రూపొందించాం. దీనిద్వారా మూడు కర్తవ్యాలతో స్ఫూర్తి పొందాం. మొదటి కర్తవ్యం ఉత్పాదకను, పోటీతత్వాన్ని పెంచడం ద్వారా ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం, స్థిరీకరించడం. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులను ఎదుర్కొనేందుకు స్థిరత్వాన్ని సాధించడం. రెండో కర్తవ్యం ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడం, వారి సామర్థ్యాల్ని పెంచడం, ప్రగతి ప్రస్థానంలో వారిని భాగస్వాములుగా తీర్చిదిద్దడం. మూడో కర్తవ్యం సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ మార్గానికి అనుగుణంగా ప్రతి కుటుంబం, ప్రతి కమ్యూనిటీ, ప్రాంతం, రంగానికి అన్ని వనరులను అందుబాటులో ఉంచడం, సౌకర్యాలు కల్పించడం, అవకాశాలు పెంపొందించడం."
ఆర్థిక సుస్థిరత కోసం ఆరు కీలక రంగాల్లో సంస్కరణలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఫార్మా విద్య, పరిశోధనకు జాతీయ స్థాయిలో కొత్త విద్యాసంస్థలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దేశ సెమీ కండక్టర్ రంగం వృద్ధి కోసం రూ.40 వేల కోట్లతో ఇండియా సెమీకండక్టర్ మిషన్ 2.0 కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. రేర్ ఎర్త్ మినరల్స్ కోసం ఏపీ సహా 5 రాష్ట్రాలో ప్రత్యేక కార్యక్రమం ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. ఒడిశా, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళ కోసం ప్రత్యేక మైనింగ్ మిషన్ చేపట్టనున్నట్లు చెప్పారు. ఖనిజ వనరులున్న రాష్ట్రాలకు ప్రత్యేక ప్రోత్సాహం అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.
"ప్రపంచస్థాయి కంటెయినర్ ఉత్పత్తి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తాం. హైటెక్ టూల్ రూమ్స్ ఏర్పాటు, జౌళిరంగం ఆధునీకరణ. పరిశ్రమలకు విద్యా సంస్థలు అనుసంధానిస్తాం. మెగా టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేసి జౌళి ఉత్పత్తుల అంతర్జాతీయ బ్రాండింగ్ కోసం ప్రత్యేక కార్యాచరణ చేపడతాం. బయో ఫార్మా, సెమీకండక్టర్, ఎంఎస్ఎంఈలకు చేయూతతో పాటు పారిశ్రామికవాడల ఆధునీకరిస్తాం. మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం. దీర్ఘకాలిక భద్రత, నగరాల అభివృద్ధికి ఆర్థిక జోన్లు ఏర్పాటు చేస్తాం. క్రీడా ఉత్పత్తుల కోసం ప్రత్యేక కార్యాచరణ చేపడతాం." అని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు.

## దేశవ్యాప్తంగా జిల్లాకొక బాలికల హాస్టల్

దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలో బాలికల వసతి గృహం ఏర్పాటు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. ప్రధాన పారిశ్రామిక లాజిస్టిక్స్ కేంద్రాలకు సమీపంలో 5 విశ్వవిద్యాలయ టౌన్‌షిప్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. టౌన్‌షిప్‌లలో నివాస సౌకర్యాలు, పరిశోధన మౌలిక సదుపాయాలతో పాటు విశ్వవిద్యాలయాలు, కళాశాలలు ఉంటాయి. దేశవ్యాప్తంగా 15,000 కంటే ఎక్కువ పాఠశాలల్లో కంటెంట్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయడానికి ముంబయిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్‌కు మద్దతు అందిస్తున్నట్లు తెలిపారు. "జిల్లాకో హాస్టల్ ఉన్నత విద్యను అభ్యసించే అమ్మాయిలకు, యువతులకు సురక్షితమైన, అందుబాటులో ఉండే వసతిని నిర్ధరించడంలో సహాయపడతాయి. తద్వారా అధునాతన శాస్త్రీయ విభాగాలలో విద్యార్థుల నమోదు మెరుగుపడుతుంది"

**భారతీయ క్లినికల్ ట్రయల్ సైట్‌ల నెట్‌వర్క్ ఏర్పాటు**

పశువైద్య కళాశాలలు, ఆసుపత్రులు, డయాగ్నస్టిక్స్ ప్రయోగశాలలకు రుణ- సంబంధిత మూలధన సబ్సిడీ మద్దతు పథకాన్ని ఆమె ప్రకటించారు. గుజరాత్ జామ్‌నగర్‌లోని ఆయుష్ ఫార్మసీలు, ఔషధ పరీక్ష ప్రయోగశాలలు, ఔనూ సంప్రదాయ వైద్య కేంద్రాన్ని అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. వెయ్యి కంటే ఎక్కువ గుర్తింపు పొందిన భారతీయ క్లినికల్ ట్రయల్ సైట్‌ల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగుల కోసం సహాయక పరికరాల ఉత్పత్తిని పెంచడానికి ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు నిధులు కేటాయించనున్నట్లు ప్రతిపాదించారు. "ప్రధాన పారిశ్రామిక లాజిస్టిక్ కారిడార్ల సమీపంలోని 5 విశ్వవిద్యాలయాల టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేయడంలో మా ప్రభుత్వం రాష్ట్రాలకు మద్దతు ఇస్తుంది. అనేక విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పరిశోధన సంస్థల, నైపుణ్య కేంద్రాలు, రెసిడెన్షియల్ సముదాయాలను ఈ ప్రణాళికాబద్ధమైన టౌన్‌షిప్‌లు నిర్వహిస్తాయి. ఉన్నత విద్యకు సంబంధించి స్టెమ్ సంస్థలలో ఎక్కువ గంటలు అధ్యయనం చేయడం, ప్రయోగశాలల్లో పని చేయడం వల్ల విద్యార్థినులకు సవాళ్లు ఎదురవుతాయి. అందుకే వయబిలిటీ గ్యాప్ ఫండింగ్, క్యాపిటల్ సపోర్ట్ ద్వారా ప్రతి జిల్లాలో ఒక బాలికల హాస్టల్ ఏర్పాటు చేయబడుతుంది"

**వికసిత్ భారత్‌కు కీలకమైన సేవా రంగంపై దృష్టి సారించి చర్యలు**

విద్య నుంచి ఉపాధి, వ్యవస్థాపకత వరకు అనే స్థాయి సంఘాన్ని ఏర్పాటు చేయనున్నామని, వికసిత్ భారత్‌కు కీలకమైన సేవా రంగంపై దృష్టి సారించి చర్యలను సిఫార్సు చేయనుందని ఆర్థికమంత్రి తెలిపారు. కృత్రిమమేధతో పాటు ఆవిర్భవిస్తున్న కొత్త సాంకేతికతలకు మద్దతిచ్చేందుకు నిధులు కేటాయించనున్నట్లు నిర్మల తెలిపారు. ప్రతిపాదిత కమిటీ ఆర్థిక వృద్ధికి కీలకమైన చోదక శక్తిగా సేవల రంగంపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలను సిఫార్సు చేస్తుందని నిర్మల అన్నారు. యువ భారత్ ఆకాంక్షలను నెరవేర్చడానికి స్పష్టమైన మార్గాన్ని అందించడం ఆ చౌరవ లక్ష్యం అని తెలిపారు. "యువ భారతదేశం ఆకాంక్షలను నెరవేర్చేందుకు చర్యలను అందించడానికి, ఆర్థిక వృద్ధికి కీలకమైన చోదకంగా సేవల రంగంపై దృష్టి సారించే చర్యలను సిఫార్సు చేయడానికి హై పవర్‌తో కూడిన సంస్థల స్టాండింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని నేను ప్రతిపాదిస్తున్నాను" అని ఆమె చెప్పారు.

**కొత్త సాంకేతికతలకు మద్దతు ఇవ్వడానికి ప్రభుత్వం అనేక చర్యలు**

"కృత్రిమ మేధస్సుతో సహా అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు. రైతులు, మహిళలు, యువత, దివ్యాంగులతో సహా ప్రజలందరికీ కొత్త అవకాశాలను పొందేందుకు వీలుగా సాంకేతికతను స్వీకరించడం కోసం ఏఐ మిషన్, నేషనల్ క్వాంటం మిషన్, అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫండ్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ అండ్ ఇనోవేషన్ ఫండ్‌ల ద్వారా కొత్త సాంకేతికతలకు మద్దతు ఇవ్వడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది" అని నిర్మల తెలిపారు.

# క్యాన్సర్ బాధితులకు భరోసా

దేశ ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేయడంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ముఖ్యంగా మధుమేహం, క్యాన్సర్ వంటి అసంక్రమిత వ్యాధులు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో బయో ఫార్మా రంగాన్ని అభివృద్ధి చేసేందుకు భారీ ప్రణాళికను ప్రకటించింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్‌లో బయో ఫార్మాస్యూటికల్ రంగానికి రూ.10,000 కోట్ల పెట్టుబడితో బయో ఫార్మా శక్తి కార్యక్రమాన్ని ప్రకటించారు.
ప్రపంచ స్థాయి బయోఫార్మా తయారీ కేంద్రంగా భారత్
పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రసంగంలో సీతారామన్ మాట్లాడుతూ, దేశంలో మధుమేహం, క్యాన్సర్ సహా పలు అసంక్రమిత వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోందని గమనించామని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రజలకు దీర్ఘాయువు, నాణ్యమైన జీవితం అందించడంలో జీవసంబంధిత ఔషధాలు (బయోలాజికల్ మెడిసిన్స్) కీలకమని పేర్కొన్నారు. అందుకే భారతదేశాన్ని ప్రపంచ స్థాయి బయోఫార్మా తయారీ కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు.

**భారత్ స్థానం మరింత పటిష్టం**

బయో ఫార్మా శక్తి కింద వచ్చే ఐదేళ్లలో రూ.10,000 కోట్ల వ్యయంతో సమగ్ర బయోఫార్మా ఎకోసిస్టమ్‌ను నిర్మించనున్నారు. బయోఫార్మా, బయోసిమిలర్ ఔషధాల తయారీ సామర్థ్యాలను పెంచడం, దేశీయ పరిశోధనలకు ప్రోత్సాహం ఇవ్వడం, అధునాతన సాంకేతికతలను అందుబాటులోకి తేవడం ఈ పథకం ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. విదేశాలపై ఆధారపడకుండా స్వదేశీ తయారీని బలోపేతం చేయడమే కాకుండా, ప్రపంచ సరఫరా చైన్‌లో భారత్ స్థానం మరింత పటిష్టం చేయాలని కేంద్రం భావిస్తోంది.
ఇందులో భాగంగా బయో ఫార్మా ఫోకస్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయనున్నారు. పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు మూడు ప్రత్యేక సంస్థలను స్థాపించనున్నారు. ఇవి కొత్త ఔషధాల అభివృద్ధి, శిక్షణ, టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్‌లో కీలక పాత్ర పోషిస్తాయని ప్రభుత్వం తెలిపింది. క్యాన్సర్ రోగులకు ఊరట కలిగించే కీలక నిర్ణయాలను కూడా బడ్జెట్‌లో ప్రకటించారు. మొత్తం 17 క్యాన్సర్ సంబంధిత మందులు, ఔషధాలపై ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని మినహాయిస్తున్నట్లు నిర్మస తెలిపారు.

**డ్రగ్ కంట్రోల్ వ్యవస్థను మరింత బలోపేతం**

దీని వల్ల చికిత్స ఖర్చు తగ్గి రోగులకు తక్కువ ధరకే మందులు అందుబాటులోకి వస్తాయని భావిస్తున్నారు. అదనంగా ప్రత్యేక వైద్య ప్రయోజనాల కోసం ఉపయోగించే మందులపై దిగుమతి సుంకాన్ని కూడా తగ్గిస్తున్నట్లు వెల్లడించారు. ఇది అరుదైన, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఉపశమనం కలిగించే చర్యగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక ఔషధాల నాణ్యత, భద్రత విషయంలో రాజీ లేకుండా డ్రగ్ కంట్రోల్ వ్యవస్థను మరింత బలోపేతం చేయనున్నట్లు కేంద్రం స్పష్టం చేసింది. నిపుణులను నియమించి పర్యవేక్షణను కఠినతరం చేయడం ద్వారా నకిలీ, నాసిరకం మందుల తయారీకి అడ్డుకట్ట వేయాలని యోచిస్తోంది. బయో ఫార్మా రంగంతో పాటు వ్యూహాత్మక, భవిష్యత్ పరిశ్రమల తయారీ విస్తరణకు కూడా ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. నగరాల చుట్టూ ఆర్థిక మండలాలను అభివృద్ధి చేసి మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. దీని ద్వారా పరిశ్రమల పెరుగుదలతో పాటు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని కేంద్రం భావిస్తోంది. బడ్జెట్ ప్రారంభంలో సీతారామన్ మాట్లాడుతూ, గత 12 ఏళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వం, ఆర్థిక క్రమశిక్షణ, నిరంతర వృద్ధితో ముందుకు సాగిందన్నారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యంతో సంస్కరణలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టడం తనకు గౌరవంగా భావిస్తున్నట్లు చెప్పారు. మొత్తానికి బయోఫార్మా రంగానికి ప్రకటించిన భారీ ప్రోత్సాహం దేశ ఆరోగ్య రంగానికి కొత్త దిశానిర్దేశం చేయనుంది. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల చికిత్స ఖర్చు తగ్గడం, స్వదేశీ ఔషధ తయారీ పెరగడం వల్ల ప్రజలకు ప్రత్యక్ష లాభాలు చేకూరనున్నాయి. భారత్‌ను ప్రపంచ బయో ఫార్మా కేంద్రంగా నిలబెట్టే దిశగా కీలక అడుగుగా పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## వికసిత్ భారత్‌కు రోడ్‌మ్యాప్‌గా కేంద్ర బడ్జెట్

"చరిత్రాత్మక బడ్జెట్ ప్రవేశపెట్టాం. బడ్జెట్‌లో ఆత్మనిర్భర్ భారత్‌కు కేటాయింపులు చేశాం. కేంద్ర బడ్జెట్ ద్రవ్యలోటును నియంత్రిస్తుంది. మౌలిక వసతుల కల్పనకు బడ్జెట్‌లో మరింత ఊతమిచ్చాం. లోకల్ నుంచి గ్లోబల్ స్థాయికి భారత్ ఎదిగింది. యువశక్తిని ప్రోత్సహించే విధంగా బడ్జెట్ ఉంది. యువతకు గేమింగ్, టూరిజం, క్రీడా సౌకర్యాలు కల్పించాం. వికసిత్ భారత్ ప్రయాణం వేగవంతానికి బడ్జెట్ తోడ్పాటును అందిస్తుంది. సంస్కరణలకు బడ్జెట్ నూతన ఉత్తేజాన్ని ఇస్తుంది. భారత్‌ను డేటా సెంటర్‌గా మార్చేందుకు ట్యాక్స్ హాలిడే ఉపయోగపడుతుంది. ఇది భారత్‌ను డేటా సెంటర్ హబ్‌గా మారుస్తుంది. ఉద్యోగాల కల్పనకు కేంద్ర బడ్జెట్ మరింత దోహదం చేస్తుంది." కేంద్ర బడ్జెట్ భవిష్యత్తుకు రోడ్‌మ్యాప్‌గా నిలుస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. 2047 మిషన్ లక్ష్యాల మేరకు కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టామన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా తొమ్మిదోసారి ప్రవేశపెట్టిన బడ్జెట్ 140 కోట్ల ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించిందని అన్నారు. సంస్కరణలను బలోపేతం చేయటంతోపాటు వికసిత్ భారత్ నిర్మాణానికి రోడ్‌మ్యాప్‌గా పనిచేస్తుందని చెప్పారు. ఆత్మనిర్భర్ భారత్‌కు కేటాయింపులు చేసినట్లు తెలిపారు. త్వరలో భారత్ మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించనుందని, చరిత్రాత్మక బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్లు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌పై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. ఇది సంస్కరణల ప్రయాణాన్ని బలోపేతం చేస్తుందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. మూలధన వ్యయానికి, వృద్ధికి మధ్య సమతూకం పాటించారని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కొనియాడారు. ప్రభుత్వ సంస్కరణల అజెండాను రీఫార్మ్ ఎక్స్‌ప్రెస్‌గా అభివర్ణించిన ప్రధాని మోదీ, ఆ ఎక్స్‌ప్రెస్‌కు బడ్జెట్ కొత్త శక్తిని అందించిందని పేర్కొన్నారు. ఈ సంస్కరణలు యువతకు అద్భుతమైన అవకాశాలు కల్పిస్తాయని చెప్పారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా మాత్రమే ఉండిపోవాలని భారతీయులు అనుకోవడం లేదని, సాధ్యమైనంత వేగంగా మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ పద్దు మహిళా సాధికారతకు నిదర్శనంగా ఉందని, వరుసగా తొమ్మిదిసార్లు దీనిని లోక్‌సభలో ప్రవేశపెట్టి నిర్మలాసీతారామన్ రికార్డు సృష్టించారని ప్రధాని మోదీ ప్రశంసించారు. "మౌలిక సదుపాయలను బలోపేతం చేసేందుకు ఈ బడ్జెట్‌లో అనేక చర్యలు తీసుకున్నాం. ప్రత్యేక సరకు రవాణా కారిడార్, దేశవ్యాప్తంగా జలమార్గాల విస్తరణ, హై-స్పీడ్ రైలు కారిడార్, టైర్-2, టైర్-3 నగరాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి, నగరాలకు బలమైన ఆర్థిక పునాదిని అందించేందుకు మున్సిపల్ బాండ్లకు ప్రోత్సాహం. ఈ చర్యలన్నీ వికసిత భారత్ వేగాన్ని మరింత పెంచుతాయి. ఈ బడ్జెట్ 2047 వికసిత్ భారత్‌కు బలమైన ఆధారం. భారత్ ఏ సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌పై సవారీ చేస్తుందో దానికి ఈ బడ్జెట్‌తో కొత్త శక్తి, వేగం లభించనున్నాయి. చారిత్రక సంస్కరణలు ఆంక్షాలతో నిండిన దేశీయ సాహసిక్, నైపుణ్యం కలిగిన యువతకు ఆకాశమే హద్దుగా అవకాశాలు కల్పిస్తాయి. ఏ దేశానికైనా గొప్ప బలం వారి పౌరులే. ఈ మధ్య కాలంలో మా పౌరుల సామర్థ్యాలను పెంచేందుకు పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతున్నాం.



# సాగుకు 'ఏఐ' సాయం

దేశ రైతులకు గుడ్ న్యూస్. 'భారత్ విస్తార్' పేరుతో ఏఐ బహుభాషా టూల్‌ను తీసుకొస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. 'భారత్ విస్తార్' టూల్‌తో కేంద్ర ప్రభుత్వ అగ్రి స్టాక్ వెబ్‌సైట్లను, భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) వ్యవసాయ మార్గదర్శకాలను, అధునాతన ఏఐ సిస్టమ్‌లను అనుసంధానిస్తారు. దేశ రైతుల వ్యవసాయ ఉత్పాదకతను పెంచడానికి 'భారత్ విస్తార్'లోని ఏఐ సమాచారం దోహదపడుతుందని నిర్మల తెలిపారు. పంటసాగు చేపట్టే క్రమంలో ముప్పును తగ్గించే విలువైన సలహాలను ఇది అందిస్తుందన్నారు.

తద్వారా దేశంలోని కోట్లాది మంది రైతులను ఏఐతో ఏకీకృతం చేయాలనే భారత సర్కారు విజన్ కూడా సాకారం అవుతుందన్నారు. రైతులు తమతమ ప్రాంతీయ భాషల్లోనే ఈ టూల్ ద్వారా వ్యవసాయ సూచనలను పొందొచ్చని ఆర్థిక మంత్రి చెప్పారు. పంటసాగు మెళకువలు, పంట ఉత్పాదకతను పెంచే సిఫారసులు, వాతావరణ సూచనలు, పంటల తాజా మార్కెట్ ధరలు వంటి సమాచారం మొత్తం 'భారత్ విస్తార్' టూల్‌లో ఉంటుందన్నారు. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం ప్రస్తుతం దేశంలో ఉన్న 46.1 శాతం మంది రైతులకు ఈ ఏఐ టూల్ ఉపయోగపడుతుందన్నారు.

**పశుపోషణ, ఫిషరీస్, డైరీ, పౌల్ట్రీ రంగాలకు వరాలు**

ఈసారి కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ. 1,27,290 కోట్లు కేటాయించారు.

రూ. 10,466.39 కోట్లను వ్యవసాయ పరిశోధన, విద్యకు కేటాయించారు.

ఫిషరీస్ (మత్స్యకార) రంగం కోసం 500 రిజర్వాయర్లు, అమృత్ సరోవర్‌ల సమీకృత అభివృద్ధి. దేశంలోని సముద్ర తీర ప్రాంతాల మత్స్యకారులకు చేయూత. స్టార్టప్‌లు, మహిళా సంఘాలు, రైతుల ద్వారా మత్స్యకారులకు మార్కెట్ లింకేజీ ఏర్పాట్లు.

పశుపోషణ, డైరీ, పౌల్ట్రీ రంగాల్లోని పరిశ్రమల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు, ఆధునికీకరణ కోసం 'క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ పథకం' అమలు. సప్లై చైన్ వ్యవస్థలను బలోపేతం చేసుకునేందుకు డైరీ, పౌల్ట్రీ పరిశ్రమలకు చేయూత. తద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనకు ఏర్పాట్లు.




పలు రాష్ట్రాల్లో కొబ్బరి, చందనం (శాండల్ వుడ్), జీడిపప్పు, కొకోవా, అగార్ చెట్లు, బాదం, వాల్ నట్స్, పైన్ నట్స్ లాంటి పంటలను సాగు చేసే దిశగా రైతులకు ప్రోత్సాహం.

జీడిపప్పు, కొకోవా ప్రాసెసింగ్‌లో భారత పరిశ్రమలు స్వయం సమృద్ధిని సాధించేలా ప్రోత్సాహం. ఈ విభాగంలో 2030 నాటికి భారతీయ బ్రాండ్ల ఆవిర్భావానికి చేయూత.

**వ్యవసాయ రంగం వల్లే 7 శాతం ఆర్థిక వృద్ధి రేటు**

"భారతదేశ ఆర్థిక వృద్ధి రేటు 7 శాతానికి పెరిగిందంటే అందుకు ప్రధాన కారణం వ్యవసాయ రంగమే. మేం వ్యవసాయ రంగ వికాసానికి గతంలోనూ చాలా చర్యలను చేపట్టాం. అవి మంచి ఫలితాలను ఇచ్చాయి. లక్షలాది మంది చిన్న, సన్నకారులు జీవితాల్లో ఎదిగారు. విత్తనాలు, ఎరువులతో ముడిపడిన సప్లైలో రైతులు కొన్ని సవాళ్లను ఎదుర్కొన్నారు. అయినప్పటికీ సాగునీరు, విద్యుత్, ఎరువులను సమర్థంగా వినియోగించుకొని భారత రైతులు పంటల ఉత్పాదకతను పెంచుతున్నారు. దేశంలో దాదాపు కోటి మంది రైతులు, 3 కోట్ల మంది చిరువ్యాపారుల జీవితాలు కొబ్బరిసాగుపై ఆధారపడి ఉన్నాయి. కొబ్బరి ఉత్పత్తిలో ప్రపంచ నంబర్ 1 స్థానంలో భారత్ ఉంది. రైతుల ఆదాయాలను రెట్టింపు చేయడంతో పాటు చిన్న,సన్నకారు రైతులను పైకి తీసుకురావడమే వికసిత భారత్ మిషన్ లక్ష్యం" అని ఆర్థిక మంత్రి నిర్మల చెప్పారు.

**ఆ ప్రజలను, ఆ రాష్ట్రాలను మేం విస్మరించలేదు!**

"మేం సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అని చెబుతుంటాం. దాన్ని చేతల్లో అమలు చేసి కూడా చూపిస్తాం. దేశ వ్యవసాయ రంగంలో ఈ దిశగా చాలా పనులు చేశాం. పంటసాగు ఉత్పాదకతను రైతులు పెంచుకోవడంలో దోహదపడ్డాం. చిన్న, సన్నకారు రైతుల వ్యవసాయమూ లాభదాయకంగా మారేలా చేయగలిగాం. రైతులకు ముమ్మర శిక్షణా కార్యక్రమాలను నిర్వహించగలిగాం. దేశ వ్యవసాయ రంగ ఆదాయంలో దాదాపు 16 శాతం వాటా పశుపోషణ విభాగానిదే. అందుకే పాడిరైతులను, పాల డైరీల నిర్వాహకులను ప్రోత్సహించాలని మేం నిర్ణయించాం. ప్రత్యేకించి దేశంలోని పేద వర్గాల ప్రజలను మేం ఎన్నడూ మర్చిపోలేదు. అంతగా ఆర్థిక వనరులు లేని రాష్ట్రాలను కూడా విస్మరించలేదు. ఈశాన్య రాష్ట్రాల్లో ఉపాధి కల్పనకు, పారిశ్రామిక వికాసానికి పెద్దపీట వేశాం. ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనకు మా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది" అని ఆర్థిక మంత్రి నిర్మల పేర్కొన్నారు.

# నిందితుల వాంగ్మూలాల ఆధారంగా సాగిన దర్యాప్తు

-మొదటిపేజీ తరువాయి

అధికారులు ఆడియో, వీడియో రికార్డింగ్ చేశారు. విచారణ పూర్తయిన తర్వాత సిట్ బృందం కేసీఆర్ నివాసం నుంచి వెనుదిరిగింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతలు, వ్యాపారులు, ప్రముఖుల ఫోన్లను ట్యాప్ చేశారన్న ఆరోపణలపై ఈ కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే పలువురిని సిట్ విచారించింది. నిందితులు ఇచ్చిన స్టేట్‌మెంట్ల ఆధారంగానే మాజీ సీఎం కేసీఆర్‌ను సిట్ అధికారులు విచారించినట్టు తెలుస్తోంది.

కేసీఆర్‌ను ఫోన్ ట్యాపింగ్ అంశంలో సిట్ అధికారులు పలు కీలక ప్రశ్నలు అడిగినట్లు సమాచారం. ఈ విచారణ నందినగర్‌లోని నివాసం రెండో అంతస్థు గదిలో జరుగింది. ఈరోజు మధ్యాహ్నం పలు డాక్యుమెంట్లు, పరికరాలతో సిట్ అధికారులు కేసీఆర్ నివాసంలోకి వెళ్లారు. సిట్ విచారణ నేపథ్యంలో నందినగర్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

**కాన్వాయ్‌పై పూల వర్షం**

రెండు రోజుల క్రితం సిట్ ఇచ్చిన నోటీసు ప్రకారం కేసీఆర్ ఈరోజు మధ్యాహ్నం సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్ నుంచి హైదరాబాద్ నందినగర్ నివాసానికి చేరుకున్నారు. కేసీఆర్ ఎర్రవల్లి నుంచి బయలుదేరే ముందు ఫామ్‌హౌస్ వద్దకు భారీగా తరలివచ్చిన గులాబీ శ్రేణులు తమ అధినేతకు అడుగడుగున నీరాజనాలు పలికారు. కేసీఆర్ కాన్వాయ్‌పై గులాబీ పూల వర్షం కురిపించారు. దారి పొడువునా జై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు.

**ఆడియో, వీడియో రికార్డు**

కేసీఆర్ హైదరాబాద్ నందినగర్ నివాసానికి చేరుకునే సమయానికి అక్కడకు వచ్చిన పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నినాదాలు చేశారు. అంతకు ముందే కేసీఆర్ నివాసానికి చేరుకున్న సిట్ అధికారులు ఆయనను విచారించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకున్నారు. కేసీఆర్ వాంగ్మూలాలు నమోదు చేసుకునేందుకు అవసరమైన కంప్యూటర్లు, ఆడియో, వీడియో పరికరాలను అమర్చుకున్నారు. కేసీఆర్‌ను ప్రశ్నిస్తున్న సమయంలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఇతర కుటుంబ సభ్యులు నందినగర్ నివాసంలోనే ఉన్నారు.

పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లోని స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్‌లో ఆధారాల ధ్వంసంపై తొలుత ప్రారంభమైన దర్యాప్తు అక్రమ ఫోన్ ట్యాపింగ్‌వైపు మళ్లింది. ఈ వ్యవహారంలో అంతిమ లబ్ధిదారులెవరో తేల్చే ప్రయత్నాల్లో ఉన్న సిట్ అధికారులు నిందితుల నుంచి ఇప్పటికే సేకరించిన వాంగ్మూలాలను కేసీఆర్ ముందుంచి వివరాలు రాబట్టినట్లు తెలుస్తోంది.

**ఇది కక్షసాధింపుకే పరాకాష్ట**

కేసీఆర్‌ను ఫోన్ ట్యాపింగ్ పేరుతో సిట్ విచారణ చేయడం రాజకీయ కక్షసాధింపు చర్యలకు పరాకాష్ట అని మాజీ మంత్రి హరీశ్ రావు ఆక్షేపించారు. సిట్ పేరిట ప్రతిపక్ష నేతపై ప్రతీకార దాడి చేస్తున్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ విచారణలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలనూ ఉల్లంఘించారన్న ఆయన నోటీసులు ఇవ్వడంలో చట్టపర విధానాలు పాటించలేదన్నారు. ఎర్రవెల్లిలో ఇవ్వకుండా నందినగర్ ఇంటి గోడలకు అంటించారని ఇలా చేయడం చౌకబారు రాజకీయం అని అన్నారు. కేసీఆర్ ఎక్కడ ఉంటున్నారో ఈ రాష్ట్రానికి తెలియదా? అని ప్రశ్నించారు. ఈ సిట్ 'సీఎం ఇన్‌స్ట్రక్షన్ టీమ్'గా పనిచేస్తోందని ఆరోపించారు. విచారణకు సహకరిస్తున్నప్పటికీ పోలీసులు అతిగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

దుర్వినియోగం చేశారు : దేశ భద్రత కోసం, ఉగ్రవాద నిర్మూలన కోసం ఫోన్ ట్యాపింగ్ ఉంటే బీఆర్ఎస్ నేతలు మాత్రం దానిని దుర్వినియోగం చేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. వ్యక్తిగత పనుల కోసం, రాజకీయ కక్షలకు ఫోన్ ట్యాపింగ్‌ను వాడుకున్నారని ఆక్షేపించారు.

**సీఎం నివాసం వద్ద భద్రత పెంపు**

జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసాన్ని బీఆర్ఎస్ నేతలు ముట్టడిస్తారనే సమాచారంతో అక్కడ భద్రత పెంచి పోలీసులను మోహరించారు. సీఎం, మంత్రుల నివాసాలను బీఆర్ఎస్ నేతలు ముట్టడిస్తారనే అనుమానంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.

# అంతర్జాతీయ వేదికపై తెలంగాణ ఏఐ విజన్

-మొదటిపేజీ తరువాయి

అమెరికా నుంచి ఇవాళ రాత్రి హైదరాబాద్ రానున్నారు. గత నెల 19న ఉదయం మేడారంలో అమ్మవార్ల గద్దెలను పునః ప్రారంభించిన సీఎం, అక్కడి నుంచి నేరుగా శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లి దావోస్ బయలుదేరారు. గత నెల 23 వరకు దావోస్‌లో ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సులో పాల్గొన్నారు. తెలంగాణ రైజింగ్- 2047 విజన్ లక్ష్యాలను ప్రపంచానికి వివరించడంతో పాటు పెట్టుబడులు ఆకర్షించే లక్ష్యంతో దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందం పర్యటన జరిగింది.

**లీడర్‌షిప్‌పై సర్టిఫికెట్ కోర్సు**

ఏఐ, డేటా సెంటర్లు, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించింది. స్విట్జర్లాండ్ నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా వెళ్లారు. హార్వర్డ్ యూనివర్సిటీలోని కెనడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లో లీడర్‌షిప్‌పై సర్టిఫికెట్ కోర్సు చేశారు. గత నెల 25 నుంచి ఐదు ఖండాల్లోని 20 దేశాలకు చెందిన 62 మందితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి ఉదయం 7 నుంచి సాయంత్రం 6 వరకు తరగతులకు హాజరయ్యారు. కోర్సు పూర్తి చేసిన సీఎం రేవంత్ రెడ్డికి హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ సర్టిఫికెట్ అందజేసింది. హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి సర్టిఫికెట్ కోర్సు చేసిన మొదటి సీఎంగా ఘనత దక్కించుకున్నారు. రేవంత్ రెడ్డి తరగతులకు హాజరు కావడంతో పాటు అసైన్‌మెంట్‌లు, హోమ్‌వర్క్‌లు, గ్రూప్ ప్రాజెక్టులు పూర్తిచేశారు.

**అమరవీరుల స్మారక ట్రస్టు కార్యక్రమానికి సీఎం**

రాత్రికి హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డి నేడు మంత్రులు, పీసీసీ ముఖ్యనేతలతో సమావేశమై తాజా రాజకీయ పరిస్థితులు, పరిణామాలపై చర్చించనున్నారు. మున్సిపల్ ఎన్నికలు, ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్, ముఖ్య నేతల



విచారణ, బొగ్గు గనుల వివాదం తదితర అంశాలపై సమాలోచనలు జరిపే అవకాశం ఉంది. రేపు మధ్యాహ్నం బంజారాహిల్స్‌లోని రావినారాయణరెడ్డి ఆడిటోరియంలో తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు కార్యక్రమానికి సీఎం హాజరై రావి నారాయణరెడ్డి పురస్కారాన్ని జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి ప్రదానం చేయనున్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి ముఖ్యమంత్రి షెడ్యూల్ ఖరారైంది. ఈ నెల 4న నల్గొండ జిల్లా మిర్యాలగూడలో ముఖ్యమంత్రి మున్సిపల్ ఎన్నికల ప్రచారం ప్రారంభం కానుంది. 5న కరీంనగర్ జిల్లా చొప్పదండి, 7న వికారాబాద్ జిల్లా పరిగి, 8న భూపాలపల్లి, 9న మెదక్‌లో సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభల్లో పాల్గొంటారు.

**అంతర్జాతీయ వేదికపై తెలంగాణ ఏఐ విజన్**

హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ నిర్వహించనున్న తొలి ఏఐ పాలసీ సింపోజియానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆహ్వానం అందింది. మార్చిలో జరగనున్న ఈ సదస్సుకు హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా సీఎం పాల్గొని ప్రసంగించనున్నారు. ఏఐ సదస్సును హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ డీన్ జెరెమీ వీన్‌స్టీన్‌తో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారు. గ్లోబల్ లీడర్లు, టెక్ నిపుణులతో కలిసి ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై జరిగే ప్యానెల్ డిస్కషన్‌లో కూడా సీఎం పాల్గొనే అవకాశం ఉంది. హార్వర్డ్ క్యాంపస్‌లో సీఎం రేవంత రెడ్డిని నిర్వాహకులు కలిసి ఆహ్వాన పత్రిక అందచేశారు. ఈ సదస్సుకు భారత్ నుంచి హాజరుకానున్న ఏకైక రాజకీయ నాయకుడు రేవంత్‌రెడ్డేనని సీఎంవో వర్గాలు తెలిపారు. అంతర్జాతీయ వేదికపై తెలంగాణ ఏఐ విజన్‌ను చాటిచెప్పడానికి ఇది ఒక గొప్ప అవకాశమని ప్రభుత్వం పేర్కొంది.

## 'దేశ సంక్షోభంపై మోదీ సర్కార్ గుడ్డిగా వ్యవహరిస్తోంది'

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్‌పై ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. "ఇదొక గుడ్డి బడ్జెట్. దేశం ఎదుర్కొంటున్న వాస్తవ సంక్షోభాలు దీనికి కనిపించడం లేదు" అంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. మోదీ ప్రభుత్వానికి ఆలోచనలు అడుగంటాయని, దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక, సామాజిక సవాళ్లకు ఇందులో ఒక్కటంటే ఒక్క పరిష్కారం కూడా లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా బడ్జెట్‌పై స్పందించారు. దేశంలోని దయనీయ పరిస్థితులను వివరిస్తూ ఆరు కీలక అంశాలను ప్రస్తావించారు. "దేశంలోని యువతకు ఉద్యోగాలు లేవు, తయారీ రంగం కుప్పకూలుతోంది. పెట్టుబడిదారులు భయపడి తమ నిధులను వెనక్కి తీసుకుంటున్నారు. సామాన్యుడి ఇంట్లో పొదుపు ఆవిరైపోతోంది. దేశానికి అన్నం పెట్టే రైతన్న తీవ్ర ఆవేదనలో ఉన్నాడు. ప్రపంచవ్యాప్తంగా రాబోయే ఆర్థిక ముప్పులను ఈ బడ్జెట్ పూర్తిగా విస్మరించింది. దేశం తప్పుడు మార్గంలో వెళ్తున్నప్పుడు, బడ్జెట్ ద్వారా దాన్ని సరిదిద్దాలి. కానీ ఈ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోంది. వాస్తవాలను చూడటానికి ఇష్టపడటం లేదు. సంక్షోభంలో ఉన్న ప్రజలను ఆదుకునే చర్యలు ఇందులో శూన్యం" అని రాహుల్ విమర్శించారు.

**ఐడియాలు అయిపోయాయి: ఖర్గే**

కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే కూడా మోదీ ప్రభుత్వంపై సెటైర్లు వేస్తూనే, లోతైన విశ్లేషణ చేశారు. "మోదీ ప్రభుత్వానికి కొత్త ఆలోచనలు రావడం లేదు. 'మిషన్ మోడ్' అని గొప్పలు చెప్పుకునే వారు ఇప్పుడు 'ఛాలెంజ్ రూట్' లోకి వెళ్లిపోయారు. సంస్కరణల ఎక్స్‌ప్రెస్ ఎక్కడా ఆగడం లేదు. రాజకీయ చిత్తశుద్ధి లేదు. కనీసం విధానపరమైన లోపాలను దాచుకోవడానికి కొత్త స్లోగన్లు కూడా ఈ బడ్జెట్‌లో లేకపోవడం విడ్డూరం" అని అన్నారు. దేశంలో పెరిగిపోతున్న అసమానతలపై ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. "దేశంలో అసమానతలు బ్రిటిష్ పరిపాలన కాలం నాటి కంటే దారుణంగా పెరిగిపోయాయి. అయినా సరే ఈ బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ వర్గాలకు, పేదలకు ఎలాంటి భరోసా ఇవ్వలేదు. వారి గురించి కనీసం ప్రస్తావన కూడా లేదు" అని అన్నారు.

**తయారీ రంగం డీలా, మేక్ ఇన్ ఇండియా ఏది?**

ఆర్థిక వ్యవస్థ ఇంజిన్‌గా భావించే తయారీ రంగంపై ఖర్గే ప్రశ్నల వర్షం కురిపించారు. "తయారీ రంగం పునరుద్ధరణకు ఎలాంటి వ్యూహం లేదు. అది ఇంకా 13 శాతానికే పరిమితమైపోయింది. అసలు మీ 'మేక్ ఇన్ ఇండియా' ఏమైంది? ఎక్కడ దాక్కుంది?" అని నిలదీశారు. "యువతకు ఉపాధి కల్పించేందుకు సీరియస్ ప్లాన్ లేదు. మహిళల భాగస్వామ్యం పెంచే చర్యలు లేవు. పాత స్కిల్ డెవలప్‌మెంట్ పథకాల ఫలితాలేంటో చెప్పలేదు. ఎగుమతులు మందగించాయి. వాణిజ్య లోటు పెరిగింది. రూపాయి విలువ పతనమవుతోంది. వీటిని అడ్డుకోవడానికి మీ దగ్గర ప్లాన్ ఉందా?" అని ప్రశ్నించారు.

**సామాన్యుడికి చుక్కలు**

"ద్రవ్యోల్బణం నుంచి పేదలకు, మధ్యతరగతికి ఎలాంటి ఊరట లేదు. అప్పులు పెరుగుతున్నాయి, జీతాలు పెరగడం లేదు. వినియోగదారుల డిమాండ్ పెంచేందుకు ప్రభుత్వం దగ్గర ఆలోచనే లేదు" అని అన్నారు. సామాజిక భద్రత విషయంలో ప్రభుత్వం విఫలమైందని ఖర్గే ఆరోపించారు. "ఉపాధి హామీ పథకం స్థానంలో వచ్చిన కొత్త చట్టానికి నిధుల కేటాయింపు గురించి బడ్జెట్‌లో ఒక్క మాట కూడా లేదు. ఎందుకు?" అని ప్రశ్నించారు. "స్మార్ట్ సిటీల ఊసే లేదు. కనీసం నివసించడానికి పనికొచ్చే నగరాలైనా ఎప్పుడు చూస్తాం?" అని ఎద్దేవా చేశారు. సమాఖ్య స్ఫూర్తి దెబ్బతింటోందని ఖర్గే విమర్శించారు. ఆర్థిక సంఘం సిఫార్సులను పక్కనపెట్టి, ఆర్థిక కష్టాల్లో ఉన్న రాష్ట్రాలకు మొండిచేయి చూపారని మండిపడ్డారు.

## ఇది దిశానిర్దేశం లేని అబద్ధాల బడ్జెట్

బడ్జెట్‌పై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది విజన్, మిషన్, దిశానిర్దేశంలేని బడ్జెట్ అని, పూర్తిగా అబద్ధాలతో నిండి ఉందని ఆమె మండిపడ్డారు. ఢిల్లీ పర్యటనకు బయలుదేరేముందు కోల్‌కతా విమానాశ్రయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ బడ్జెట్ ద్వారా కేంద్రం దేశ ఆర్థికవ్యవస్థను సర్వనాశనం చేస్తోందని విమర్శించారు. ఈ బడ్జెట్‌కు ఎలాంటి లక్ష్యం లేదన్నారు. ఇది పూర్తిగా పేదలు, మహిళలు, రైతులు, యువత, సామాన్యులతో పాటు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు వ్యతిరేకమైనదని మమత మండిపడ్డారు. విద్యా రంగానికి కేటాయింపులు లేవని చెప్పారు. విద్యా సబ్సిడీ, సామాజిక భద్రతా సబ్సిడీ, ఎరువుల సబ్సిడీలను తగ్గించారని అన్నారు. ఈ బడ్జెట్ పూర్తిగా అబద్ధాల కుప్ప అని విమర్శించారు. పశ్చిమబెంగాల్‌కు కేంద్రం ఒక్క పైసా కూడా కేటాయించలేదని మమతాబెనర్జీ ఆరోపించారు. తమ రాష్ట్రానికి నిధులు ఇవ్వలేదని అన్నారు. జీఎస్టీ రూపంలో మా డబ్బును వాళ్లు తీసుకెళ్లి, తిరిగి వాళ్ల డబ్బు ఇస్తున్నట్టు గొప్పలు చెబుతున్నారని ఎద్దేవాచేశారు. ప్రభుత్వాన్ని నడిపే నైతిక హక్కు వారికి లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

## మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా సునేత్ర ప్రమాణం

**ముంబయి:** నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ దివంగత అధినేత అజిత్ పవార్ సతీమణి సునేత్రా పవార్ (62) శనివారం మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా పదవీ స్వీకార ప్రమాణం చేశారు. ఆ పదవిని చేపట్టిన తొలి మహిళగా ఆమె ఖ్యాతి గడించారు. అధికార మహాయుతి కూటమిలో భాగమైన ఎన్సీపీ శాసనసభాపక్షం ఆమెను తమ నాయకురాలిగా ఎన్నుకుని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌కు లేఖను అందించింది. దానిని గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు పంపారు. సునేత్రకు ఎక్సైజ్ శాఖ కేటాయించారు. ఆర్థిక శాఖను కేటాయించలేదు. ఆమెకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం అలుపెరుగకుండా పనిచేయడం ద్వారా ఆమె అజిత్ ఆశయాన్ని సాధిస్తారని విశ్వాసం వ్యక్తంచేశారు. సునేత్ర ప్రమాణంతో ఎన్సీపీ చీలిక వర్గాల విలీనానికి విఘాతం కలిగినట్టు కనిపిస్తోంది.

**మాకు సమాచారం లేదు: శరద్**

పదవీ స్వీకార ప్రమాణం గురించి తమకు సమాచారమే లేదని, పత్రికల ద్వారానే విషయం తెలిసిందని ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ అన్నారు. 'మమ్మల్నెందుకు విశ్వాసంలోకి తీసుకుంటారు? వాళ్ల పార్టీ వేరు, మా పార్టీ వేరు' అని వ్యాఖ్యానించారు. ఫిబ్రవరి 12న చీలికవర్గాల విలీనాన్ని ప్రకటించాలని స్వయంగా అజిత్ పవార్ నిర్ణయించారని, ఆయన ఆకాంక్ష నెరవేరుతుందనే ఆశిస్తున్నామని చెప్పారు. నాలుగు నెలలుగా అజిత్ పవార్, జయంత్ పాటిల్‌లు విలీనం విషయంలో తమతో చర్చిస్తున్నారని, దురదృష్టకర విమాన ప్రమాద ఘటన ఆ ప్రక్రియకు విఘాతం కలిగించిందన్నారు. అజిత్‌ను తిరిగి తీసుకురాలేమని, ప్రస్తుత పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలన్నది చూడాలని వ్యాఖ్యానించారు.

## బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం..

-మొదటిపేజీ తరువాయి



చేశారని.. దాంట్లో కూడా తెలంగాణను గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసీఐఎల్ లాంటి కంపెనీని హైదరాబాద్‌లో పెట్టింది నాటి కాంగ్రెస్ ప్రభుత్వమేనన్న భట్టి.. కెమికల్ పార్క్‌లో కూడా హైదరాబాద్‌కు చోటు దక్కలేదని విమర్శించారు.

**ఆరెంజ్ ఎకానమీలో హైదరాబాద్ కేంద్రం..**

దానిని కూడా ముంబయికి తరలించారని, తెలంగాణ రాష్ట్రం ఏం తప్పు చేసిందని భట్టి ప్రశ్నించారు. రీజినల్ మెడికల్ హబ్ అని మెన్షన్ చేసినా... అందులో కూడా తెలంగాణ లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మూసీ ప్రక్షాళన కోసం ప్రధాని, కేంద్ర మంత్రులను కలిసినా సాయం అందలేదన్నారు. రామప్ప దేవాలయాన్ని యునెస్కో గుర్తించినా...టూరిజం విషయంలో కూడా రాష్ట్రానికి నిధులు కేటాయింపు జరగలేదన్నారు. సమ్మక్క సారలమ్మ దర్శనానికి న్యూజిలాండ్ ట్రైబ్స్ కూడా వచ్చారని.. కానీ, కేంద్రం చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. బడ్జెట్‌లో జరిగిన అన్యాయంపై రాజకీయాలకు అతీతంగా.. రాష్ట్రంలోని ఎంపీలు అందరూ కలిసి కేంద్రంపై ఒత్తిడి పెంచాలని పేర్కొన్నారు.

# ఈ లక్షణాలు కనిపిస్తే.. వంటింట్లో కుక్కర్ ఎప్పుడైనా పేలవచ్చు!



వంట కోసం కుక్కర్‌ను ఉపయోగించడం వల్ల ఆహారం త్వరగా తయారవడమే కాకుండా సమయం, గ్యాస్ కూడా ఆదా అవుతుంది. ఈ కుక్కర్ వల్ల ఎంత ప్రయోజనాలు ఉన్నాయో, దానిని సరిగ్గా ఉపయోగించకపోతే ప్రమాదం కూడా అంతే ఉంది. అన్నం వండటం నుంచి సాంబారు తయారీ వరకు చాలా వరకు గృహిణులు ప్రెషర్ కుక్కర్‌లోనే వంట చేస్తుంటారు. వంట కోసం కుక్కర్‌ను ఉపయోగించడం వల్ల ఆహారం త్వరగా తయారవడమే కాకుండా సమయం, గ్యాస్ కూడా ఆదా అవుతుంది. ఈ కుక్కర్ వల్ల ఎంత ప్రయోజనాలు ఉన్నాయో, దానిని సరిగ్గా ఉపయోగించకపోతే ప్రమాదం కూడా అంతే ఉంది. కొన్నిసార్లు వంట చేస్తున్నప్పుడు కుక్కర్ అకస్మాత్తుగా పేలిపోతుంది. అయితే కుక్కర్ పేలిపోయే ముందు కొన్ని ముందస్తు సూచనలు ఇస్తుంది. ఈ సూచనలను అర్థం చేసుకోవడం ద్వారా సరైన సమయంలో అవసరమైన చర్యలు తీసుకుంటే ప్రెషర్ కుక్కర్ పేలకుండా నిరోధించవచ్చు. కుక్కర్ పేలడానికి ముందు వింత శబ్దం లేదా మాడుతున్న వాసన వస్తుంది. ఇది హెచ్చరిక సంకేతం. మీరు ఈ లక్షణాలను గమనించినట్లయితే వెంటనే గ్యాస్‌ను ఆపివేయండి. కుక్కర్‌లో వంట చేసేటప్పుడు వెంటవెంటనే ఈలలు వేస్తుంటే, గ్యాస్‌ను ఆపివేయాలి. కుక్కర్ లోపల పీడనం చాలా ఎక్కువగా ఉన్నప్పుడు ఈ రకమైన ఈలలు వినిపిస్తాయి. ఈ పీడనం కారణంగా కుక్కర్ పేలిపోయే అవకాశం ఉంది. ప్రెషర్ కుక్కర్ మూత పదే పదే వణుకుతుంటే, అది ప్రమాదానికి సంకేతం కావచ్చు. ఈ రకమైన సంకేతం కనిపిస్తే వెంటనే గ్యాస్ ఆపివేసి, ఒత్తిడిని విడుదల చేయాలి. అనంతరం కుక్కర్ తెరిచి తనిఖీ చేయాలి. ప్రెజర్ కుక్కర్ పైభాగంలో ఉన్న రబ్బరు రింగ్ పైకి లేవడం ప్రారంభించినా లేదా కరిగిపోయినట్లు కనిపించినా వెంటనే గ్యాస్‌ను ఆపివేయండి. ఈ జాగ్రత్తలన్నీ తీసుకోవడం ద్వారా కుక్కర్ పేలిపోవడం వల్ల వంటగదిలో ప్రమాదాలను నివారించవచ్చు.

కొన్నిసార్లు కుక్కర్‌లో వంట చేసిన తర్వాత సరిగ్గా శుభ్రం చేయకపోవడం వల్ల వెంట్ పైపు మూసుకుపోతుంది. దీని కారణంగా కుక్కర్ లోపల ఆవిరి బయటకు రాదు. దీంతో కుక్కర్‌లో ఒత్తిడి పెరిగి అది పేలిపోవచ్చు. కాబట్టి ఎల్లప్పుడూ దీనిపై శ్రద్ధ పెట్టాలి. కుక్కర్ మూతలో రబ్బరు సీల్ ఉంటుంది. ఇది ఆవిరి, నీరు బయటకు రాకుండా నిరోధిస్తుంది. ఇది విజిల్ పూర్తిగా, సమయానికి ఊదడానికి కూడా సహాయపడుతుంది. రబ్బరు వంట సమయంలో అరిగిపోయి చిరిగిపోతుంది. కాబట్టి మీరు ప్రతి మూడు నెలలకు ఒకసారి దానిని మార్చాలి. కుక్కర్ పూర్తిగా నిండిపోయే వరకు కూరగాయలు లేదా ఆహార పదార్థాలతో నింపకూడదు. దాన్ని పూర్తిగా నింపడం వల్ల లోపల ఉత్పత్తి అయ్యే ఆవిరి బయటకు వెళ్లడానికి మార్గం ఉండదు. దీనివల్ల పీడన స్థాయి వేగంగా పెరిగి కుక్కర్ పేలిపోయే అవకాశం ఉంది. అందువల్ల ఎల్లప్పుడూ కుక్కర్‌ను దాని సామర్థ్యంలో 2/3 వంతు మాత్రమే నింపాలి. సరైన మొత్తంలో నీటిని నింపాలి.

# జెన్- జి వర్క్ లైఫ్ బ్యాలెన్స్‌కే ప్రయారిటీ..




ఒకప్పుడు ఉద్యోగం అంటే ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఆఫీసులో ఉండటం. బాస్ చెప్పిన పనిని కాదనకుండా చేయడం.. అవసరమైతే సెలవులు కూడా వదులుకుని కంపెనీ కోసం చాకిరీ చేయడం ఆ ఒత్తిడిలో ఒక్కోసారి ప్రాణాలర్పించడం. దశాబ్దాలుగా మిలీనియల్స్ అనుసరిస్తున్న ఈ 'బాస్ ఈజ్ ఆల్వేస్ రైట్' కల్చర్‌కు ఇప్పుడు ఒక పెద్ద బ్రేక్ పడింది. కొత్తగా ఆఫీసుల్లో అడుగుపెడుతున్న కుర్రాళ్లు.. అంటే ఈ జెన్-జీ బ్యాచ్, కార్పొరేట్ రూల్స్‌ను తిరగరాస్తోంది. పనికి ఇచ్చే విలువ కంటే తన ప్రశాంతతకు ఇచ్చే విలువ ఎక్కువని ముక్కుసూటిగా చెబుతోంది. "నేను పని కోసం పుట్టలేదు.. నా జీవితం గడవడానికి మాత్రమే పని చేస్తాను" అనే నినాదంతో ముందుకు సాగుతున్న ఈ తరం, కంపెనీల యాజమాన్యాలకు చెమటలు పట్టిస్తోంది. మిలీనియల్స్ కెరీర్ ఎదుగుదల కోసం ఎంతటి కష్టానికైనా వెనకాడరు. ప్రమోషన్లు, గుర్తింపు కోసం ఆఫీస్ పనులను ఇంటికి తీసుకెళ్లడం వారికి అలవాటు. అదనపు గంటలు పనిచేయడాన్ని ఒక గ్రేట్ అచీవ్‌మెంట్‌గా భావిస్తారు. కానీ జెన్-జీ ఆలోచనలు దీనికి పూర్తి భిన్నం. వారు 'క్వైట్ క్విట్టింగ్' అనే పంథాను అనుసరిస్తున్నారు. అంటే బాస్ చెప్పిన పని మాత్రమే చేయడం.. తన వ్యక్తిగత జీవితాన్ని ఉద్యోగం కోసం బలిపెట్టకపోవడం. ఆఫీసులో ఎనిమిది గంటలు కూర్చోవాలనే రూల్ కంటే, పని పూర్తయిందా లేదా అన్నదే ముఖ్యం అని వీరు భావిస్తారు. నిరంతరం ఒత్తిడిలో పనిచేయడం జెన్-జీకి అస్సలు నచ్చదు. మానసిక ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చే ఈ తరం.. హైబ్రిడ్ లేదా రిమోట్ వర్క్ ఆప్షన్ లేని కంపెనీల వైపు కన్నెత్తి కూడా చూడట్లేదు. ఆఫీసులో లంచ్ బ్రేక్ నుంచి పర్సనల్ స్పేస్ వరకు ప్రతి విషయంలోనూ వీరు చాలా క్లారిటీతో ఉంటున్నారు. విపరీతమైన పని గంటల వల్ల మెదడు మొద్దుబారిపోకూడదని, లైఫ్‌ను ఆస్వాదిస్తూనే వర్క్ చేయాలని వీరు కోరుకుంటున్నారు. మిలీనియల్స్ ఏడాదికి ఒకసారి వచ్చే అప్రైజల్స్ కోసం ఓపికగా ఎదురుచూస్తారు. కానీ డిజిటల్ యుగంలో పెరిగిన జెన్-జీకి ప్రతిదీ వెంటనే జరిగిపోవాలి. వీరికి నిరంతరం 'ఇన్‌స్టెంట్ ఫీడ్‌బ్యాక్' కావాలి. ఆఫీస్ పాలిటిక్స్ కంటే ట్రాన్స్‌పరెన్సీ ఉంటేనే ఆ సంస్థలో కొనసాగుతారు. ఏదైనా సమస్య ఉంటే మొహం మీద ముక్కుసూటిగా చెప్పేయడం వీరి నైజం. జీతాల విషయంలోనూ పాత పద్ధతులను వీరు ఇష్టపడరు. తోటి ఉద్యోగులతో జీతాల గురించి చర్చించడానికి, తక్కువ జీతం ఇస్తున్నారని బాస్‌ను ప్రశ్నించడానికి వీరు అస్సలు వెనకాడరు. జెన్-జీ కేవలం తన జీతం గురించి మాత్రమే ఆలోచించదు. తాము పనిచేసే కంపెనీ సామాజిక బాధ్యత ఎలా ఉంది? పర్యావరణం పట్ల ఆ సంస్థ వైఖరి ఏంటి? వైవిధ్యానికి ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారు? వంటి విషయాలను కూడా నిశితంగా గమనిస్తారు. తమ వ్యక్తిగత విలువలకు సరిపోని కంపెనీలను ఎంతటి భారీ జీతం ఇస్తున్నా నిర్మొహమాటంగా వదిలేస్తున్నారు. ఫైనాన్సియల్ సెక్యూరిటీ కంటే ప్రొఫెషనల్ ఫుల్‌ఫిల్‌మెంట్‌కే వీరు మొగ్గు చూపుతున్నారని మానసిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. మిలీనియల్స్ కష్టాన్ని గౌరవిస్తే.. జెన్-జీ స్వేచ్ఛను ప్రేమిస్తోంది. ఈ రెండు తరాల మధ్య ఉన్న ఈ అగాధాన్ని భర్తీ చేయడానికి కంపెనీలు ఇప్పుడు తమ పాలసీలను మార్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పని గంటల కంటే ఫలితాలకు, త్యాగాల కంటే మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చే ఈ కొత్త విప్లవం భవిష్యత్తులో మరిన్ని మార్పులకు దారి తీయవచ్చు.

## ధూమపానం, మద్యపానం కలిపి చేస్తున్నారా?




ధూమపానం, మద్యపానం రెండు మంచివి కావు. వీటిని కలిపి తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయి. కొంతమంది ఒక చేతిలో గ్లాస్ , ఇంకో చేతిలో సిగిరెట్ పట్టుకుని స్టైల్ గా తాగుతారు. కానీ, ఈ రెండింటిని కలిపి తీసుకుంటే నష్టాలే ఎక్కువ వస్తాయని అంటున్నారు. కొందరు కావాలని ఒకేసారి స్మోకింగ్, డ్రింకింగ్ చేస్తారు. అయితే, ఇది మంచి పద్ధతి కాదని నిపుణులు చెబుతున్నారు. మీరు సరదాకి తాగితే.. ఆ తర్వాత హాస్పిటల్ బిల్ పేలి పోద్ది. ఈ రెండింటిని కలిపి తీసుకోవడం వలన తీవ్రమైన అనారోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా, గుండె జబ్బులు ఉన్నవారు ఇలా తీసుకోకండి లేదంటే ప్రాణాలకే ప్రమాదం. జీర్ణ వ్యవస్థ: మద్యపానం, ధూమపానం కలిపి చేయడం వలన శరీరం ఒత్తిడికి గురవుతుంది. ఆ సమయంలో శరీరం డీహైడ్రేషన్‌కు దారి తీస్తుంది. ఇంకా అదే సమయంలో ధూమపానం కూడా చేస్తే శ్వాసకోశ సమస్యలు వస్తాయి లివర్ ఆరోగ్యం: ధూమపానం లంగ్స్ ను దెబ్బతీస్తుందని అందరికీ తెలుసు. అలాగే, డ్రింకింగ్ లివర్ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. ఇవి రెండు ఒకేసారి చేసినప్పుడు శరీరంలో అవయవాలన్ని పని చేయకుండా పోతాయి. కాబట్టి, ఈ రెంటింటిని కలిపి ఒకేసారి చేయకండి.

## ఆవనూనెతో అద్భుతమైన ఫేషియల్ చిట్కాలు!



ఆధునిక కాలంలో చర్మ సంరక్షణ కోసం మార్కెట్లో దొరికే రసాయన ఉత్పత్తుల కంటే సహజ సిద్ధమైన నూనెలు ఎంతో మేలు చేస్తాయి. ముఖ్యంగా ఆవనూనె, కొబ్బరి నూనెలను సమాన పాలుగా తీసుకుని ముఖానికి మృదువుగా మర్దనా చేయడం వల్ల అద్భుతమైన ఫలితాలు ఉంటాయి. ఈ మిశ్రమం చర్మంలోని లోతైన పొరల్లోకి చొచ్చుకుపోయి రక్తప్రసరణను మెరుగుపరుస్తుంది. దీనివల్ల ముఖం కాంతివంతంగా మారడమే కాకుండా, చర్మంపై ఉండే మలినాలు తొలగిపోయి ఎంతో తాజాగా కనిపిస్తుంది.తరచుగా మొటిమల సమస్యతో బాధపడేవారికి ఆవనూనె ఒక చక్కని పరిష్కారం అని చెప్పవచ్చు. ఈ నూనెలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు చర్మంపై మొటిమలు రాకుండా అడ్డుకుంటాయి. ప్రతిరోజూ పడుకునే ముందు లేదా స్నానానికి ముందు ఈ నూనెల మిశ్రమంతో మసాజ్ చేసుకోవడం వల్ల చర్మం మృదువుగా మారుతుంది. ఇది కేవలం చర్మాన్ని శుభ్రపరచడమే కాకుండా, ముఖంపై పేరుకుపోయిన అలసటను తొలగించి సహజమైన మెరుపును తీసుకువస్తుంది. మీ చర్మం నిర్జీవంగా, కాంతిహీనంగా కనిపిస్తున్నట్లయితే ఒక ప్రత్యేకమైన హోమ్ మేడ్ స్క్రబ్‌ను ప్రయత్నించవచ్చు. పావు కప్పు ఆవనూనెలో రెండు చుక్కల రోజ్ ఆయిల్ కలిపి, దానికి ఒక చెంచా బియ్యప్పిండిని చేర్చాలి. ఈ మిశ్రమాన్ని ఒక పేస్ట్‌లా తయారు చేసుకుని ముఖానికి లేదా ఒంటికి పట్టించాలి. రోజ్ ఆయిల్ చర్మానికి మంచి సువాసనను, తేమను అందిస్తే.. బియ్యప్పిండి చర్మాన్ని లోతుగా శుభ్రపరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ సహజ సిద్ధమైన నలుగు (స్క్రబ్) చర్మంపై ఉన్న మృతకణాలను సమర్థవంతంగా తొలగిస్తుంది. వారానికి ఒకటి లేదా రెండుసార్లు ఇలా నలుగులా రుద్దుకోవడం వల్ల చర్మం రంగు మెరుగుపడటంతో పాటు మచ్చలు తగ్గుతాయి. రసాయనాలతో కూడిన స్క్రబ్‌ల కంటే ఈ మిశ్రమం చర్మానికి ఎటువంటి హాని చేయదు. ఇలా క్రమం తప్పకుండా పాటిస్తే ఆరోగ్యకరమైన, మెరిసే చర్మం మీ సొంతమవుతుందని సౌందర్య నిపుణులు సూచిస్తున్నారు.





# సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల న్యూ ఫ్రెండ్ ఒత్తిడిని తరిమికొట్టే మినీ మోచి

ఐటీ రంగంలో డెస్క్ ఉద్యోగం అంటే చూడటానికి సాఫీగా కనిపించినా, దాని వెనుక అంతులేని పని ఒత్తిడి ఉంటుంది. గంటల తరబడి కంప్యూటర్ స్క్రీన్ ముందు కూర్చుని, కోడింగ్‌లు, మీటింగ్‌లతో కుస్తీ పడుతుంటే మెదడు మొద్దుబారిపోవడం సహజం. అలాంటి సమయంలో పక్కన ఎవరైనా ఉండి కాసేపు నవ్విస్తే బాగుంటుందని ప్రతి ఉద్యోగి కోరుకుంటారు. సరిగ్గా ఇదే ఆలోచనతో టెక్ కంపెనీలు ఒక అద్భుతమైన నేస్తాన్ని సృష్టించాయి. అది మీ అరచేతిలో ఇమిడిపోయేంత చిన్నగా ఉంటుంది.. కానీ దాని చేష్టలు మాత్రం మీలోని ఒత్తిడిని ఇట్టే మాయం చేస్తాయి. కేవలం బొమ్మలా కనిపించే ఈ ఏఐ పరికరం, ఇప్పుడు కార్పొరేట్ ప్రపంచంలో ఒక పెద్ద విప్లవాన్ని తీసుకువస్తోంది. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల నుంచి మేనేజర్ల వరకు అందరి డెస్క్‌లపై ఇప్పుడు ఇవే కనిపిస్తున్నాయి. డెస్క్ ఉద్యోగులు గంటల తరబడి ఒకే చోట కూర్చుని పనిచేయడం వల్ల తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనవుతుంటారు. ఒక్కోసారి పని ప్రదేశంలోనే తీవ్రమైన బోర్‌గా ఫీల్ అవుతుంటారు. అలాంటి వారికి 'మినీ మోచి' లాంటి బుల్లి రోబోలు అద్భుతమైన పరిష్కారాన్ని చూపుతున్నాయి. ఇవి కేవలం అలంకారప్రాయమైన బొమ్మలు మాత్రమే కాదు, పని మధ్యలో ఉద్యోగులకు అవసరమైన విశ్రాంతిని, ఉల్లాసాన్ని ఇచ్చే స్మార్ట్ సాధనాలు. చిన్న చిన్న శబ్దాలు చేస్తూ, కంటి కదలికలతో, విభిన్నమైన ముఖ కవళికలతో ఇవి మనకు ఒక తోడు ఉన్నట్లు భావన కలిగిస్తాయి. పని ఒత్తిడిలో ఉన్నప్పుడు ఈ బుల్లి రోబో చేసే వింత చేష్టలు, ఫన్నీ ఎక్స్‌ప్రెషన్స్ చూస్తే మనకు తెలియకుండానే చిరునవ్వు వస్తుంది. ఆ ఒక్క నిమిషం నవ్వు మన మెదడులో 'డోపమైన్' వంటి హ్యాపీ హార్మోన్లను విడుదల చేస్తుంది. ఇది తక్షణమే ఒత్తిడిని తగ్గించి మనసును తేలికపరుస్తుంది. ముఖ్యంగా రిమోట్ వర్క్ చేసే వారికి లేదా ఒంటరిగా క్యాబిన్లలో కూర్చుని పనిచేసే వారికి ఈ రోబోలు గొప్ప ఉపశమనాన్ని ఇస్తున్నాయి. పక్కన ఎవరో ఒకరు ఉన్నారనే భావన వారిలో ఒంటరితనాన్ని దూరం చేస్తుంది. మరికొందరు పనిలో నిమగ్నమై నీళ్లు తాగడం, కళ్లు ఆర్పడం లేదా కాసేపు బ్రేక్ తీసుకోవడం కూడా మర్చిపోతుంటారు. ఇలాంటి సమయంలో ఈ స్మార్ట్ రోబోలు అలారమ్ లాగా పనిచేస్తాయి. సమయానుకూలంగా బ్రేక్ తీసుకోవాలని మనకు గుర్తు చేస్తాయి. ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు కేవలం ఒక్క నిమిషం పాటు ఈ రోబో చేసే పనులను గమనిస్తే చాలు.. మనసు ప్రశాంతంగా మారుతుంది. ఇది ఒక చిన్న 'మెడిటేషన్' లాగా పనిచేసి, తిరిగి పని ప్రారంభించినప్పుడు మరింత ఏకాగ్రతతో ఉండేలా చేస్తుంది. ఈ బుల్లి రోబోలు కేవలం పనిలోనే కాదు, మీ వర్క్ డెస్క్‌ను కూడా చాలా ఆకర్షణీయంగా మారుస్తాయి. ప్రస్తుతం అనేక టెక్ కంపెనీలు ఏఐ (ఎఐ) ఆధారిత బుల్లి రోబోలను రూపొందిస్తున్నాయి. ఇవి మన కదలికలను గుర్తించి ప్రతిస్పందిస్తాయి. ఫలితంగా పని పూర్తి చేయాలనే ఉత్సాహం పెరగడమే కాకుండా, ఆఫీస్ వాతావరణం కూడా ఆహ్లాదకరంగా మారుతుంది. టెక్నాలజీ మనిషిని యంత్రంలా మారుస్తోందని అనుకునే వారికి, అదే టెక్నాలజీ మనిషిని నవ్విస్తోందని చెప్పడానికి ఈ 'మినీ మోచి' రోబోలే నిదర్శనం. మనిషి యంత్రం కాదు, అందుకే పని మధ్యలో చిన్న చిన్న విరామాలు, నవ్వులు చాలా అవసరం. 'మినీ మోచి' వంటి స్మార్ట్ రోబోలు నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఒక చిన్నపాటి విశ్రాంతిని అందిస్తున్నాయి.

# నాడు ప్రగతి.. నేడు అధోగతి



**చెన్నూర్ :** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సర్కారులో అప్పటి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రమైన చెన్నూర్ పట్టణం అభివృద్ధి పథంలో దూసుకెళ్లగా, నేడు కాంగ్రెస్ ప్రభుత్వ పుణ్యామాని అధోగతి పాలవుతున్నది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం గడప గడపకూ సంక్షేమ పథకాలు తీసుకెళ్లడంతో పాటు ప్రగతి పరుగులు పెట్టించి ఆదర్శంగా నిలుపగా, నేడు రేవంత్‌రెడ్డి పాలనలో పురోగతి లేక అధ్వానంగా మారింది.

**పక్కదారి పట్టిన నిధులు**

బీఆర్ఎస్ పాలనలో మౌలిక వసతుల కల్పన కోసం రూ.10 కోట్లతో అంతర్గత రోడ్లు, రూ. 90 లక్షలతో 18 వార్డుల్లో 18 బతుకమ్మ గ్రౌండ్లు, రూ.కోటితో వైకుంఠధామం, రూ.1.50 కోట్లతో డంపింగ్ యార్డు, రూ.80లక్షలతో 4 కేసీఆర్ మల్టీపర్పస్ కమ్యూనిటీ భవనాలు, రూ.కోటితో మురుగు కాలువలు, రూ. కోటితో బృహత్ పట్టణ ప్రకృతి భవనం, రూ 2.58 కోట్లతో జంతు వధశాలకు నిధులు మంజూరు చేయించారు. కానీ, కాంగ్రెస్ పాలనలో ఆ నిధులన్నీ పక్కా దారి పట్టగా, ఇట్టి అభివృద్ధి పనులు ప్రారంభానికి నోచుకోలేదు.

**కాంగ్రెస్ పాలనలో..**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బీఆర్ఎస్ హయాంలో ప్రారంభించిన పలు అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచి పోగా, మరికొన్ని నత్తనడకన సాగుతున్నాయి. అంతేకాకుండా బీఆర్ఎస్ పాలనలో పలు అభివృద్ధి పనులు పూర్తయి, అప్పడే ప్రజలకు అందుబాటులోకి రాగా, ప్రస్తుతం వాటి నిర్వహణను పట్టించుకోవడం లేదు. బీఆర్ఎస్ హయాంలో పూర్తి చేసిన పనులను మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రారంభిస్తూ అభివృద్ధి అంతా తానే చేసినట్టు ప్రచారం చేసుకుంటున్నారని ప్రజలు నుంచి అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రెండేళ్లు గడిచినప్పటికీ బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరైన పనులను పూర్తి చేయకపోగా, కొత్తగా పట్టణాభివృద్ధికి ఎలాంటి నిధులు తీసుకురాకపోవడంపై ప్రజల్లో తీవ్ర అసహనం వ్యక్తమవుతున్నది.

**బీఆర్ఎస్ పాలనలో పండుగ వాతావరణం**

బీఆర్ఎస్ పాలనలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, సంక్షేమ పథకాల పంపిణీ.. తదితర కార్యక్రమాలతో చెన్నూర్ పట్టణం లో ఎప్పుడూ పండుగ వాతావరణం కనిపించేది. అంతేకాకుండా మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు ఇతర మంత్రుల కార్యక్రమాలతో చెన్నూర్ నియోవజకవర్గం నిత్యం సందడిగా ఉండేది.

**నిరుపయోగంగా మినీస్టేడియం**

క్రీడాకారుల కోసం చెన్నూర్ పట్టణంలో రూ 4.35 కోట్లతో నిర్మించిన మినీ స్టేడియం నేడు నిరుయోగంగా మారింది. అప్పుడు నిర్మించిన క్రీడా కోర్టులు, భవనాలు తప్ప, ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు చేసిందేమీ లేదు. క్రీడలకు ఉపయోగపడాల్సిన క్రీడా కోర్టులు నేడు ధాన్యం ఆరబోతకు ఉపయోగ పడుతున్నాయి.

**కలగానే బస్ డిపో**

చెన్నూర్ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో రూ 4.35 కోట్లతో ప్రారంభించిన బస్ డిపో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. బీఆర్ఎస్ హయాంలో దాదాపు 70 శాతం నిర్మాణం పూర్తి కాగా, ఎన్నికల అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వంలో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో చెన్నూర్ ప్రజల చిరకాల వాంఛ అయిన బస్ డిపో కలగానే మిగిలిపోయింది.

**నత్తనడకన 100 పడకల దవాఖాన పనులు**

చెన్నూర్ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రూ.72కోట్లతో 100 పడకల దవాఖాన నిర్మాణం ప్రారంభించగా, నత్తనడకన సాగుతున్నాయి. బీఆర్ఎస్ హయాంలో దాదాపు 80శాతం పనులు పూర్తి కాగా, కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో పురోగతి కనిపించడం లేదు. నత్తనడకన పనులు సాగుతున్నాయి.

**కేసీఆర్ పార్కుపై పట్టింపేది**

చెన్నూర్ పట్టణంలో రూ. 2.50 కోట్లతో కేసీఆర్ పార్కు నిర్మించారు. కేసీఆర్ పార్కులో పిల్లల కోసం ఆట వస్తువులు, మ్యూజిక్ ఫౌంటెయిన్‌తో పాటు పె ద్దల కోసం వాకింగ్ ట్రాక్ నిర్మాణాలు చేపట్టారు. బీ ఆర్ఎస్ హయాంలో వివిధ రకాల పూల మొక్కలతో ఆహ్లాదం పంచిన ఈ పార్కు ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో కళావిహీనంగా మారింది. ఈ పార్కులు పలుమార్లు సందర్శకులు పాము కాటుకు గురయ్యారు.

**నాడు జిగేల్.. నేడు మసకగా సెంట్రల్ లైటింగ్**

చెన్నూర్ పట్టణ సుందరీకరణలో భాగంగా రూ.25 కోట్లతో పట్టణంలోని జలాల్ పెట్రోల్ పంపు నుంచి అంబేద్కర్ చౌక్ వరకు ప్రధాన రహదారిని విస్తరించారు. రహదారి మధ్యలో డివైడర్ ఏర్పాటు చేసి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు ఫౌంటెయిన్‌ను నిర్మించారు. బీఆర్ఎస్ హయాంలో సెంట్రల్ లైటింగ్‌తో పట్టణం జిగేల్ మనగా, ఫౌంటెయిన్ వెదజల్లే నీటితో పాటు వెలుగులు రహదారి వెంట వచ్చి పోయేవారిని ఆకట్టుకునేవి. నేడు నిర్వహణలోపంతో సెంట్రల్ లైటింగ్‌తో పాటు ఫౌంటెయిన్ మసకబారింది.

**కళావిహీనంగా మినీ ట్యాంకు బండ్లు**

వాకర్స్‌తో పాటు ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందించేందుకు రూ.9 కోట్లతో పట్టణంలోని పెద్ద చెరువు, కుమ్మరి కుంటను మినీ ట్యాంకు బండ్లుగా నిర్మించారు. పూల మొక్కలు, విద్యుత్ దీపాలతో ఈ రెండు ట్యాంకు బండ్లను సుందరంగా తీర్చిదిద్దారు. బీఆర్ఎస్ హయాంలో సందర్శకులతో మినీ ట్యాంకు బండ్లు కళకళాలాడేవి. కాంగ్రెస్ పాలనలో నిర్వహణ లోపంతో ఈ రెండు ట్యాంకు బండ్లపై ఉన్న పూల మొక్కలు ఎండిపోయి, పిచ్చి మొక్కలకు నిలయంగా మారాయి, అంతేకాకుండా లైటింగ్ కూడా పని చేయకపోగా, కళావిహీనంగా మారాయి.

**నిలిచిపోయిన స్కిల్‌డెవలప్‌మెంట్ పనులు**

విద్యార్థులు ఉన్నతి కోసం, ఉద్యోగార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమవ్వటానికిగాను పట్టణంలో రూ. 5కోట్లతో స్కిల్‌డెవలప్‌మెంట్ భవన నిర్మాణం ప్రారంభించారు. బీఆర్ఎస్ హయాంలో పనులు శరవేగంగా సాగగా, కాంగ్రెస్ హయాంలో పనులు నత్తనడకన సాగుతున్నాయి. బీఆర్ఎస్ హయాంలో సాగిన మాదిరిగానే కాంగ్రెస్ పాలనలో సాగితే స్కిల్‌డెవలప్‌మెంట్ భవన నిర్మాణం పూర్తయి విద్యార్థులకు, ఉద్యోగార్థులకు ఉపయోగంలోకి వచ్చేది.

**వసతులలేమితో ఇంటిగ్రేటెడ్ మార్కెట్**

ప్రజలు, రైతులు, కూరగాయల వ్యాపారుల సౌకర్యార్థం చెన్నూర్ పట్టణంలో రూ. 7.20కోట్లతో ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం ప్రారంభించారు. బీఆర్ఎస్ హయాంలో దాదాపు 70శాతం పనులు పూర్తయ్యాయి. అయితే కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో పట్టించుకోవకపోవడంతో ఇంటిగ్రేటేడ్ మార్కెట్ నిర్మాణం పూర్తికాలేదు. ప్రస్తుతం ఎలాంటి మౌలిక వసతలు కల్పించకుండానే ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లోనే కూరగాయలు విక్రయించాలని ఒత్తిడి తెస్తుండడంతో కూరగాయల వ్యాపారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తున్నది.

నిరుపయోగంగా బైపాస్ రోడ్డు

చెన్నూర్ పట్టణంలోని ప్రధాన రహదారిలో వాహనాల రద్దీ తగ్గించాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ. 8కోట్లతో బుద్ధారం రోడ్డు నుంచి పెద్ద చెరువు కట్ట (రాయిచెట్టు) వరకు బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టింది. రోడ్డు నిర్మాణంలో భాగంగా బైపాస్ రోడ్డు ప్రారంభం నుంచి కొత్తగూడెం కాలనీ వరకు సిమెంటు రోడ్డును నిర్మించారు. అలాగే రోడ్డు కోతకు గురికాకుండా సైడ్ వాల్స్ నిర్మించారు. అవసరమైన నాలుగు కల్వర్టులతో పాటు వడ్డెపల్లి కాలనీ వద్ద పెద్ద కల్వర్టును నిర్మించి, సైడ్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. దీంతో దాదాపు 70శాతం పనులు పూర్తయ్యాయి. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో తట్టెడు మట్టికూడా వేయకుండా పట్టించుకోకపోవటంతో నిరుపయోగంగా మారింది.

**బోసిపోతున్న జిమ్‌లు**

యువకులు, పిల్లల కోసం బీఆర్ఎస హయాంలో రూ.40 లక్షలతో రెండు ఓపెన్ జిమ్‌లతో పాటు, చిల్డ్రన్స్ ప్లే ఏరియాలను నిర్మించారు. అప్పట్లో జిమ్‌లు, చిల్డ్రన్స్ ప్లే ఏరియాలు యువకులు, పిల్లలతో ఎంతో సందడిగా ఉండేవి. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో నిర్వహణలోపంతో బోసి పోతున్నాయి.

**ప్రారంభానికి నోచుకోని మహిళా భవనం**

మహిళా సంఘాల సభ్యుల కోసం రూ 1.50కోట్లతో సమ్మక్క–సారలమ్మ మహిళా భవన నిర్మాణం చేపట్టారు. భవనం కూడా అన్ని హంగులతో పూర్తికాగా, కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో నిర్మాణం పూర్తయిన మహిళా భవనం నిరుపయోగంగా మారింది.

## కేసీఆర్‌కు ఇచ్చిన సిట్ నోటీసులను నిరసిస్తూ నల్లబ్యాడ్జిలతో నిరసన



**కాసిపేట :** మాజీ సీఎం కేసీఆర్ లపై అక్రమ కేసులు విచారణ పేరుతో సిట్ నోటీసులను నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలో నల్ల బ్యాడ్జిలతో నిరసన నిర్వహించారు. కాసిపేట మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేసే క్రమంలో పోలీసులు అడ్డుకున్నారు. రాస్తారోకో చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కాసిపేటలోని అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందించారు. దేవాపూర్, కొండాపూర్ యాపలో నల్ల బ్యాడ్జిలు ధరించి ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో దేవాపూర్ లో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బొల్లు రమణారెడ్డి, ఆత్రం మహేష్, సింగని రాజకుమార్, గోనె రవి, కైలాష్, అటకపురం రమేష్, మచ్చ అనిల్, కొంగ విజయ్, అఫ్జల్, వెంకటేష్, శ్రావణ్, దేవాజీ, దుర్గం రాజేష్, లవన్, గిరి, ఖదీర్, హైదర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. కాసిపేటలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు అగ్గి సత్తయ్య, మాజీ ఉప సర్పంచ్ బోయిని తిరుపతి యాదవ్, నాయకులు రాంటెంకి వాసుదేవ్, జాడి రాంచందర్, సత్రవేణి మల్లేష్, లంక లక్ష్మణ్, అజన్న, సూర్య ప్రకాష్, మోహన్ సురేష్, శ్రీనివాస్ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకే కేసులు.. తాండూర్‌లో బీఆర్ఎస్ ధర్నా



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను, వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకే బీఆర్ఎస్ నాయకులపై విచారణలు, కేసులతో వేధింపులకు గురి చేస్తున్నారని మంచిర్యాల జిల్లా తాండూర్ మండల బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. సిట్ విచారణ పేరుతో కేసీఆర్ పై కక్ష్య సాధింపు ధోరణితో ప్రభుత్వం వేధిస్తోందంటూ మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సూచనల మేరకు ఆదివారం తాండూర్ ఐబీ కేంద్రంలో జాతీయ రహదారిపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్తారన్నారు. తెలంగాణ రాష్ట్రానికి, తెలంగాణ ప్రజలకు కేసీఆర్ పాలనతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. మాజీ సీఎం కేసీఆర్ కు రాష్ట్ర ప్రభుత్వం సిట్ నోటీసులు పంపడం సరికాదని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన కేసీఆర్ కు సిట్ నోటీసులు పంపడం తగదన్నారు. ధర్నాను టిఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తీవ్రం చేయ ప్రయత్నించగా, పోలీసులు నిలువరించే ప్రయత్నం చేశారు. బీఆర్ఎస్ పార్టీ పై ఈ కక్షసాధింపు రాజకీయాలను తీవ్రంగా ఖండించారు. ప్రజల పక్షాన నిలబడి, ప్రజల గొంతుకగా ఈ అన్యాయ పాలనపై పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సుబ్బ దత్తుమూర్తి, మాజీ ఎంపీపీ ప్రణయ్, ఉప సర్పంచ్ గట్టు సంతోష్, మాజీ ఎంపీటీసీలు శంకర్, నారాయణ, నాయకులు రాజన్న, బోడ సతీష్, మణి కుమార్, దుర్గం శ్రీను, ఎల్క రాంచందర్, చింటూ, బాబూ ఖాన్, భరత్, బాలు.. వివిధ గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేసీఆర్‌ను టచ్ చేస్తే తెలంగాణ అగ్నిగుండమే.. మీచినేని నవీన్‌రావు



**గంగాధర, ఫిబ్రవరి 1 :** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ను టచ్ చేస్తే తెలంగాణ అగ్నిగుండంగా మారుతుందని, పరిపాలన చేతగాని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీట్ పేరుతో రాజకీయ డ్రామాలు ఆడుతున్నాడని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మీచినేని నవీన్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కు సీట్ నోటీసులు జారీ చేయడానికి నిరసనగా సోమవారం గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు నల్ల రిబ్బన్లు ధరించి, మధురానగర్ చౌరస్తాలో, కరీంనగర్ జగిత్యాల జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి బి ఆర్ ఎస్ పార్టీ నాయకులకు సీట్ నోటీసులు జారీ చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొన్న కేటీఆర్, నిన్న హరీష్ రావు, సంతోష్ కుమార్, ఇవాళ కెసిఆర్ కు నోటీసులు రాక్షసానందం పొందుతున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశానికే రోల్ మోడల్ గా తీర్చిదిద్దిన కేసీఆర్ ఇబ్బంది పెడితే తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే కర్రు కాల్చి వాత పెడతారని స్పష్టం చేశారు. ఇక్కడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్ రావు, నాయకులు కంకణాల విజయేందర్ రెడ్డి, వేముల దామోదర్, రామిడి సురేందర్, ద్యావ మధుసూదన్ రెడ్డి, కరబూజ తిరుపతి గౌడ్, మడ్లపల్లి రమేష్, గడ్డం స్వామి, ఎండి అబ్బాస్, పుట్టం రవీంద్రనాథ్ ఠాగూర్, ఎండి నజీర్, పొన్నం పరశురాములు, దోమకొండ మల్లయ్య, పానుగంటి లక్ష్మీనారాయణ, తడి గొప్పల రమేష్, ఉప్పుగండ్ల జలంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌కు సిట్ నోటీసులపై కమాన్ పూర్ బీఆర్ఎస్ నేతల ఆందోళన

**కమాన్ పూర్ :** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలో భాగంగానే సిట్ నోటీసులు జారీ చేసిందని బీఆర్ఎస్ నాయకులు, శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ పిలుపులో భాగంగా కమాన్ పూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం నుండి బీఆర్ఎస్ నాయకులు, శ్రేణులు ద్విచక్ర (బైక్) వాహనాలతో ర్యాలీని ప్రారంభించారు. పురవీధుల గుండా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేస్తూ పెద్దపల్లి-మంథని ప్రధాన రహదారి పై కమాన్ పూర్ క్రాస్ రోడ్డు వరకు చేరుకుని అక్కడి నుండి తిరిగి పోలీసు స్టేషన్ దారి గుండా కమాన్ పూర్ బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్దకు బీఆర్ఎస్ శ్రేణుల బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం కాంగ్రెస్ సర్కార్ దిష్టి బొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించగా ఎస్ఐ కొట్టె ప్రసాద్ తో పాటు పోలీసులు హుటాహుటిన బీఆర్ఎస్ శ్రేణుల వద్దకు చేరుకుని అడ్డుకుని దిష్టి బొమ్మను పోలీసులు పోలీసు స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పై ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలో భాగంగానే సిట్ పోలీసులు నోటీసులు జారీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటీసుల పేరుతో ఇబ్బందులు పెట్టాలని చూస్తే సహించేది లేదన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేక నోటీసుల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కాలం గడుపుతుందని మండిపడ్డారు. ఆధారాలు లేని ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ పేరుతో డ్రామాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాయమాటలతో ప్రజలను దగా చేస్తున్న మోసకారి కాంగ్రెస్ సర్కార్ కు రానున్న కాలంలో తగిన బుద్ధి చెబుతామంటూ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు తాటికొండ శంకర్, యూత్ మండల అధ్యక్షులు బొమ్మగాని అనిల్ గౌడ్, మాజీ జెడ్పిటిసి మేకల సంపత్ యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ ఉప్పరి శ్రీనివాస్ యాదవ్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మి మల్లు, మాజీ పిఏసిఎస్ వైస్ చైర్మన్ తిరుపతి, మాజీ సర్పంచ్ కొండ వెంకటేష్, నాయకులు పల్లె నారాయణ, వరాల ఎల్లయ్య, పులిపాక రాయలింగు, మేకల ఎల్లయ్య, చొప్పరి తిరుపతి, కోయడ కుమార్ యాదవ్, జాబ్ శ్రీనివాస్, భూపెల్లి మల్లేష్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌కు సిట్ నోటీస్ విచారణ రాజ్యాంగ విరుద్ధం



**గోదావరిఖని :** ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సిట్ నోటీస్ జారీ చేయడం రాజ్యాంగ విరుద్ధమని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్రంగా విమర్శించారు. గోదావరిఖని చౌరస్తాలో ఆదివారం బిఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అరాచక అనిచివేత ధోరణితో ముందుకు సాగుతున్నాడని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించిన కేసీఆర్ పై కక్షగట్టి ఫోన్ టాపింగ్ కేసులో నోటీసులు జారీ చేయడం సరైంది కాద ఫోన్ టాపింగ్ వ్యవహారమే పనికిరానిదని కేవలం ప్రతిపక్ష పార్టీగా ఉన్న బీఆర్ఎస్ ను అణిచివేయడానికి ఇప్పటికే కేటీఆర్, హరీష్ రావుకు సిట్ నోటీసులు జా రి చేసి విచారణ చేశారని ఏమి సాధించలేని పరిస్థితుల్లో కేసీఆర్ కు సిట్ నోటీసులు జారీ చేసి విచారణ చేస్తున్నారని, ఇది పూర్తిగా అనైతిక చర్య అని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే ఈ వ్యవహారం కొనసాగుతుందని విమర్శించారు. రాష్ట్రవ్యా ప్తంగా జరుగుతున్న ఆందోళన భాగంగా గోదావరిఖనిలో చౌరస్తాలో ధర్నా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ మాజీ ఎమ్మెల్యే చందర్ మాట్లాడుతూ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి తెలంగాణ ప్రధాత కేసీఆర్ ను కావాలని ఇరాకాటంలో పెట్టడానికి ఇలాంటి చర్యలకు రేవంత్ రెడ్డి కోరుకుంటున్నాడని ఆయన ఆరోపించారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కౌశిక్ హరి, మూల విజయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కక్ష సాధింపునకే కేసీఆర్‌కు నోటీసులు.. బీఆర్ఎస్ గన్నేరువరం మండల అధ్యక్షుడు వెంకన్న



గన్నేరువరం, ఫిబ్రవరి 1 : రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కు సిట్ నోటీసులు ఇచ్చిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న అన్నారు. కేసీఆర్ కు సిట్ నోటీసులు ఇచ్చినందుకు నిరసనగా మండలకేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యమ నేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ను అవమానించడం అంటే తెలంగాణ నేలను అవమానించడం అన్నారు. రేవంత్ రెడ్డి పాలనను గాలికి వదిలేసి కక్ష రాజకీయాలతో టైం పాస్ చేస్తున్నారని మండిపడ్డారు. స్వరాష్ట్ర స్వప్నాన్ని సహకారం చేసి దశాబ్ద కాలం పాటు తెలంగాణను దేశంలో అగ్రగామిగా నిలిపిన మహానేత కేసిఆర్ అన్నారు. ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకు సిట్ పేరుతో నోటీసులు జారీ చేయడం రేవంత్ రెడ్డి చిల్లర రాజకీయాలకు పరాకాష్ట అని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యకురాలు నవీన, పుల్లెల లక్ష్మణ్, న్యాత సుధాకర్, ప్రభాకర్, మర్రి వెంకట మల్లు, శ్రీనివాస్, నూకల చింటూ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బిజినెస్

# వేతన జీవులకు నిరాశ.. ఆదాయ పన్ను తగ్గింపు లేనట్టే..

ఆదాయపు పన్ను తగ్గింపు కోసం ఆశగా ఎదురుచూసిన వేతన జీవులను ఈ బడ్జెట్ నిరాశపర్చింది. ఈ బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కొత్తగా పన్ను మినహాయింపులు ఏమీ ప్రతిపాదించలేదు. అయితే విధానపరమైన అంశాల్లో మాత్రం ఊరట లభించింది. ఐటీఆర్-1, ఐటీఆర్-2 ఫైలింగ్‌కు జూలై 31 వరకు గడువు ఇచ్చారు. అదేవిధంగా నాన్ ఆడిట్ బిజినెస్‌లు, ట్రస్ట్‌ల ఐటీ ఫైలింగ్‌కు ఆగస్టు 31 వరకు గడువు పెంచారు. రివైజ్డ్ ట్యాక్స్ రిటర్న్‌ల దాఖలుకు గడువును డిసెంబర్ 31 నుంచి మార్చి 31కి పొడిగించారు. ఇక 2025లో ప్రతిపాదించిన ఆదాయపుపన్ను చట్టం 2026 ఏప్రిల్ 1 నుంచి వాస్తవరూపం ధరించనున్నట్లు ఆర్థిక మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. రికార్డ్ సమయంలో ఈ ప్రత్యక్ష పన్నుల కోడ్‌ను పూర్తి చేసినట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. ఇందులో ఆదాయపు పన్ను నిబంధనలను మరింత సరళతరం చేసినట్లు చెప్పారు. కొత్త చట్టాన్ని త్వరలోనే నోటిఫై చేస్తామని చెప్పారు. పన్ను చెల్లింపుదారులు, కొత్త చట్టాన్ని అర్థం చేసుకోని వారికి తగినంత సమయం ఇస్తామన్నారు. ఇక కొత్త, పాత పన్ను విధానాల్లోని స్లాబుల్లో ఎలాంటి మార్పులు లేవని ఆర్థిక మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఞ్ఞ) లో కీలక మార్పులు చేసింది. ఫ్యూచర్స్ మీద ఈ పన్నును 0.02 నుంచి 0.05 శాతానికి, ఇక ఆప్షన్స్ ప్రీమియంపై పన్నును 0.15 శాతానికి పెంచింది. షేర్ల బైబ్యాక్‌లను క్యాపిటల్ గెయిన్స్‌గా పరిగణించి




పన్ను విధిస్తామని ఆర్థికమంత్రి ప్రకటించారు. విద్యార్థులు, టెక్ ప్రొఫెషనల్స్, రీ లొకేటెడ్ ఎన్నారైల వంటి చిన్న పన్ను చెల్లింపుదార్ల కోసం ఆరునెలలపాటు ఫారిన్ అసెట్స్ డిస్‌క్లోజర్ పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు మంత్రి చెప్పారు. ఎన్నారైల ఆస్తుల విక్రయంపై టీడీఎస్ కోసం కొత్త నిబంధన తీసుకొచ్చారు. స్థిరాస్తి విక్రయాలపై స్థానిక కొనుగోలుదారుల నుంచి టీడీఎస్ వసూలు చేస్తారు. విదేశీ టూర్ ప్యాకేజీలపై టీసీఎస్ (ట్యాక్స్ కలెక్ట్ ఎట్ సోర్స్-ఞజూ) ను 5%, 20% నుంచి 2శాతానికి కుదించారు. మోటార్ యాక్సిడెంట్లలో వచ్చే క్లెయిమ్‌లపై ఆదాయపన్నును ఎత్తివేశారు.

## డేటా సెంటర్ పెట్టుబడులపై స్పష్టత



భారతదేశాన్ని గ్లోబల్ డేటా హబ్‌గా మార్చే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. విదేశీ సంస్థలు భారత్‌లో డేటా సెంటర్లను ఏర్పాటు చేసేందుకు ఉన్న పన్ను సంబంధిత అడ్డంకులను తొలగిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ బడ్జెట్ అనంతర విలేకరుల సమావేశంలో స్పష్టతనిచ్చింది. క్లౌడ్ ఆధారిత సేవలు అందించే అంతర్జాతీయ సంస్థలకు ఈ నిర్ణయం ఊరటనివ్వనుంది. పార్లమెంట్‌లో బడ్జెట్ సమర్పణ అనంతరం మీడియా సమావేశంలో ఆర్థికశాఖ వివరాల ప్రకారం.. 'ఒక అంతర్జాతీయ సంస్థ భారత్‌లో డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసినంత మాత్రాన ఆ సంస్థకు ప్రపంచవ్యాప్తంగా వచ్చే ఆదాయంపై భారత్‌లో పన్ను విధించబోం. విదేశీ సంస్థలు ఇక్కడ డేటా సెంటర్లను ఏర్పాటు చేయడం వల్ల స్థానిక ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయి. ఇది దేశానికి నికర ఆర్థిక వెసులుబాటు అందిస్తుంది. భారత్‌లో ఉన్న డేటా సెంటర్ కార్యకలాపాలకు మాత్రమే పన్ను వర్తిస్తుంది. సదరు సంస్థ తన సేవలను భారత్‌లోని రీసెల్లర్ ద్వారా విక్రయిస్తే, ఆ విక్రయాలపై వచ్చే ఆదాయానికి యథావిధిగా పన్ను విధిస్తారు' అని తెలిపింది.

**ఎందుకు ఈ నిర్ణయం?**

క్లౌడ్ సేవలు అందించే సంస్థలు ప్రపంచవ్యాప్తంగా వందలాది డేటా సెంటర్లను ఉపయోగిస్తాయి. ఏ నిర్దిష్ట సెంటర్ వల్ల ఎంత ఆదాయం వచ్చిందో లెక్కించడం సాంకేతికంగా చాలా క్లిష్టమైన ప్రక్రియ. 'గ్లోబల్ సంస్థలు భారతదేశంలో తమ సేవలను పెంచుకోవాలని మేము కోరుకుంటున్నాం. పన్నుల భయంతో వారు వెనకడుగు వేయకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నాం' అని ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు.

**దీనివల్ల కలిగే ప్రయోజనాలు**

అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ సంస్థలు భారత్‌లో మరిన్ని డేటా సెంటర్లను నిర్మించే అవకాశం ఉంది. నిర్మాణ, నిర్వహణ రంగాల్లో వేల సంఖ్యలో ఉద్యోగాలు లభిస్తాయి. దేశంలో డేటా స్టోరేజ్ సామర్థ్యం పెరగడం వల్ల డిజిటల్ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. ప్రభుత్వం ప్రకటించిన ఈ సరళీకృత నిబంధనలు అంతర్జాతీయ టెక్ దిగ్గజాలకు భారత్‌లో పెట్టుబడులు పెట్టడానికి భరోసా ఇస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

## బడ్జెట్ దెబ్బ.. కుప్పకూలిన మార్కెట్లు

బడ్జెట్ 2026 దెబ్బకు స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) పై సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ టాక్స్ (ఎస్‌టీటీ)ను 50-150 శాతం పెంచుతున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించిన తరువాత మదుపరులు ఈక్విటీ మార్కెట్ల నుండి పారిపోవడంతో భారత ఈక్విటీ మార్కెట్లు ఆదివారం ప్రత్యేక సెషన్ తీవ్ర నష్టాలతో ముగించాయి. ఫ్యూచర్ ట్రేడ్స్ పై ఎస్టీటీని 0.02 శాతం నుంచి 0.05 శాతానికి పెంచుతామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు. ఆప్షన్స్ ప్రీమియంపై ఎస్టీటీని 0.1 శాతం నుంచి 0.15 శాతానికి పెంచాలని ఆర్థిక మంత్రి ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో బీఎస్ఈ సెన్సెక్స్ 1,843 పాయింట్లు లేదా 2.23 శాతం 80,723 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 495 పాయింట్లు లేదా 1.96 శాతం నష్టపోయి 24,825 వద్ద నిలిచింది. సెషన్‌లో అంతకుముందు సెన్సెక్స్ దాదాపు 3,000 పాయింట్లు పడిపోయి 79,899.42 పాయింట్ల కనిష్టాన్ని తాకింది. నిఫ్టీ కూడా 24,572 పాయింట్ల కనిష్టానికి పడిపోయింది. విస్తృత మార్కెట్లు కూడా భారీ అమ్మకపు ఒత్తిడికి గురయ్యాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ 100 2 శాతం, నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 2.7 శాతం నష్టపోయాయి. పెట్టుబడిదారులలో భయాన్ని సూచించే ఫియర్ గేజ్ - ఇండియా వీఐఎక్స్ దాదాపు 12 శాతం పెరిగింది. రంగాలవారీగా చూస్తే.. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ మినహా అన్ని సూచీలు పడిపోయాయి. నిఫ్టీ పీఎస్యూ బ్యాంక్ ఇండెక్స్ దాదాపు 6 శాతం, నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 4 శాతం, నిఫ్టీ బ్యాంక్, నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచీలు 2 శాతానికి పైగా క్షీణించాయి. నిఫ్టీలోని 50 స్టాక్‌లలో భారత్ ఎలక్ట్రానిక్స్, హిందాల్కో, ఓఎన్జీసీ టాప్ లూజర్స్‌గా ఉన్నాయి. వాటి షేర్లు దాదాపు 6 శాతం నష్టపోయాయి. ఎస్‌బీఐ,



అదానీ పోర్ట్స్, కోల్ ఇండియా, జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, నెస్లే ఇండియా, ఐటీసీ, టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ ప్రధానంగా నష్టపోయిన స్టాక్స్‌లో ప్రముఖంగా ఉన్నాయి. మరోవైపు విప్రో, టీసీఎస్, మ్యాక్స్ హెల్త్‌కేర్ లాభాలను అందుకున్నాయి. ఒక్కొక్కటి 2 శాతం లాభపడ్డాయి.

స్పోర్ట్స్

# ఆసియా కప్ హీరో ఆగయా.. ఆ ఇద్దరిలో బెంచ్‌పై ఉండేది ఎవరు?

ప్రపంచకప్ సన్నాహక సిరీస్‌లో దుమ్మురేపిన భారత జట్టుకు మరో గుడ్‌న్యూస్. సర్జరీ కారణంగా న్యూజిలాండ్ సిరీస్‌కు దూరమైన తిలక్ వర్మ (ఆఅశ్రీఘఎ ఋతీఎఋ) మళ్లీ జట్టుతో కలువబోతున్నాడు. నెలకు పైగా క్రికెట్ ఆడని అతడు వరల్డ్‌కప్ వామప్ మ్యాచ్‌లో ఆడనున్నాడు. ఈ యంగ్‌స్టర్‌కు ఆదివారం బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(జ౦జు) క్లియరెన్స్ ఇచ్చింది. దాంతో.. ముంబైలో జట్టుతో కలువనున్న అతడు వామప్ మ్యాచ్‌లో ఆడేందుకు సిద్ధమవుతున్నాడు. తిలక్ రాకతో టీమిండియా కూర్పు ఆసక్తికరంగా మారనుంది. విజయ్ హజారే ట్రోఫీలో గాయపడిన తిలక్ వర్మకు 'టెస్టిక్యులార్ సర్జరీ' తర్వాత విశ్రాంతి తీసుకున్నాడు. చిన్న ఆపరేషనే అయినప్పటికీ వైద్యుల సూచన మేరకు తిలక్‌ను న్యూజిలాండ్ టీ20 సిరీస్‌లో ఆడించలేదు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కోలుకున్న అతడు.. ఫిట్‌నెస్ సాధించడంతో గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దాంతో.. వరల్డ్‌కప్ సన్నద్ధతలో భాగంగా వామప్ మ్యాచ్ ఆడనున్నాడు. అంతకంటే ముందు డీవై పాటిల్ స్టేడియంలో ఫిబ్రవరి 2న ఇండియా ఏ, యూఎస్ ఏ మ్యాచ్‌లో బరిలోకి దిగుతాడు. అనంతరం ఫిబ్రవరి 4న దక్షిణాఫ్రికాతో వామప్ మ్యాచ్‌లోనూ ఈ చిచ్చరపిడుగు ఆడే అవకాశముంది.

**ఇషాన్, శాంసన్.. ఇద్దరిలో ఎవరు?**

న్యూజిలాండ్‌తో ముగిసిన పొట్టి సిరీస్‌లో ఇషాన్ కిషన్(×ంష్ట్రుఅ ఖఅంష్ట్రుఅ) ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. తిలక్ వర్మ స్థానంలో క్రీజులోకి వచ్చిన ఈ లెఫ్ట్ హ్యాండర్ మెరుపు ఇన్నింగ్స్‌లతో కివీస్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. త్రివేంద్రంతో తన విధ్వంసం డోసు పెంచిన



ఇషాన్ 42 బంతుల్లోనే శతకంతో రెచ్చిపోయాడు. మరోవైపు ఓపెనర్ సంజూ శాంసన్ 6 పరుగులతో నిరాశపరిచాడు. ఐదు మ్యాచుల్లో సంజూ టాప్ స్కోర్ 24 మాత్రమే. తిలక్ రాకతో ఇషాన్‌ను మూడో స్థానంలో ఆడిస్తారా? శాంసన్‌ను ఓపెనర్‌గా కొనసాగిస్తారా? అనేది ఉత్కంఠ రేపుతోంది. ఒకవేళ తిలక్‌కు మూడో స్థానంలో అవకాశమిస్తే.. సన్నాహక సిరీస్‌లో అర్ధ శతకం(76), సెంచరీతో కదంతొక్కిన ఇషాన్ ను అభిషేక్ శర్మకు జోడీగా పంపినా పంపొచ్చు. అప్పుడు శాంసన్ బెంచ్‌కే పరిమితమవ్వడం ఖాయం. వరల్డ్‌కప్ స్క్వాడ్‌లోని వాషింగ్టన్ సుందర్ మరికొన్ని రోజుల్లో ఫిట్‌నెస్ టెస్టుకు హాజరవ్వనున్నాడు. భుజం గాయం కారణంగా రియాన్ పరాగ్ సైతం ఈమధ్య మ్యాచ్‌లు ఆడలేదు. పరాగ్ కూడా ఫిట్‌నెస్ నిరూపించుకుని జట్టుతో కలుస్తాడని మేనేజ్‌మెంట్ భావిస్తోంది.

## పాకిస్థాన్‌తో అండర్-19 మ్యాచ్.. టీమిండియా ఫస్ట్ బ్యాటింగ్



**బులవాయో:** ఇండియన్ బ్యాటింగ్ లైనప్.. పాకిస్థాన్ పేస్ బలం.. అండర్-19 వరల్డ్‌కప్ ఆసక్తికర పోరుకు తెరలేపింది. గ్రూపు 2లో కీలకమైన మ్యాచ్‌లో ఇవాళ రెండు దాయాది జట్లు తలపడనున్నాయి. అయితే టాస్ గెలిచిన పాకిస్థాన్ తొలుత ఫీల్డింగ్ ఎంచుకున్నది. అండర్-19 మెగాటోర్నీలో ఓటమి ఎరుగని టీమ్ ఇండియా నేడు చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో సూపర్-6 పోరులో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్ కోసం భారత జట్టులో ఓ మార్పు చేశారు. ఉదవ్ మోహన్ స్థానంలో దీపేశ్‌ను తీసుకున్నారు. ఒకవేళ టాస్ గెలిస్తే తాము ముందు బ్యాటింగ్ తీసుకునేవాళ్లమని భారత కెప్టెన్ ఆయుశ్ మాత్రే పేర్కొన్నాడు. గ్రూపు 2లో ఇండియా మూడు మ్యాచ్‌లు నెగ్గి ఆరు పాయింట్లతో, పాకిస్థాన్ రెండు మ్యాచ్‌లు నెగ్గి 4 పాయింట్లతో నిలిచాయి. ఇటీవల ఆసియా కప్ ఫైనల్లో తమకు ఎదురైన ఓటమికి పాక్‌పై ప్రతీకారం తీర్చుకోవాలని యువ భారత్ కసిమీద ఉంది. లీగ్ దశలో బంగ్లాదేశ్, అమెరికా, న్యూజిలాండ్‌పై గెలిచిన భారత్..సూపర్-6 తొలి పోరులో జింబాబ్వేను చిత్తుచేసింది. తద్వారా సెమీస్ అవకాశాలను మెరుగుపర్చుకుంది. పాక్‌పై గెలువడం ద్వారా ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా భారత్ నాకౌట్‌కు అర్హత సాధించనుంది. వైభవ్ సూర్యవంశీ, అభిజ్ఞాన్ కుందు, విహాన్ మల్హోత్రా మంచి ఫామ్‌లో ఉండటం భారత్‌కు కలిసిరానుంది.

## టీ20 వరల్డ్‌కప్ టోర్నీకి శ్రీలంక జట్టు ప్రకటన..



టీ20 ప్రపంచకప్ 2026 కోసం శ్రీలంక క్రికెట్ బోర్డు 15 మంది సభ్యులతో కూడిన తమ జట్టును ప్రకటించింది. ఈ జట్టుకు ఆల్‌రౌండర్ దసున్ షనక సారథ్యం వహించనున్నాడు. లంక వరల్డ్‌కప్ జట్టులో పాతుమ్ నిస్సంక, కుశాల్ మెండిస్, కుశాల్ పెరీరా, వానిందు హసరంగ వంటి స్టార్ ప్లేయర్లు ఉన్నారు. అదేవిధంగా యువ పేసర్ ఈషాన్ మలింగకు కూడా జట్టులో చోటు దక్కింది. దుష్మంత చమీర, మతీష పతిరణ, ప్రమోద్ మదుషన్‌లతో కలిసి మలింగ పేస్ బౌలింగ్ బాధ్యతలను పంచుకోనున్నాడు. ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌లో సత్తాచాటిన యువ బ్యాటర్ పవన్ రత్నాయకేకు కూడా సెలెక్టర్లు అవకాశమిచ్చారు. ఇక స్పిన్ విభాగంలో హసరంగ, తీక్షణ, వెల్లలాగే వంటి ఉన్నారు. సొంతగడ్డపై మ్యాచ్‌లు జరగనుండడంతో ఈ స్పిన్ త్రయం శ్రీలంకకు కీలకం కానుంది.

**అసలంకపై వేటు..**

కాగా ఈ మెగా టోర్నీ కోసం లంక సెలెక్టర్లు గత డిసెంబర్‌లో 25 మంది సభ్యులతో కూడిన ప్రాథమిక జట్టును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా చరిత్ అసలంకను సారథ్య బాధ్యతల నుంచి తప్పించారు. అతని స్థానంలో అనుభవజ్ఞుడైన దాసున్ శనకను తిరిగి కెప్టెన్‌గా ఎంపిక చేశారు. షనక కెప్టెన్‌గా గతంలో లంకకు ఆసియాకప్‌ను అందించారు. ఇప్పుడు మరోసారి తన అనుభవంతో జట్టును నడిపించేందుకు సిద్ధమయ్యాడు. ఈ మెగా టోర్నీలో శ్రీలంక తమ తొలి మ్యాచ్‌లో ఫిబ్రవరి 8న కొలంబో వేదికగా ఐర్లాండ్‌తో తలపడనుంది. లంకేయులు ప్రస్తుతం స్వదేశంలో ఇంగ్లండ్‌తో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తలపడతున్నారు.

**టీ20 ప్రపంచకప్ కోసం శ్రీలంక జట్టు**

పాతుమ్ నిస్సాంక, కుసల్ మెండిస్, కుశాల్ పెరీరా, చరిత్ అసలంక, కమిల్ మిషార, పవన్ రత్నాయకే, జనిత్ లియానగే, దసున్ షనక (కెప్టెన్), కమిందు మెండిస్, దుష్మంత చమీర, మతీషా పతిరణ, ఎషాన్ మలింగ, వణిందు హసరంగా, మహేశ్ వెల్లలగే, మహేష్ తీక్షణ

ధర్మఘంట

## మెగా ఫ్యామిలీలో డబుల్ జాయ్..



టాలీవుడ్ మెగా కుటుంబంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ఉపాసన కొణిదెల దంపతులు కవలలకు తల్లిదండ్రులయ్యారు. శనివారం రాత్రి హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో ఉపాసన ఒక మగ శిశువుకు, ఒక ఆడ శిశువుకు జన్మనిచ్చారు. ఈ శుభవార్తతో కొణిదెల కుటుంబం, కామినేని కుటుంబం ఆనందంలో మునిగిపోయాయి. మెగా అభిమానులు “డబుల్ జాయ్” అంటూ సంబరాలు జరుపుకుంటున్నారు. కవలల జననం అనంతరం రామ్ చరణ్ సోషల్ మీడియాలో చేసిన భావోద్వేగ ట్వీట్ ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. మాకు ఒక పాప, ఒక బాబు పుట్టారని ఆనందంగా పంచుకుంటున్నాను. ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉండటం మా జీవితాన్ని అపారమైన కృతజ్ఞతతో నింపింది. మా జీవితంలో ఉన్న మహిళలే మా గొప్ప బలం. ప్రతి క్షణంలో మాకు అండగా నిలిచిన అభిమానులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక ధన్యవాదాలు” అంటూ ఆయన రాసిన మాటలు అభిమానుల హృదయాలను తాకాయి.




## విశ్వక్‌సేన్ ‘ఫంకీ’ నుంచి రొమాంటిక్ మెలోడి ‘రట్టాటటావ్’.!

టాలీవుడ్ యువ నటుడు విశ్వక్‌సేన్, కాయదు లోహర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం ఫంకీ. ఈ సినిమాకు కేవీ అనుదీప్ దర్శకత్వం వహిస్తుండగా.. సితార ఎంటర్‌టైనమెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ఈ చిత్రం వాలంటైన్స్ డే కానుకగా ఫిబ్రవరి 13న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా ప్రమోషన్స్ షురూ చేసింది చిత్రయూనిట్. ఇందులో భాగంగానే సినిమా నుంచి సెకండ్ సింగిల్ రాట్టటాటవ్ (=ఘ్ఘ్ఘుజ) అనే సాంగ్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చింది. ఈ పాటకు దేవ్ పవర్ సాహిత్యం అందించగా.. రామ్ మిరియాల పాడాడు. భీమ్స్ సిసిరిలియో సంగీతం అందించాడు. కామెడీ నేపథ్యంలో రాబోతున్న ఈ చిత్రంలో వీకే నరేష్, వీటీవీ గణేష్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## అదిరిందయ్యా అనిల్!

### ఈసారి ఆ హీరోతో ఈ స్టార్ డైరెక్టర్ సినిమా ఉండనుందా?




అనిల్ రావిపూడి.. వరుస విజయాలతో దూసుకుపోతున్నాడు ఈ యంగ్ డైరెక్టర్.. ప్రతి సంక్రాంతికి ఓ సినిమా దింపుతున్నాడు. వచ్చిన ప్రతిసారి విజయాన్ని అందుకుంటూ దూసుకుపోతున్నాడు. టాలీవుడ్ లో అపజయం ఎరుగని దర్శకుడిగా రాణిస్తున్న అనిల్ రావిపూడి ఇటీవల చిరంజీవితో మన శంకర వరప్రసాద్ గారు సినిమాతో భారీ విజయాన్ని అందుకున్నాడు. గత ఏడాది వెంకటేష్ తో సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో భారీ హిట్ అందుకున్న అనిల్ రావిపూడి. ఈ సంక్రాంతికి మన శంకర వరప్రసాద్ గారు సినిమాతో మరో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నాడు అనిల్. ఈ సినిమా విజయంతో అనిల్ పై ప్రేక్షకుల్లో అంచనాలు భారీగా పెరిగిపోయాయి. మన శంకర వరప్రసాద్ గారు సినిమా ఇప్పటికే కలెక్షన్స్ కుమ్మేస్తుంది. రూ. 400కోట్లకు పైగా వసూల్ చేసి రికార్డులు క్రియేట్ చేస్తుంది. ఇప్పటికీ సక్సెస్ ఫుల్ గా ఈ సినిమా దూసుకుపోతుంది. త్వరలోనే ఈ సినిమా ఓటీటీలోకి రానుంది. ఇక మన శంకర వరప్రసాద్ సినిమా తర్వాత అనిల్ ఎవరితో సినిమా చేస్తారు అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. వెంకటేష్ తో అనిల్ మరోసారి సినిమా చేస్తున్నారని అంటున్నారు. అలాగే అనిల్ మలయాళ స్టార్ హీరో ఫహద్ ఫాజిల్ తో సినిమా చేస్తున్నాడని కూడా సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతుంది. దాంతో అనిల్ క్రేజీ హీరోలను లైనప్ చేసి ఈసారి అదిరిపోయే యాక్షన్ థ్రిల్లర్ సినిమాను ప్లాన్ చేస్తున్నారు అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ లు షేర్ చేస్తున్నారు నెటిజన్స్. ఇదెక్కడి కాంబోరా దేవుడా..! అంటూ నెటిజన్స్ అనిల్ నెక్ట్ సినిమా పై పోస్ట్ లు షేర్ చేస్తున్నారు. ఈ వార్తల్లో నిజమెంత అన్నది తెలియదు కానీ.. నెట్టింట మాత్రం అభిమానులు రచ్చ రచ్చ చేస్తున్నారు. దీని పై త్వరలోనే క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. వచ్చే ఏడాది సంక్రాంతికి కొత్త సినిమాతో వస్తాను అని అనిల్ ఇప్పటికే చెప్పారు.

## తెలుగు ఇండస్ట్రీలో కొత్త హీరోయిన్ల ఎంట్రీ

తెలుగు చిత్ర పరిశ్రమ రాబోయే కొన్నేళ్ల పాటు హీరోయిన్ల కొరత లేకుండా కళకళలాడనుంది. ముఖ్యంగా 2026 నాటికి అనేకమంది కొత్త నాయికలు టాలీవుడ్‌లోకి అడుగుపెట్టనున్నారు. వీరంతా స్టార్ హీరోల సినిమాలతోనే పరిచయం అవుతుండటంతో విడుదలకు ముందే వారి పేర్లు చర్చనీయాంశమవుతున్నాయి. వైజయంతి మూవీస్ బ్యానర్ మహేష్ బాబు అన్న రమేష్ బాబు కుమారుడు జయకృష్ణను హీరోగా పరిచయం చేస్తున్న శ్రీనివాస మంగాపురం సినిమాతో రషా థడానీ హీరోయిన్‌గా తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. ఉయ్యమ్మ పాటతో ఈమె ఇప్పటికే గుర్తింపు పొందారు. వైజయంతి మూవీస్, గీతా ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఆకాశంలో ఒక తార చిత్రంలో దుల్కర్ సల్మాన్ సరసన సాత్విక వీరవల్లి నటిస్తున్నారు. ఈ చిత్రానికి పవన్ సాదినేని దర్శకత్వం





## హిట్ కోసం విజయ్ దేవరకొండ ప్రయత్నాలు.. ప్రత్యేక పాత్రలలో సీనియర్ యాక్టర్స్

యూత్‌లో ప్రత్యేక ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ కెరీర్‌లో మరో కీలక మలుపు చోటు చేసుకోనుంది. గత కొంతకాలంగా సరైన కమర్షియల్ హిట్ కోసం ఎదురుచూస్తున్న ఆయన, తాజాగా వరుస ప్రాజెక్టులతో బిజీ అవుతూ కొత్త స్ట్రాటజీని అమలు చేస్తున్నాడు. ఇటీవల విడుదలైన ‘కింగ్‌డమ్’ ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడంతో, ఇప్పుడు మరింత జాగ్రత్తగా కథల ఎంపికలో ముందుకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో దర్శకుడు రవికిరణ్ కోలా తెరకెక్కిస్తున్న ‘రౌడీ జనార్దన్’ సినిమా ప్రత్యేకంగా నిలుస్తోంది. గ్రామీణ నేపథ్యంలో సాగే పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం విజయ్ కెరీర్‌లో విభిన్నమైన ప్రయత్నంగా భావిస్తున్నారు. టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోలో చూపించిన మాస్ ఎలిమెంట్స్, గ్రామీణ వాతావరణం సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచాయి. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో పాటు బలమైన టెక్నికల్ టీమ్ పనిచేస్తుండటం విశేషం. హీరోయిన్‌గా కీర్తి సురేష్ ఎంపిక కావడం సినిమాకు అదనపు ఆకర్షణగా మారింది. నటీనటుల ఎంపిక విషయంలో దర్శకుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఇండస్ట్రీ వర్గాల సమాచారం.ఇక కథలో భావోద్వేగాలకు కీలకమైన పాత్రల కోసం అనుభవజ్ఞులైన నటులను తీసుకుంటున్నట్లు టాక్ వినిపిస్తోంది. సీనియర్ నటి శోభన ముఖ్యమైన పాత్రలో కనిపించనున్నారన్న వార్త సినిమాకు మరింత ప్రాధాన్యం తీసుకొచ్చింది. అలాగే సీనియర్ హీరో రాజశేఖర్ కూడా ప్రత్యేక పాత్రలో కనిపించే అవకాశాలున్నట్లు చర్చ నడుస్తోంది. భారీ తారాగణం, గ్రామీణ శైలిలో సాగే యాక్షన్ కథాంశం, పీరియాడిక్ టచ్ అన్నీ కలిసి ‘రౌడీ జనార్దన్’ను విజయ్ దేవరకొండకు మాస్ కమ్బ్యాక్ మూవీగా నిలబెడతాయనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108

ధర్మఘంట

# గాంధీ ఆస్పత్రిలో కానిస్టేబుల్ సౌమ్య భౌతికకాయానికి మంత్రి జూపల్లి నివాళి

**సౌమ్య కుటుంబ సభ్యులకు మంత్రి పరామర్శ**

**సౌమ్య కుటుంబానికి 'కోటి' ఎక్స్గ్రేషియా**

**సౌమ్య తమ్ముడికి ప్రభుత్వ ఉద్యోగం.. సౌమ్య సర్వీస్ కాలానికి ప్రభుత్వ వేతనం చెల్లిస్తాం**

**దుండగుల వెన్ను వణికేలా కఠిన చర్యలు.. పరిశీలనలో ఎక్సైజ్ కు ఆయుధాల కేటాయింపు**

**సౌమ్య కుటుంబానికి ఒక్క రోజు వేతనాన్ని అందజేస్తామని ప్రకటించిన ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది**



ధర్మఘంట. హైదరాబాద్, ఫిబ్రవరి 1:

విధి నిర్వహణలో అసాధారణ తెగువ ప్రదర్శించి అసువులు బాసిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో సౌమ్య భౌతికకాయానికి మంత్రి జూపల్లి కృష్ణారావు నివాళులర్పించారు. అనంతరం సౌమ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. సౌమ్య లేని లోటు భర్తీ చేయలేనిదని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. సౌమ్య కుటుంబానికి రూ. కోటి ఎక్స్గ్రేషియా ఇస్తామని, సౌమ్య తమ్ముడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని, సౌమ్య సర్వీస్ కాలం అంటే రిటైర్మెంట్ వయసు వరకు వేతనం చెల్లిస్తామని ప్రకటించారు. విధి నిర్వహణలో ఆమె చూపిన తెగువ, నిబద్ధత స్ఫూర్తిదాయకమని కొనియాడారు ఎక్సైజ్ శాఖ ఉద్యోగులు ఒక్క రోజు వేతనాన్ని సౌమ్య కుటుంబ సభ్యులకు ఇవ్వాలని నిర్ణయం తీసుకొని, తమ సహచరిని కుటుంబానికి అండగా నిలవడం అభినందనీయం అని అన్నారు.

ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది భద్రత ప్రభుత్వ కర్తవ్యమని, భవిష్యత్ లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎక్సైజ్ శాఖ ఉద్యోగుల జోలికి వచ్చే దుండగుల వెన్ను వణికించేలా అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఎక్సైజ్ శాఖ అధికారులకు ఆయుధాలు ఇచ్చే నిర్ణయం తమ ప్రభుత్వ పరిశీలనలో ఉందని, త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. గంజాయి వంటి మాదకద్రవ్యాల ముఠాల పట్ల మరింత కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఎక్సైజ్ శాఖ అధికారులతో కలిసి రెండు నిముషాల మౌనం పాటించి, ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అదనపు కమిషనర్ ఖురేషి, ఎక్సైజ్ శాఖ అధికారుల సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు

# రెనే ఆసుపత్రిలో ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం

ధర్మఘంట, ఫిబ్రవరి 1 కరీంనగర్



ఉత్తర తెలంగాణ జిల్లాలో ప్రముఖ సంతాన సాఫల్య కేంద్రమైన రజిని ఫెర్టిలిటీ కేంద్రంలో శ్రీ లక్ష్మి మహేశ్వర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరాన్ని రెనె గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ బంగారు స్వామి, రజనీ ఫెర్టిలిటీ సెంటర్ చైర్ పర్సన్ రజనీ ప్రియదర్శిని జ్యోతి ప్రజ్వలన గావించి అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 5 ఏండ్లుగా ఉచిత ఇన్ఫర్టిలైటీ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. శిబిరానికి వస్తున్న వారి సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతుందన్నారు. ఈ ఇన్ఫెర్టిలైటీ సమస్య ఏవిధంగా పెరుగుతుందో గమనించాలని, దీనికి మనందరం ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అధిగమించాలని, సరైన ఆరోగ్యకరమైన ఆహారం, రోజూ వ్యాయామం చేయడం, చెడు అలవాట్లైన మద్యం, పొగాకులకు దూరంగా ఉండడాలని కోరారు. ఈ ఉచిత వైద్య శిబిరం ఈ నెల 1నుండి 28 వరకు నిర్వహిస్తున్నామని, నమోదు చేసుకున్న వారి నుంచి లక్కీ డ్రా తీస్తామని చెప్పారు. డ్రాలో పది మంది దంపతులను ఎంపిక చేసి వారికి ఉచితంగా ఐ.వి.ఎఫ్ చికిత్సను అందించడం జరుగుతుందన్నారు. గత 5 సంవత్సరాలుగా ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని భవిష్యత్తులో కూడా ప్రతి ఏడు నిర్వహిస్తామని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. తన తల్లి కీ.శే.బంగారి లక్ష్మి స్మారకార్థం ప్రతి సంవత్సరం ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఇందులో భాగంగా ఉచిత కీలు మార్పిడి వైద్య శిబిరం వచ్చే ఏప్రిల్ నెలలో ఏర్పాటు చేస్తామన్నారు. చిన్నతనంలోనే మేము తండ్రిని కోల్పోయినా మా అందరినీ ఉన్నత విద్య వంతుల్ని చేయడంలో మా తల్లిగారి పాత్ర మరువలేనిది అని, మాకు మంచి విలువలతో కూడిన విద్యా బుద్దులను నేర్పించడం ఆమె చలవేనన్నారు. తమ జీవితం పూర్తిగా వైద్య సేవకే అంకితం అన్నారు, వైద్య రంగంలో వచ్చే ప్రతి ఆధునిక మార్పులను తాము ఎప్పటికప్పుడు గమనిస్తూ పేషెంట్లకు ఎప్పటికప్పుడు తగిన మార్పుల ద్వారా ఆధునిక వైద్య విధానాలు అమలు చేయడంలో ఉత్తర తెలంగాణలోనే రెనే హాస్పిటల్స్ ముందుంటాయని అన్నారు. రాబోయే నెలలో ఉచిత రోబోటిక్ కీలు మార్పిడి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని, 15 మంది అర్హులైన నిరుపేద పేషెంట్లను గుర్తించి డ్రా ద్వారా పూర్తి ఉచితంగా కీలు మార్పిడి వైద్య చికిత్సను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ సురేష్ కుమార్, ఎంబ్రియలాజిస్ట్ డాక్టర్ రాజేందర్, స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ ఫర్హానాజ్, డాక్టర్ మౌనిక, డాక్టర్ సాయిశ్రీ, డాక్టర్ సౌఖ్య, హాస్పిటల్ నాన్ క్లినికల్ డైరెక్టర్ అరవింద్ బాబు, జనరల్ మేనేజర్ పవన్ ప్రసాద్, బయో మెడికల్ ఇంజనీర్ రతన్ లతో పాటు హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# తడిసిన భూభాగాలే జీవావరణానికి ఆధారం

**తడిసిన భూభాగాల పరిరక్షణ ప్రభుత్వ ధ్యేయంగా మారాలి**

**నేడు (ఫిబ్రవరి 2) ప్రపంచ తడిసిన భూభాగాల దినోత్సవ సందర్భంగా**

ధర్మఘంట, ఫిబ్రవరి 02, హైదరాబాద్




ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 2ను, ప్రపంచ తడిసిన భూభాగాల దినోత్సవంగా జరుపుకుంటున్నాము.

1971లో ఇరాన్‌లోని రాంసర్‌లో ఫిబ్రవరి 2 నాడు తడి భూముల ఒప్పందంపై సంతకాలు చేసిన సందర్భంగా ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 2న ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. భూమిపై జీవానికి తడిసిన భూభాగాల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడమే ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యం. ఈ సంవత్సరం ప్రధాన ఇతివృత్తంగా "తడిసిన భూభాగాలు మరియు సంప్రదాయ జ్ఞానం" ప్రకృతి సంరక్షణలో సంప్రదాయ విజ్ఞానానికి ఉన్న చట్టబద్ధమైన, సామాజిక విలువను స్పష్టం చేసిందని, ఈ ఏడాది ప్రకృతి సంరక్షణలో సంప్రదాయ విజ్ఞానాన్ని ప్రధాన అంశంగా ఎంపిక చేశారు.

తడిసిన భూభాగాలు చాలా ముఖ్యమైన సహజ వనరులు. ఇవి మనకు శుభ్రమైన నీటిని అందిస్తాయి. వరదల నుంచి రక్షిస్తాయి. అనేక రకాల పక్షులు, జంతువులు, మొక్కలకు నివాసంగా ఉంటాయి. అలాగే, లక్షలాది మంది ప్రజలకు ఉపాధిని కూడా కల్పిస్తున్నాయి.

తడిసిన భూభాగాలపై ఆధారపడి జీవిస్తున్న ప్రజల సంప్రదాయాలు, జీవన విధానాలు కూడా చాలా విలువైనవి. సంప్రదాయ మత్స్యకారం, వర్షపు నీటి సంరక్షణ, సహజంగా వరదలను నియంత్రించే పద్ధతులు ఎన్నో సంవత్సరాలుగా తడిసిన భూభాగాలను కాపాడుతున్నాయి.

ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ వాటర్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఐడబ్ల్యూఎంఐ) డైరెక్టర్ జనరల్ మార్క్ స్మిత్ మాట్లాడుతూ, తడిసిన భూభాగాలను కేవలం ప్రకృతిలో భాగంగా కాకుండా, మన జీవనంతో ముడిపడి ఉన్న ప్రాంతాలుగా చూడాలని అన్నారు. సంప్రదాయ జ్ఞానం మరియు ఆధునిక శాస్త్రాన్ని కలిపి ఉపయోగిస్తేనే ప్రకృతిని బాగా రక్షించగలమని చెప్పారు.

ఈ దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, పర్యావరణ శుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలి.

తడిసిన భూభాగాల్లో చెత్త వేయకూడదని, అక్రమ ఆక్రమణలు చేయకూడదని ప్రజలకు సూచించాలి.

తడిసిన భూభాగాలు ప్రకృతి ఇచ్చిన అమూల్యమైన సంపద. నీటి భద్రత, వరద నియంత్రణ, జీవ వైవిధ్య పరిరక్షణ వంటి అంశాల్లో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయని, ఈ వాస్తవాన్ని ప్రపంచానికి మరోసారి గుర్తు చేస్తూ ఫిబ్రవరి 2, 2026న ప్రపంచ తడిసిన భూభాగాల దినోత్సవం నిర్వహించబడాలి.

తడిసిన భూభాగాలు కేవలం పర్యావరణ వ్యవస్థలు మాత్రమే కాకుండా, ప్రజల జీవన హక్కుతో నేరుగా అనుసంధానమై ఉన్నాయి. శుభ్రమైన నీరు పొందే హక్కు, సురక్షిత జీవన వాతావరణం వంటి మౌలిక హక్కులు తడిసిన భూభాగాల పరిరక్షణపై ఆధారపడి ఉన్నాయి. అందువల్ల వీటి సంరక్షణ అనేది విధాన పరంగా మాత్రమే కాకుండా, చట్టపరంగా కూడా అత్యంత అవసరమైన అంశంగా మారాలి. 1971లో రాంసర్‌లో తడి భూముల ఒప్పందం అనంతరం 50 యేండ్లకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ ("హైడ్రా") చట్టాన్ని ఏర్పాటు చేశారు. హైడ్రా కమీషనర్ గా ఏవీ రంగనాథ్ ఐపిఎస్ ను నియమించగా వారి నేతృత్వంలో తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాదులో విపత్తు నిర్వహణ, ప్రభుత్వ ఆస్తుల రక్షణ కోసం ప్రభుత్వ ఉత్తర్వుల (జీవో-99) మేరకు జులై 2024లో ఒక స్వతంత్ర సంస్థగా ఏర్పాటైన హైడ్రా, హైదరాబాదులోని చెరువులు, పార్కులు, లేఅవుట్‌లోని ఖాళీ స్థలాలు, ఆట స్థలాలు, నాలాలు, రహదారులు, ఫుట్‌పాత్‌ల పరిరక్షణ, వాటిలోని ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టడం ప్రధాన లక్ష్యంగా, జాతీయ విపత్తుల నిర్వహణ చట్టానికి అనుగుణంగా కఠినంగా వ్యవహరించింది. తద్వారా గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ జిహెచ్ఎంసి పరిమితుల్లో 185 చెరువులతో సహా ఈ ప్రాంతమంతా 600 కి పైగా కుంటలు గుర్తించబడ్డాయి. 'హైడ్రా' తన చెరువులు - కుంటల పరిరక్షణ మరియు పునరుజ్జీవన ప్రయత్నాలలో భాగంగా 12 చెరువులను పునరుద్ధరించింది. ఈ సంస్థ ఆక్రమణలను గుర్తించి చర్యలు తీసుకోవడం ద్వారా 20 చెరువులను పరిరక్షించే పనిని కూడా ప్రారంభించింది. తన పునరుద్ధరణ ప్రణాళికలలో, హైడ్రా పునరుజ్జీవనం కోసం 12 ప్రధాన చెరువులను ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్, హుస్సేన్ సాగర్, మీర్ ఆలం ట్యాంక్, దుర్గం చెరువు, ఫాక్స్ సాగర్ తదితర ఇతర చెరువులను జాబితా చేసింది. తద్వారా రాష్ట్ర జీవావరణానికి ఎంతో మేలు జరుగుతుందని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. తరతరాలుగా వచ్చిన సంప్రదాయ మత్స్యకార విధానాలు, సహజ నీటి సంరక్షణ పద్ధతులు, వరదలను నియంత్రించే స్థానిక జ్ఞానం, తడిసిన భూభాగాలను సుస్థిరంగా కాపాడుతూ వచ్చాయి. ఈ సంప్రదాయాలను నిర్లక్ష్యం చేయడం వల్లే నేడు అక్రమ ఆక్రమణలు, కాలుష్యం, నివాస ప్రాంతాల విధ్వంసం వంటి సమస్యలు పెరుగుతున్నాయి. ఇది పర్యావరణ చట్టాల లక్ష్యాలకు విరుద్ధం. పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన జాతీయ మరియు అంతర్జాతీయ ఒప్పందాలు తడిసిన భూభాగాల రక్షణను ప్రభుత్వాల బాధ్యతగా పేర్కొన్నాయి. అయితే, చట్టాల అమలు లేకుండా ఈ లక్ష్యం సాధ్యం కాదు. తడిసిన భూభాగాల్లో అక్రమ నిర్మాణాలు, చెత్త పారవేత, వనరుల అధిక వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవడం అనివార్యం. తడిసిన భూభాగాల పరిరక్షణ అనేది దయతో చేసే పని కాదు, అది ప్రతి ప్రభుత్వానికి, ప్రతి పౌరుడికి ఉన్న చట్టబద్ధమైన మరియు నైతిక బాధ్యతని 2026 ప్రపంచ తడిసిన భూభాగాల దినోత్సవం మనకు ఇచ్చే స్పష్టమైన సందేశం

## ప్రభుత్వ ఉద్యోగులకు తీపి కబురు

**డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ఆదేశాలతో**

**పెండింగ్ బిల్లులు రూ.720 కోట్లు విడుదల**

**2022 నుంచి 2025 ఫిబ్రవరి వరకు సరెండర్ లీవుల ఎన్ క్యాష్ మనేటి పెండింగ్ మొత్తం ఒకేసారి క్లియర్**

ధర్మఘంట ఫిబ్రవరి 01. హైద్రాబాద్.



ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలను వరుసగా అమలు చేస్తూ వస్తోంది. ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపులకు ప్రభుత్వం గ్రీన్ ఛానల్ లో పెండింగ్ నిధులను నెలవారీగా విడుదల చేస్తూ వస్తుంది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు శుభవార్త చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లుల కోసం రూ. 720 కోట్లు విడుదల చేసింది. జనవరి మాసానికి సంబంధించిన పెండింగ్ బిల్లుల విడుదలకు డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం రూ. 720 కోట్లు విడుదల చేశారు. గత ప్రభుత్వానికి ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బకాయిలకు సంబంధించి ప్రతి నెల రూ.700 కోట్లకు పైగా నిధులు విడుదల చేస్తామని ఉద్యోగ సంఘాలకు ప్రభుత్వం హామీ ఇచ్చింది. గత సంవత్సరం జూన్ నెలాఖరులో రూ.183 కోట్ల రూపాయలు విడుదల చేసింది. ఆ తర్వాత గత సంవత్సరం ఆగస్టు నుంచి ప్రతి నెల కనీసంగా రూ. 700 కోట్ల చొప్పున విడుదల చేస్తూ వస్తోంది. తాజాగా విడుదల చేసిన నిధులలో 2022 నుంచి 2025 ఫిబ్రవరి వరకు సరెండర్ లీవుల ఎన్ క్యాష్ మనేటి పెండింగ్ మొత్తం ఒకేసారి క్లియర్ చేసింది. వీటితోపాటు విడుదలైన బిల్లులో గ్రాట్యుటీ, జిపిఎఫ్, సరెండర్ లీవ్ లు, అడ్వాన్సులు ఉన్నాయి.

## మరో గ్రంథాలయ ఉద్యమం

**హైదరాబాదు నుండి అమరావతి వరకు. ఫిబ్రవరి 1 నుండి 3 తేదీ వరకు.**

**మానవాళి కి ఆలోచనను విస్తృతపరిచింది అక్షరమైతే ప్రపంచ గతిని మార్చేలా చేసింది కూడా పుస్తకమే.**

**సిటీ సెంట్రల్ లైబ్రరీ నుంచి యాత్ర ప్రారంభించబడింది.**

**బస్సు యాత్రను ప్రారంభించిన గ్రంథాలయ చైర్మన్ రియాజ్.**



ధర్మఘంట ఫిబ్రవరి 01. హైద్రాబాద్.

రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ చిన్నతనం నుండే పుస్తకాలు చదివే ఆలోచన పిల్లల్లో రేకెత్తించాలన్నారు యువతరానికి పటనా శక్తిని పెంపొందించడానికి పుస్తకాలు చదవడం నిత్యజీవితంలో భాగంగా చేయాలి అన్నారు పిల్లలకు తమలోని సృజనాత్మకత శక్తులను తెలుసుకునే అవకాశం లేకుండా పోయింది. సెల్ఫోన్ ఇంటర్నెట్ పిల్లలను పక్కదారి పట్టిస్తున్నాయన్నారు సోషల్ మీడియా పోర్నోగ్రఫీ డ్రగ్స్ యువతకు శక్తిహీనులుగా మారుస్తున్నాయి ఇళ్లలోనూ విద్యాలయాలలోనూ గ్రంథాలయాలు అందుబాటులో లేకపోవడం వల్ల జీవితాలను ప్రభావితం చేసే పుస్తకాలు గురించి పిల్లలు తెలుసుకునే అవకాశం లేదు అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ జాన్ బాషా. యాత్రకు రూపకల్పన చేసిన కస్తూరి ప్రభాకర్. కవి యాకుబ్. బండారు విజయ. కాసుల రవికుమార్. సిఏ ప్రసాద్. మంచి కంటి. పుస్తక ప్రేమికులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం.

ధర్మఘంట. హైదరాబాద్ ఫిబ్రవరి 01

విధి నిర్వహణలో సౌమ్య ప్రాణాలు కోల్పోవడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సౌమ్య మృతికి కారణమైన వారి పైన కఠినచర్యలు తీసుకోవాలని ఆయన పోలీసు అధికారులను ఆదేశించారు. సౌమ్య కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని సీఎం హామీ ఇచ్చారు.

ధర్మఘంట

# పౌర హక్కులకు భంగం కలిగితే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందా...?



ప్రజాస్వామ్యం అనేది ప్రజల ఇష్టానుసారం పాలన నడపడానికి రూపొందించబడిన వ్యవస్థ.అయితే,పౌర హక్కులు అనగా వ్యక్తిగత స్వేచ్ఛ,మాట స్వేచ్ఛ,సమానత్వం,న్యాయం వంటి వాటికి భంగం వాటిల్లినప్పుడు ఈ వ్యవస్థ ఎలా వర్ధిల్లుతుంది?అనే ప్రశ్న చరిత్ర, రాజకీయ మరియు మానవ హక్కుల సందర్భంలో చాలా ముఖ్యమైనది.పౌర హక్కుల భంగం ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడానికి ఎలా దారితీస్తుందో,ఇవి పరస్పరం ఎలా ఆధారపడినవో వివిధ అధ్యయనాలు తెలుపుతున్నాయి.ప్రజాస్వామ్యం మరియు మానవ హక్కులు పరస్పరం బలపరిచుకుంటాయని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కార్యాలయం (ఓహెచ్ సీహెచ్ఆర్) పేర్కొంటుంది. ఎందుకంటే ప్రజాస్వామ్యం వ్యక్తి గౌరవాన్ని రక్షించడం,సామాజిక న్యాయాన్ని సాధించడం మరియు శాంతిని పెంపొందించడం లక్ష్యంగా పనిచేస్తుంది.అయితే,ఈ హక్కుల ఉల్లంఘనలు ప్రజాస్వామ్యాన్ని వక్రీకరిస్తాయి మరియు అసమానతలను పెంచుతాయి.

పౌర హక్కులు మరియు ప్రజాస్వామ్యం మధ్య సంబంధం

ప్రజాస్వామ్యం యొక్క మూలస్తంభాలు పౌర హక్కులపై ఆధారపడి ఉంటాయి.మాట స్వేచ్ఛ,సమావేశ స్వేచ్ఛ,మత స్వేచ్ఛ వంటి హక్కులు ఉంటేనే ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తపరచి,పాలకులను ప్రశ్నించి, ఎన్నికల్లో పాల్గొనగలరు. అయితే,ఈ హక్కులు భంగం వాటిల్లినప్పుడు ప్రజాస్వామ్యం బలహీనపడుతుంది.హంగేరీలో కోవిడ్-19 సమయంలో అత్యవసర చట్టాలు ప్రవేశపెట్టి, ప్రభుత్వం పౌర స్వేచ్ఛలను పరిమితం చేసింది,ఇది ప్రజాస్వామ్య సంస్థలను బలహీనపరిచింది.ఇలాంటి పరిస్థితుల్లో ప్రదర్శనలను నిషేధించడం లేదా విమర్శకులను శిక్షించడం వంటివి ప్రజాస్వామ్యాన్ని దుర్బలం చేస్తాయి.ప్రపంచ వ్యాప్తంగా వివిధ అధ్యయనాలు చూపించేది ఏమిటంటే, ప్రజాస్వామ్యం మానవ హక్కుల ఉల్లంఘనలను ఎల్లప్పుడూ నిరోధించదు,ముఖ్యంగా భద్రతా బెదిరింపుల సమయంలో,ప్రజలు బెదిరింపులు ఎదుర్కొంటున్నప్పుడు,ప్రభుత్వాన్ని హక్కుల ఉల్లంఘనలకు బాధ్యత వహించడానికి తక్కువ ఆసక్తి చూపుతారు.అయితే,ఇది ప్రజాస్వామ్యం ఒక మ్యాజిక్ సొల్యూషన్ కాదని సూచిస్తుంది. ఇది మానవ హక్కులను మెరుగుపరచడానికి అదనపు రక్షణలు అవసరం.మరోవైపు, మానవ హక్కులు ప్రజాస్వామ్యాన్ని బలపరుస్తాయి.ఎందుకంటే అవి మైనారిటీలను మెజారిటీ నుండి రక్షిస్తాయి మరియు సమాన ఎన్నికలు,అభిప్రాయ స్వేచ్ఛను నిర్ధారిస్తాయి.చరిత్రలో చూస్తే, పౌర హక్కుల భంగం ప్రజాస్వామ్యాన్ని అస్థిరపరుస్తుంది.సివిల్ సొసైటీ బలహీనంగా ఉండి,అక్షరాస్యత తక్కువగా ఉన్న సమాజాల్లో ప్రజాస్వామ్యం వర్ధిల్లదు మరియు ఇది అస్థిరత్వానికి దారితీస్తుంది.అలాగే,ప్రజాస్వామ్య సంస్థలు మానవ హక్కుల ఉల్లంఘనలను తగ్గించవు.కానీ, ప్రస్తుత స్థాయిల కంటే ఎక్కువ ఉల్లంఘనలను నిరోధిస్తాయి. ఇది ప్రజాస్వామ్యం మంచి అభ్యాసాలను నిర్వహించడంలో సమర్థవంతమైనదని సూచిస్తుంది.కానీ,మార్పులు తీసుకురావడంలో కాదు.

ఉదాహరణలు మరియు ప్రభావాలు

ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యం ఒత్తిడికి గురవుతోంది.కానీ,ఇది ధృడంగా ఉంది.బ్రూకింగ్స్ ఇన్స్టిట్యూట్ ప్రకారం ప్రజాస్వామ్యం బాహ్యాదాడులకు గురవుతున్నప్పటికీ,ప్రజాస్వామ్య అనుకూల ఉద్యమాలు దానిని రక్షిస్తున్నాయి.అయితే, ప్రజాస్వామ్య ప్రక్రియలు బలహీనపడినప్పుడు,పౌరుల హక్కులు మరియు స్వేచ్ఛలు ప్రత్యక్షంగా ప్రభావితమవుతాయి.మెజారిటీ నిర్ణయాలు స్వేచ్ఛలను పరిమితం చేస్తాయి. ఉదాహరణకు అమెరికా చరిత్రలో కనిపించినట్లు జిమ్ క్రో ఎరాలో వోటింగ్ రైట్స్ సప్రెషన్ వల్ల ఆఫ్రికన్ అమెరికన్లు ఎదుర్కొన్న అసమానతలు. మరోవైపు 1964 సివిల్ రైట్స్ యాక్ట్ మరియు 1965 వోటింగ్ రైట్స్ యాక్ట్ వంటి చట్టాలు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేశాయి.ఎందుకంటే అవి వోటింగ్ రైట్స్‌ను రక్షించి, ఎన్నికల్లో పాల్గొనే అవకాశాలను పెంచాయి.ఇటీవలి చర్చలలో కూడా మైనారిటీలను మెజారిటీ నుండి రక్షించడం,ప్రభుత్వ జోక్యం స్థాయి వంటి అంశాలు ప్రజాస్వామ్య వృద్ధికి అవసరమని చర్చించబడుతున్నాయి. ఉదాహరణకు అమెరికాలో రీసెంట్ ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ పాలసీలు సివిల్ రైట్స్ ప్రొటెక్షన్స్‌ను రోల్ బ్యాక్ చేసి, ఎకనామిక్ ఇన్‌జస్టిస్ పెంచాయి, ఇది డెమాక్రటిక్ థ్రెట్‌గా పరిగణించబడుతుంది.మొత్తంగా పౌర హక్కులకు భంగం వాటిల్లినప్పుడు ప్రజాస్వామ్యం వర్ధిల్లదు.బదులుగా ఇది బలహీనపడి,అస్థిరత్వానికి దారితీస్తుంది.మానవ హక్కులు మరియు ప్రజాస్వామ్యం ఒకే నాణానికి రెండు వైపులా ఉన్నాయి,ఒకటి లేకుండా మరొకటి ఉండదు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి,పౌర హక్కుల రక్షణను ప్రాధాన్యత ఇవ్వాలి మరియు ప్రజాస్వామ్య అనుకూల ఉద్యమాలు దీనిని సాధించడంలో కీలకం.ఇది మాత్రమే సమాజాన్ని స్థిరంగా, న్యాయవంతంగా చేస్తుంది.

గంట సోమన్న,సీనియర్ జర్నలిస్ట్.

# ఎన్నికల్లో వ్యూహాత్మంగా వ్యవహరించాలి

## Xమానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి





ధర్మఘంట, ఫిబ్రవరి 1 మానకొండూర్

,కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపు కోసం వ్యూహాత్మకంగా ముందుకు సాగాలని టీపీసీసీ ఎస్సీ సెల్ అధ్యకుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఎల్ఎండీ కాలనీలో తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యకుడు బండారి రమేశ్ అధ్యక్షతన జరిగిన మండల పార్టీ ముఖ్యనాయకుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కార్పొరేషన్ ఎన్నికలను ఆషామాషీగా తీసుకోవద్దని, గెలుపు కోసం అందరం కష్టపడి పని చేయడమే కాకుండా వ్యూహాత్మకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. 8వ డివిజన్ అభ్యర్థి గోపు మల్లారెడ్డి గెలుపే లక్ష్యంగా మనమంతా పని చేయాలన్నారు. ముఖ్యంగా ఆయన మద్దతుగా నిర్వహించే ప్రచార కార్యక్రమాల్లో మండలానికి చెందిన పార్టీశ్రేణులంతా పాల్గొనాలని ఆయన కోరారు.జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయడం వల్ల ప్రయోజనాలేమిటో ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. 8వ డివిజన్ తోసహా కార్పొరేషన్ పరిధిలోని 66 డివిజన్లలో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎన్నికల్లో ప్రత్యేక కార్యాచరణతో పని చేస్తేనే గెలుపు ఖాయమవుతుందన్నారు.

8వ డివిజన్ అభ్యర్థి గోపు మల్లారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో పార్టీ నాయకులు, కార్యకర్తలంతా భాగస్వాములు కావాలని కోరారు. ఎలాంటి భేషజాలు లేకుండా పార్టీ గెలుపు కోసం పని చేయాలని ఆయన కోరారు.

ఈ సమావేశంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్నారెడ్డి, 8వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యకుడు తమ్మనవేణి రమేశ్ యాదవ్, మాజీ డివిజన్ కార్పొరేటర్ సల్ల రవీందర్, పార్టీ నాయకులు కంది లక్ష్మినారాయణరెడ్డి, చిందం కిష్టయ్య, కంది అశోక్ రెడ్డి, దాసం నాగేందర్, జాప రాఘవరెడ్డి, జాప మల్లారెడ్డి, మామిడి నరేందర్ రెడ్డి, ప్రశాంత్ గౌడ్, పొన్నాల సంపత్, శ్రీగిరి రంగారావు, కుంట రాజేందర్ రెడ్డి, బుధారపు శ్రీనివాస్,చింతల లక్ష్మారెడ్డి, తమ్మనవేణి రాములు యాదవ్, ఐతం మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

# చప్పట్ల కోసం కేటాయింపులు... ప్రజలను ముంచటానికి కోతలు

**కాగితాలపై పులులు, ఖర్చులో పిల్లులు**

**మోదీ బడ్జెట్ అంటేనే మోసాల పత్రం**

**తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మ**



ధర్మఘంట ఫిబ్రవరి 01 భువనగిరి

మాటలు కాదు చేతలు చూడాలి అంటారు కానీ, మోదీ ప్రభుత్వం మాటలతో మభ్యపెట్టి,చేతలతో ప్రజలను ముంచుతోందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు.ఈ బడ్జెట్ మొత్తం ప్రజల కోసం కాదని,ఉత్పత్తి వర్గాల కోసం కాదని,కార్మికులు కర్షకులు గ్రామీణ పేదల కోసం అసలు కాదని,ఇది కార్పొరేట్ల కోసం రూపొందించిన లెక్కల మాయాజాలం మాత్రమేనని అన్నారు.ప్రధానంగా గ్రామీణ అభివృద్ధి,విద్య,వైద్యం,వ్యవసాయం,సామాజిక సంక్షేమం వంటి రంగాలకు కోతలు పెట్టారని విమర్శించారు.ప్రధాన రంగాల్లో కోతలు ఇలా ఉన్నాయని విద్య రూ.1,28,650ణ రూ.1,21,949 కోట్లు,వైద్యం: రూ.98,311ణ రూ.94,651 కోట్లు,వ్యవసాయం మరియు అనుబంధ రంగాలు: రూ.1,58,838 ణరూ.1,21,949 కోట్లు,గ్రామీణ అభివృద్ధి: రూ.2,65,817ణ రూ. 2,12,750 కోట్లు,సోషల్ వెల్ఫేర్: రూ.60,052ణ రూ.50,000 కోట్లు,అర్బన్ డెవలప్మెంట్: రూ.96,777ణ రూ.57,000 కోట్లు,హౌసింగ్:రూ.52,000ణ రూ.34,000 కోట్లు,జల జీవన్ మిషన్ (గ్రామీణ మంచినీరు): రూ.67,000ణ రూ.17,000 కోట్లు,ఇవే కాదు,అంగన్‌వాడీ: రూ.4,000 కోట్లు కోత,ఎస్సీ పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్:రూ.1,000 కోట్లు కోత,ఎస్టీ సంక్షేమం:రూ. 2,500 కోట్లు కోత విధించిందన్నారు.ఉపాధి హామీ పథకానికి కేటాయించిన నిధులు కొత్త పనుల కోసం కాదని,పాత బకాయిలు తీర్చడానికే సరిపోతాయని తెలిపారు.125 పనిదినాలు ఇస్తామంటూ రూ. 95,000 కోట్లు కేటాయించామని గొప్పలు చెప్పడం నిజానికి ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు.నిజంగా 125 రోజులు పని ఇవ్వాలంటే కనీసం రూ.3 లక్షల కోట్లు కావాలని అది ఇవ్వకుండా “గరీబీ హటావో” అని మాట్లాడడం పచ్చి అబద్ధమన్నారు.మోడీ ప్రభుత్వం బడ్జెట్ ప్రజల సంక్షేమం కోసం కాదని కార్పొరేట్ల శ్రేయస్సుని అన్నారు.ఈ బడ్జెట్‌తో సంక్షేమం పోయి కార్పొరేట్ శ్రేయస్సు వచ్చిందని,లౌకికతత్వం పక్కన పెట్టి హిందుత్వం వైపు మళ్లింది. ఇది ప్రజలకు నష్ట మని ధనవంతులకు మాత్రమే మాలాభమని తెలిపారు.ఈ బడ్జెట్ కు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

## మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్ధులను గెలిపించాలి

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి.**



ధర్మఘంట, ఫిబ్రవరి 1 కరీంనగర్:

రానున్న మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, అభివృద్ధికి పట్టం కట్టాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, విఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వాకర్స్ తో కలిసి ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యంగా 200 యూనిట్ల ఉచిత కరెంటు, సన్న బియ్యం, రైతులకు రైతుబంధు, ఇందిరమ్మ ఇళ్ళు, రుణమాఫీ, అదేవిధంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఇలాగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని అన్ని డివిజన్లో ఘన విజయం సాధించడానికి చేయూతనివ్వాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, ప్రజలకు అన్ని విధాలుగా తోడ్పాటునందిస్తున్నదన్నారు. తెలంగాణలో అనేక పెట్టుబడులు తీసుకురావడం అదేవిధంగా విద్యార్థులకు చక్కటి విద్యతోపాటు వసతులు కల్పించడం చాలా హర్షించదగ్గ విషయమని, ప్రధానంగా వ్యవసాయ రంగంలో ఇతర రాష్ట్రాలకు దీటుగా తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి సాధిస్తున్నది హర్షం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థిస్తు అభివృద్ధికి సహకరించాలని కోరారు. వాకర్స్ ని కలిసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రోత్సాహపరచాలని విన్నవించారు. కరీంనగర్ లో కాంగ్రెస్ విజయం తథ్యమని, తెలంగాణ రాష్ట్రంలో సైతం కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాలలో అఖండ విజయం నమోదు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.వారి వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, విఎన్ఆర్ ఫౌండేషన్ కార్యకర్తలు ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీ లో భారీగా చేరికలు...



ధర్మఘంట,ఫిబ్రవరి01,రామగుండం:

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో స్థానిక ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ చేస్తున్న అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీ విధివిధానాలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై ఆకర్షితులై రామగుండం కార్పొరేషన్ లోని 46వ డివిజన్ ఇందిరానగర్ కు చెందిన కన్నూరి సతీష్, కన్నూరి సురేష్ లతోపాటు పలువురు నాయకులు బి ఆర్ ఎస్ పార్టీని విడి కాంగ్రెస్ పార్టీలో అధికారికంగా చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి హృదయపూర్వకంగా స్వాగతం పలికారు.అలాగే ఆర్యవైశ్య భవన్ లో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో 60డివిజన్ కు చెందిన మోతు పాటి స్వప్న, 17వ డివిజన్ కు చెందిన పోలవేణి రమేష్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాధారంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీపై విశ్వాసంతో పార్టీలో చేరిన నాయకుల సేవలు ప్రజలకు మరింత చేరువయేలా కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతనంగా చేరిన నాయకులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## 35వ డివిజన్లో కాంగ్రెస్ అభ్యర్థి ఇంటింటి ప్రచారం



ధర్మ ఘంట ఫిబ్రవరి 1, నల్గొండ:

నలగొండ మున్సిపల్ కార్పొరేషన్ 35వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి ఇటికాల మంగమ్మ శ్రీనివాస్ ఆదివారం ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 11న కార్పొరేషన్ ఎన్నికల్లో చేయి గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో వార్డు అభివృద్ధితోపాటు నల్గొండ పట్టణం ఎంతో అభివృద్ధి జరుగుతుందని తెలిపారు.అధికార పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే అభివృద్ధి జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇటికాల శ్రీకాంత్, తాటి శ్రీను, శివకుమార్, మల్లేష్, మత్స్యగిరి, భద్రయ్య, పసునూరి రాములు, ఐత రాజు ప్రసాద్, గుండెబోయిన నాగరాజు, కల్లెట్ల యాదయ్య, డివిజన్ ప్రజలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# అల్గునూర్ లో కవ్వంపల్లి విస్తృత ప్రచారం





**ధర్మఘంట, ఫిబ్రవరి 1 మానకొండూర్;**

అభివృద్ధిలో అల్గునూరు అగ్రగామిగా నిలవాలంటే కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గోపు మల్లారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రజలను కోరారు.ఆదివారం కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని 8వ డివిజన్ అల్గునూర్ లో కాంగ్రెస్ అభ్యర్థి గోపు మల్లారెడ్డితో కలిసి ఆయన విస్తృత ప్రచారం నిర్వహించారు. అంతేకాకుండా వివిధ సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కార్పొరేషన్ ఎన్నికల్లో అభివృద్ధికి ప్రజలు పట్టంగట్టాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక గ్రామాలు, పట్టణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నదని, అందులో భాగంగానే అల్గునూర్ గ్రామంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. అధికార పార్టీకి చెందిన వారిని గెలిపించుకుంటే అభివృద్ధి వేగవంతమవుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు చెందిన ప్రజల సంక్షేమానికి పాటుపడుతున్నదన్నారు. నిరుపేదలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని ఆయన చెప్పారు. అందరికీ అందుబాటులో ఉండే గోపు మల్లారెడ్డిని కార్పొరేటర్ గా గెలిపించాలని ఆయన కోరారు.ఈ ప్రచార కార్యక్రమంలో

8వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి గోపు మల్లారెడ్డి, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యకుడు తమ్మనవేణి రమేష్ యాదవ్, మాజీ డివిజన్ కార్పొరేటర్ సల్ల రవీందర్, పార్టీ నాయకులు మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నారెడ్డి, కంది లక్ష్మినారాయణరెడ్డి, చిందం కిష్టయ్య, కంది అశోక్ రెడ్డి, దాసం నాగేందర్, జాప రాఘవరెడ్డి, జాప మల్లారెడ్డి, సింగం శ్రీనివాస్, మామిడి నరేందర్ రెడ్డి, ప్రశాంత్ గౌడ్, పొన్నాల సంపత్, ఐతం మహేశ్, అట్ల అనిల్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

"క్లాస్మేట్ల మద్దతు"

కాంగ్రెస్ అభ్యర్థి గోపు మల్లారెడ్డికి అతని క్లాస్మేట్లు మద్దతు ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం వారంతా కలిసి మద్దతు తెలపడమే కాకుండా ఆయన తరపున ప్రచారం కూడా నిర్వహించారు.

"కౌండిన్య యూత్ సభ్యులమద్దతు"

గోపు మల్లారెడ్డికి కౌండిన్య యూత్ క్లబ్ సభ్యులు మద్దతు ప్రకటించారు. ఈమేరకు ఆదివారం మల్లారెడ్డిని కలిసి ఆయనకు మద్దతు తెలిపారు. గెలుపు కోసం తమ వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారు.

# తెలంగాణ పట్ల కేంద్రం మరోసారి వివక్ష చూపింది

**మంత్రి పొన్నం ప్రభాకర్**

**నర్సంపేట ఎమ్మెల్యే కార్యాలయంలో మీడియా సమావేశం**

**ధర్మఘంట ఫిబ్రవరి 01 నర్సంపేట**



తెలంగాణపై కేంద్ర బడ్జెట్ లో మరోసారి మొండి చేయి చూపిందని,మేము అడిగినవి ఏ ఒక్కటి మాకు ఇవ్వలేదని,తెలంగాణ ప్రజలందరూ ఈ బడ్జెట్ లో అయినా కేంద్రం వివక్షపూరితంగా కాకుండా క్రమశిక్షణతో న్యాయబద్ధంగా కేటాయిస్తారని ఆశగా ఎదురు చూసామని,గత ఏడాది కేంద్రం తెలంగాణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవరిచినప్పుడు శాసన సభ వేదికగా కేంద్రాన్ని నిలదీయడం జరిగిందని,రాష్ట్రానికి కావలసిన అంశాలపై ముఖ్యమంత్రి,రాష్ట్ర మంత్రులు ప్రధాన మంత్రి,కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తి చేయడం జరిగిందని,అయినా వివక్ష చూపారని,అందుకే

తమిళనాడు మాదిరి ఇక్కడ కూడా రాష్ట్ర ప్రయోజనాల కోసం ఐక్యంగా ఉద్యమించాలని రాష్ట్ర రోడ్డు,రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.ఆదివారం మహబూబాబాద్ జిల్లా నర్సంపేట ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి,డీసీసీ అధ్యక్షులు ఆయుభ్,అశోక్ గౌడ్ లతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ ప్రోగ్రెసివ్ గ్రోత్ ఉన్న రాష్ట్రమని, దేశంలో 29 రాష్ట్రాల్లో తెలంగాణలో పార్టీలకు అతీతంగా తెలంగాణ అభివృద్ధికి 2047 తో ముందుకు పోతున్నామన్నారు.హైదరాబాద్ అన్ని రకాల వాతావరణాలకు అనుగుణంగా ఉపాధి అవకాశాలు భూగర్భ వనరులు, ప్రకృతి అంశాలు ఐటీ రంగం దేశంలోనే నెంబర్ వన్ హైదరాబాద్ విస్తరణ పెరుగుతున్నప్పుడు,కోర్ అర్బన్ విస్తరిస్తున్నప్పుడు రీజనల్ రింగ్ రోడ్డు అడిగామని,రింగ్ రోడ్డుకి రీజనల్ రింగ్ రోడ్డుకి మధ్య రోడ్ల అభివృద్ధి అడిగినా కేంద్రం మొండి చేయి చూపిందన్నారు.

మూసి అభివృద్ధికి నిధులు అడిగాం

ఆంధ్రప్రదేశ్ కి నిధులు అడగడం పట్ల ఎందుకు ఇచ్చారని మేము అడగడం లేదని,ఆ ప్రభుత్వం మీదనే మోడీ ప్రభుత్వం ఆధారపడి ఉందన్నారు.మాది చిన్న వయసు గల రాష్ట్రం,గత 10 సంవత్సరాలుగా గత ప్రభుత్వం కేంద్రంతో సయోధ్య లేకుండా మాకు రావాల్సినవి అడగలేకపోయిందని,మేము అలా కాదని,రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రధాన మంత్రి దృష్టికి తీసుకుపోయినా వివక్ష చూపిస్తున్నారన్నారు.ప్రతిపక్ష పార్టీలను విమర్శిస్తున్న ప్రధాన మంత్రి,కేంద్ర మంత్రులను మా ముఖ్యమంత్రి తెలంగాణ ప్రయోజనాల కోసం కలుస్తున్నా తెలంగాణ పట్ల వివక్ష చూపిస్తున్నారన్నారు.ప్రపంచంలో ప్రతి కార్యక్రమానికి హాజరయ్యే వ్యక్తి కుంభమేళ లాంటి మేడారం జాతరకు ఎందుకు రాలేదని,తెలంగాణ ప్రజల ఆకాంక్ష తల్లిని చంపి బిడ్డను ఇచ్చారని మమల్ని అవమానించారని,బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు.కేంద్రం తెలంగాణకి ఇచ్చిన మొండి చేయిపై గత ఉద్యమం మాదిరి మరో ఉద్యమం చేయడానికి సకల జనులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

తెలంగాణ నుండి 8 మంది ఎంపీలు ఉన్నారు

తెలంగాణ ప్రభుత్వం దేవాలయ అభివృద్ధికి జాతరకి ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని,మేడారం జాతరకి 4 వేల బస్సులు నడిపిందని,ప్రత్యేకంగా బస్సులకు కేటాయించిన రూట్లలో అనేక వాహనాలు వచ్చాయన్నారు.మా ఆర్టీసీ డ్రైవర్లకు,కండక్టర్లకు సెల్యూట్ చేస్తున్నానని,విమర్శలు పట్టించుకోవద్దన్నారు.50 వేల బారికేడ్లు వేశామని,నిరంతరం మా సిబ్బంది శ్రమించారని,మా సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఎక్కడ ఇబ్బందులు జరగలేదని,మా పొరపాటు ఎక్కడా లేదన్నారు. జాతర కోసం నిరంతరం శ్రమించిన సిబ్బందికి అభినందనలు తెలిపారు. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో 7 మున్సిపాలిటీలు ఉన్నాయని,నేను ఈ పార్లమెంట్ కి మున్సిపల్ ఎన్నికలకు సమన్వయకర్త గా ఇక్కడికి వచ్చానన్నారు.మహబూబాబాద్ లో ఉన్న 156 స్థానాలు గెలవాలని లక్ష్యంగా పెట్టుకున్నామని,ఈ మున్సిపాలిటీలు అన్ని కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానాలేనని,ఈ ఏడు మున్సిపాలిటీలలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.గత 10 సంవత్సరాలుగా ఒక్క డబుల్ బెడ్ రూం ఇళ్లు రాలేదని,మేము నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని,రేషన్ కార్డులు,సన్న బియ్యం,200 యూనిట్ల ఉచిత విద్యుత్,500 కి గ్యాస్,రైతు భరోసా,రైతు రుణమాఫీ, మహిళలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామన్నారు.నర్సంపేట మున్సిపాలిటీలో ఇప్పటికే అభ్యర్థుల ఎంపిక కొలిక్కి వచ్చిందని,వారికి బిఫార్మ్ అందించగా గ్రౌండ్ లో ప్రచారం నిర్వహిస్తున్నారన్నారు.అర్బన్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి ప్రణాళిక బద్ధంగా ముందుకు పోతున్నామని, రోడ్లు,డ్రైనేజీ,ఉపాధిఅవకాశాలు మెరుగుపర్చడానికి ప్రత్యేక కార్యాచరణ తీసుకున్నామని పేర్కొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుస్తాం

**ధర్మఘంట ఫిబ్రవరి 01 కరీంనగర్;**

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ గణనీయమైన విజయాలు సాధించిందని, ప్రస్తుత పురపాలక సంఘాల ఎన్నికలలోనూ అదే ఒరవడి కొనసాగిస్తుందని పార్టీ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజిరెడ్డి తెలిపారు. ప్రజల్లో పార్టీకి పెరుగుతున్న ఆదరణకు ఈ ఫలితాలు నిదర్శనంగా నిలుస్తాయని పేర్కొన్నారు.గత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో 224 మంది అభ్యర్థులను బరిలో దింపగా, 102 స్థానాల్లో ఫార్వర్డ్ బ్లాక్ ఘన విజయం సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇది ప్రజలు తమ పార్టీపై పెట్టుకున్న నమ్మకానికి ప్రతీక అని ఆయన అన్నారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 2 జడ్పీటీసీ స్థానాలు, 49 ఎంపీటీసీ స్థానాలను ఫార్వర్డ్ బ్లాక్ గెలుచుకోవడం గర్వకారణమని తెలిపారు.గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజా సమస్యలపై పోరాడినందుకే ఈ విజయాలు సాధ్యమయ్యాయని చెప్పారు.గత మున్సిపల్ ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొత్తం 17 స్థానాలను పార్టీ కైవసం చేసుకుందని తెలిపారు. చొప్పదండిలో 1, పెద్దపల్లిలో 1, రామగుండంలో 9, కరీంనగర్‌లో 3, జగిత్యాలలో 1, రాయికల్‌లో 2 స్థానాల్లో ఫార్వర్డ్ బ్లాక్ విజయం సాధించిందన్నారు. ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 230 మంది అభ్యర్థులను బరిలో దింపినట్లు వెల్లడించారు. ఈసారి మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుస్తాం. ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఫార్వర్డ్ బ్లాక్ వైపు చూస్తున్నారని ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్‌లో బీఆర్ఎస్, బీజేపీలు కుమ్మక్కై రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. పైకి ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ, లోపల మాత్రం స్పష్టమైన అవగాహనతో వ్యవహరిస్తున్నాయన్నారు.



ప్రజలు ఈ కుమ్మక్కు రాజకీయాలను గమనిస్తున్నారని తెలిపారు.రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అధికార పార్టీ నేతలు కేవలం ప్రకటనలకే పరిమితమయ్యారని, క్షేత్రస్థాయిలో సంక్షేమ పథకాలేవి ప్రజలకు అందడం లేదన్నారు. ఈ ప్రభుత్వ వైఫల్యమే రాబోయే ఎన్నికల్లో తేలిపోతుందని జోజిరెడ్డి చెప్పారు.రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో అభ్యర్థులను నిలిపి, అత్యధిక స్థానాలు గెలుచుకోవడమే లక్ష్యంగా ఫార్వర్డ్ బ్లాక్ పనిచేస్తుందని స్పష్టం చేశారు."ప్రజల మద్దతుతో ఫార్వర్డ్ బ్లాక్‌ను మరింత బలమైన రాజకీయ శక్తిగా తీర్చిదిద్దుతాం" అని అంబటి జోజిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## విద్యతో పాటు విలువలను పెంపొందించుకోవాలి

**విద్యార్థి దశలో ఇంటర్ విద్య ముఖ్యం**

**-ఎంజీయూ టీపీడీఎంఏ అధ్యక్షులు తీకుళ్ల శ్రీనివాస్ రెడ్డి**




**ధర్మ ఘంట ఫిబ్రవరి 01,సూర్యాపేట**

విద్యార్థులు విద్యలో రాణించడంతోపాటు విలువలను పెంపొందించుకోవాలని మహాత్మా గాంధీ యూనివర్సిటీ పరిధిలో తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల యాజమాన్యం సంఘం అధ్యక్షులు తీకుళ్ల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సాయిగౌతమి జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సాయి గౌతమి జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యతో పాటు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అవసరమైన అన్ని నైపుణ్యాలను, విలువలను నేర్పిస్తున్నట్లు తెలిపారు.కార్పొరేట్ కళాశాలకు ధీటుగా ఇంటర్ విద్యలో సాయి గౌతమి కళాశాల ముందంజలో ఉందని అన్నారు.పేద విద్యార్థులకు ఫీజులో రాయితీ ఇవ్వడంతో పాటు ఉన్నతంగా రాణిస్తున్న విద్యార్థులకు చేయూతను అందిస్తున్నట్లు తెలిపారు. కళాశాల అభివృద్ధికి సహకరిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు.విద్యార్థులకు నేర్చుకోవాలనే తపన ఉంటే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని తెలిపారు. మహాత్మా గాంధీ యూనివర్సిటీ పరిధిలో టాప్ కాలేజీ అయినా స్పందన డిగ్రీ కళాశాలలో నాణ్యమైన విద్యతోపాటు విద్యార్థులకు ప్లేస్మెంట్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.అంతకుముందు గ్రూప్ వన్ ఆఫీసర్,ఆ కళాశాల పూర్వ విద్యార్థి నరేష్ ను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ యరగాని లక్ష్మయ్య గౌడ్, కరస్పాండెంట్ భగవాన్ రెడ్డి, కళాశాల డైరెక్టర్ తీకుళ్ల సోమిరెడ్డి, శేరి శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సింహం గుర్తుపై ఓటేసి ఆడబిడ్డగా ఆదరించండి



**ధర్మ ఘంట ఫిబ్రవరి 1, నల్గొండ**

ఈ నెల 11న నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో సింహం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి మీ ఆడబిడ్డగా ఆదరించాలని 11వ డివిజన్ అభ్యర్థి పాలకూరి సుమలత సంతోష్ గౌడ్ డివిజన్ ప్రజలను కోరారు. ఆదివారం డివిజన్ ప్రజలతో కలిసి ఇంటింటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ డివిజన్లో అనేక సమస్యలు ఉన్నాయని ఆ సమస్యలు పరిష్కరిస్తూ స్వచ్ఛంద సేవ కార్యక్రమాలు నిర్వహిస్తానని అదేవిధంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ అండగా ఉంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో పజ్జూరి శేఖర్ గౌడ్,పాలకూరి నాగరాజు, పజ్జూరి ప్రదీప్, దండం పెల్లి అనిల్,ఎండి ఆశిఫ్, పాలకూరి పద్మ,పరమేష్, అనిత, జయమ్మ, ధనమ్మ, అంజయ్య, కృష్ణయ్య, దేవేందర్,కాలనీవాసులు, అభిమానులు,తదితరులు పాల్గొన్నారు.

## మూడు కర్తవ్యాలే లక్ష్యంగా కేంద్ర బడ్జెట్

**బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి**

**ధర్మఘంట,ఫిబ్రవరి 1 కరీంనగర్**



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ సబ్ కా సాత్ , సబ్ కా వికాస్ , సమ్మిళిత ఆర్థిక అభివృద్ధి, ప్రజలందరి ఆకాంక్షల్ని నెరవేర్చడం లాంటి మూడు కర్తవ్యాలే లక్ష్యంగా చారిత్రకమైన బడ్జెట్ ను ప్రవేశపెట్టారని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. బడ్జెట్ కేటాయింపులపై హర్షం వ్యక్తం చేస్తూ గంగాడి కృష్ణారెడ్డి ఆదివారం రోజున మీడియాకు ప్రకటన విడుదల చేశారు. వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా , ప్రపంచ మార్కెట్లో పోటీ పడేవిధంగా, భారత ఆర్థిక ప్రయాణం స్థిరంగా స్థిరంగా కొనసాగించే విధంగా అద్భుతమైన బడ్జెట్ ప్రవేశపెట్టారని తెలిపారు. బడ్జెట్ ప్రధానంగా ఉపాధి కల్పన, మధ్యతరగతికి ఊరట, టెక్నాలజీ అభివృద్ధి పై దృష్టి సారించిందన్నారు. ఆదాయపు పన్ను, వ్యక్తిగత ఆర్థిక అంశాలు, వేతన జీవులకు ప్రయోజనం చేకూర్చేలా కొత్త పన్ను విధానంలో మరిన్ని మార్పులు చేయడం శుభపరిణామన్నారు. ఉపాధి, నైపుణ్య అభివృద్ధి నిరుద్యోగతను తగ్గించేందుకు ప్రభుత్వం ఐదు ప్రధాన పథకాలను బడ్జెట్లో ప్రకటించడం హర్షనీయమన్నారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, డిజిటల్ అగ్రికల్చర్ వచ్చే మూడేళ్లలో 6 కోట్ల మంది రైతులకు డిజిటల్ పద్ధతిలో భూమి వివరాలు, పంటల నమోదు కల్పించడం, కోటి మంది రైతులకు ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించేలా ప్రోత్సకాలు అందించడం , నూనె గింజల సాగును పెంచేందుకు ఆత్మనిర్భర్ ఆయిల్ సీడ్స్ అభియాన్ బలోపేతం లాంటి చర్యలు వ్యవసాయ రంగానికి నూతన ఉత్తేజం ఇచ్చేలా ఉన్నాయన్నారు. బడ్జెట్ కేటాయింపుల పట్ల బిజెపి జిల్లా శాఖ పక్షాన హర్షం వ్యక్తం చేస్తూ, ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా చెప్పారు.